

మూడు ఐసీడీఎస్ ప్రాజెక్టులకు నిలిచిన గుడ్డు

- ఓ వారం పంపిణీకి నోచుకోని వైనం
- పోషకాహారానికి తూట్లు
- ఆదిలోనే సరఫరాలో అంతరాయం

వివరాలు 6లో

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



16 కడప

ఆదివారం 13 ఆగస్టు 2017

వర్షాకాలంలోనూ నీటి పాట్లే..

పులివెందుల్లో దాహం.. దాహం...

పులివెందుల పురపాలిక ప్రజలు దాహంతో అలమటిస్తున్నారు. ఇదేదో వేసవి కాలంలో వచ్చిన సమస్య కాదు. గత ఏడాది నుంచి వేసవి, వర్షాకాలం అనే తేడా లేకుండా ఇక్కడ తాగునీటి సమస్య తాండవిస్తోంది. ఏ వార్డులో చూసినా నీటి గాథలే. ట్యాంకర్లతో చాలీచాలని విధంగా నీరందిస్తున్నారు. ట్యాంకర్ నీరు కావాలంటే పలుకుబడి ఉంటేనే అది వస్తుంది. లేదంటే పక్కవీధిలోకో, మరో ప్రాంతానికెళ్లి తెచ్చుకోవాల్సిందే. ఉన్న మున్సిపాలిటీ బోర్లలో భూగర్భ జలాలు అడుగంటాయి. నమ్ముకున్న బోర్లలో నీటి జాడ కనుమరుగుతో మున్సిపల్ అధికారులకు దిక్కుతోచడం లేదు. ప్రతి రోజు పులివెందుల మున్సిపాలిటీకి 6.9 మిలియన్ లీటర్ల (ఎంఎల్‌డీ) నీరు అవసరం ఉంది. ఎంత నీరు ప్రజలకు అందిస్తున్నారో కూడా మున్సిపల్ అధికారులు చెప్పలేని స్థితిలో ఉన్నారు.



6

మరణించినా.. జీవించు!

నేడు జాతీయ అవయవ దాన దినోత్సవం

వివరాలు మధ్య పేజీలలో

అవయవ దానంతో ప్రాణదాతలయ్యే అవకాశం



ఇసుక ఇక చౌక

- అధికంగా వసూలు చేస్తే కఠిన చర్యలు
- రూ. 2 లక్షల జరిమానా... రెండేళ్ల జైలు
- అందరికీ అందుబాటు ధరలు

రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ఉచిత ఇసుక ధర నియంత్రణ కమిటీ ఏర్పాటు చేసిన తరువాత జిల్లాలో ఇసుక పేద, మధ్యతరగతి వారికి చౌకగా లభించనున్నది. దీంతో అన్ని వర్గాల వారికి ఇసుక అందుబాటులోకి రానుంది. అధిక ధరలు వసూలు చేస్తే రూ. 2 లక్షల జరిమానా, రెండేళ్ల జైలు శిక్ష విధించే అధికారం ప్రభుత్వం కల్పించింది. రాష్ట్ర ప్రభుత్వం మొదట ఇసుక క్వారీలను స్వయం సహాయక సంఘాలకు అప్పగించింది. అయితే జిల్లాలో ఆశించిన స్థాయిలో స్వయం సహాయక సంఘాలు క్వారీలను నడపలేక పోయాయి. అంతేకాకుండా స్వయం సహాయక సంఘాలపై స్థానిక రాజకీయ నేతల పెత్తనం అధికం కావడంతో ఆయా ఇసుక క్వారీలు విఫలమయ్యాయి. దీంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వాదాయాన్ని వదులుకొని ఉచిత ఇసుక విధానాన్ని ప్రవేశపెట్టింది.



6

గండి.. భక్తజనమండి...



వివరాలు మధ్య పేజీలలో

శ్రీరాముడు తన బాణం ములితో చెక్కి తయారుచేసిన గండి వీరాంజనేయస్వామి శ్రావణ మాసోత్సవాలలో మూడవ శనివారం ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అంజన్న దర్శనానికి క్యూలైన్లలో భారీ సంఖ్యలో భక్తజనులు పోటెత్తారు.

ఒంటిమిట్ట క్షేత్రానికి ఇక మహర్దశ



- రూ.40 కోట్లతో కోదండపాణి కోవెల ప్రగతి
- రెండు దశల్లో అభివృద్ధికి శ్రీకారం చుట్టనున్న టీటీడీ
- ఇప్పటికే రూ.17 కోట్లతో జరిగిన అభివృద్ధి

ఒంటిమిట్ట : ఏకశిలా నగిరి ఒంటిమిట్ట క్షేత్రానికి ఇక మహర్దశ పట్టనుంది. రెండేళ్ళుగా ఇక్కడి అభివృద్ధి ఒక అడుగు ముందుకు.. రెండడుగులు వెనక్కి.... అన్న చందంగా మారిన నేపథ్యంలో ప్రస్తుత టీటీడీ ఈవో అనిల్‌కుమార్ సింఘాల్ ప్రత్యేక శ్రద్ధతో ఇక వేగం పుంజుకోనుంది. త్వరలో రూ.40 కోట్లతో కోదండపాణి కోవెల చెంత ప్రగతికి రెండు దశల్లో టీటీడీ శ్రీకారం చుట్టనుంది. ఇప్పటికే టీటీడీ ఒంటిమిట్టలో రూ.17 కోట్ల ఖర్చుతో అభివృద్ధి పనులు పూర్తి చేసింది. గురువారం తొలిసారిగా ఒంటిమిట్టకు వచ్చిన టీటీడీ ఈవో అనిల్‌కుమార్ సింఘాల్ కోవెల చెంత ప్రగతికి భారత పురావస్తు శాఖ ఆంక్షలను సడలించి అనుమతులు ఇచ్చిందని, ఇక మాస్టర్‌ప్లాన్‌కు అనుగుణంగా అభివృద్ధి చేపట్టనున్నట్లు తెలిపారు. దీంతో ఒంటిమిట్ట ప్రగతికి ఆశలు చిగురిస్తున్నాయి.

రూ.17 కోట్లతో జరిగిన అభివృద్ధి పనులు

ఒంటిమిట్టలోని కోదండపాణి క్షేత్రానికి రాష్ట్ర ప్రభుత్వం అధికారిక గుర్తింపునిచ్చి రెండేళ్ళ క్రితం టీటీడీలో విలీనం చేసింది. సీఎం చంద్రబాబు ఆదేశం మేరకు ఒంటిమిట్ట అభివృద్ధికి టీటీడీ రూ.100 కోట్ల నిధులు కేటాయించింది. గత ఏడాది రాముల వారి ఉత్సవాలకు ముందు నుంచి అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టిన టీటీడీ ఇప్పటికే 17 కోట్ల రూపాయలు వెచ్చించింది. అందులో సుమారు 12 కోట్ల రూపాయల ఖర్చుతో రథం, రథశాల, శ్రీరామ సేవా కుటీరం, యాత్రికుల వసతి గృహాల చుట్టూ మరమ్మతులు, కోవెల చుట్టూ సీసీ రోడ్ల నిర్మాణం, మాడవీధుల వెడల్పు, భక్తసంజీవరాయ స్వామి ఆల య పునరుద్ధరణ, తాత్కాలిక అలంకార మండపం నిర్మాణం, కోవెల చుట్టూ ఉద్యానవనం ఏర్పాటు వంటి అభివృద్ధి పనులు పూర్తి చేసుకుంది. అలాగే కోవెలకు అర కిలోమీటర్ దూరంలోని కోదండరామాలయానికి చెందిన 70 ఎకరాల ప్రదేశంలో రూ.50 లక్షలతో సీతారాముల శాశ్వత కల్యాణ వేదిక, రూ.50 లక్షలతో స్వాగత తోరణాలు నిర్మించింది. మరో 5 కోట్ల రూపాయల ఖర్చుతో నిర్మిస్తున్న యాత్రికుల వసతి సముదాయ భవనం పూర్తి కావచ్చింది.

కోవెల చెంత రూ.40 కోట్లతో ప్రగతి

కోదండపాణి కోవెల చెంత టీటీడీ రూ.40 కోట్లతో ప్రగతికి త్వరలో శ్రీకారం చుట్టనుంది. ఈ అభివృద్ధి పనులను మాస్టర్‌ప్లాన్‌కు అనుగుణంగా రెండు దశల్లో చేపట్టనున్నారు. కోవెల చెంత ప్రగతిని భారత పురావస్తు శాఖ ఆంక్షల పేరుతో ఏడాదిగా అడ్డు తగిలింది. అయితే టీటీడీ పట్టువీడకుండా గట్టి ప్రయత్నాలతో భారత పురావస్తు శాఖపై ఒత్తిడి తీసుకురావడంతో కోవెల నుంచి 100 మీటర్ల అవతల అభివృద్ధి పనులకు ఆ శాఖ అనుమతులు కేటాయించింది. టీటీడీ ఇక్కడి రాముల వారి కోవెల చెంతన రూ.15 కోట్ల రూపాయలతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టేందుకు ప్రణాళికలు రూపొందించింది. అందులో సీతారాముల తెప్పోత్సవానికి ఒక అధునాతన పుష్కరిణి, సీతారామలక్ష్మణ ఉత్సవరులకు అలంకార మండపం, భక్తులు సేదతీరేందుకు డార్మెటరీలు, మరుగుదొడ్లు, శాశ్వత మంచి నీటి వసతి, టికెట్ల విక్రయ కేంద్రం, సమాచార కేంద్రం, ఉద్యానవనం, టీటీడీ, భారత పురావస్తు శాఖ అధికారులకు పరిపాలన భవనం, వసతుల కల్పనకు సముదాయ భవనం, లాకర్స్ సదుపాయం, ఎల్‌ఈడీ వెలుగులు, సీసీ కెమెరాలు, వెయింటింగ్ హాల్, అతిథి గృహం నిర్మాణం చేపట్టనున్నారు. అలాగే కల్యాణ వేదిక చుట్టూ రూ.50 లక్షలతో రక్షణ కంచె చేపట్టనున్నారు. మొదటి దశలో 15 కోట్ల రూపాయల ఖర్చుతో చేపట్టే ఈ అభివృద్ధి పనులకు సంబంధించి రెండు వారాల్లో టెండర్లు నిర్వహించి నిర్మాణాలకు శ్రీకారం చుట్టేందుకు టీటీడీ సమాయత్తమవుతోంది.

రెండవ దశలో మరో రూ.25 కోట్లతో అభివృద్ధి

ఇక రెండవ దశలో కోదండపాణి కోవెల చెంత రూ.25 కోట్లతో ప్రగతి చేపట్టనున్నట్లు టీటీడీ ఈవో అనిల్‌కుమార్ సింఘాల్ సూచనాప్రాయంగా తెలిపారు. అందులో కోదండపాణి థీంపార్క్, బమ్మెర పోతన విగ్రహం, ఉద్యానవనం, ఒంటిమిట్ట చెరువులో 108 అడుగుల జాంబవంతుడి విగ్రహం, శ్రీరామ లక్ష్మణ తీర్థాలు, శృంగిశైలం అభివృద్ధితో పాటు మరి కొన్ని ప్రగతి పనులు చేపట్టనున్నట్లు తెలుస్తోంది.



ప్రగతికి నోచుకోనున్న రామయ్య కోవెల ఆవరణం



పూర్తి కావచ్చిన యాత్రికుల విడిది సముదాయ భవనం



ప్రగతి పనులకు టీటీడీ రూపొందించిన మ్యాప్

ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత

నంద్యాలలో వైసీపీ గెలుపు తథ్యం : మాచర్ల ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి

వేంపల్లె: ప్రభుత్వ పనితీరుపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందని, నంద్యాలలో వైఎస్ జగన్‌కు ఎక్కడికెళ్లినా బ్రహ్మరథం పడుతున్నారని, వైసీపీ అభ్యర్థి గెలుపు తథ్యమని మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. వేంపల్లె సమీపంలోని గండి వీరాంజనేయస్వామిని దర్శించుకున్న అనంతరం వేంపల్లెలో ఉన్న ఎంపీపీ రవికుమార్‌రెడ్డి ఇంటికెళ్లి ఆయన్ను కలిశారు. రాజకీయాలపై కాసేపు చర్చించారు. జగన్ సేవా సమితి అధ్యక్షుడు ఆర్.శ్రీను, వైసీపీ యూత్ కన్వీనర్ ఆర్.వేణు, వార్డుసభ్యులు మని గోపాల్‌రెడ్డి, కసిరెడ్డి ఆదినారాయణరెడ్డి తదితరులు ఎమ్మెల్యేను కలిశారు. నంద్యాలలో రాజకీయ పరిస్థితి గురించి చర్చించారు. అనంతరం ఎమ్మెల్యే విలేకరులతో మాట్లాడారు. నంద్యాల ఉప ఎన్నికల్లో 30వ వార్డుకు ఇన్‌చార్జి బాధ్యతలు నిర్వహిస్తున్నానన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చకపోవడంతోనే ప్రజలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారని, జగన్ పర్యటనతో చంద్రబాబు ఆందోళన చెందుతున్నారన్నారు.



వేంపల్లె ఎంపీపీ రవికుమార్‌రెడ్డితో మాట్లాడుతున్న మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి

ఏసీబీ కార్యాలయ నిర్మాణానికి భూమిపూజ

కడప, క్రైం : అవినీతి నిరోధకశాఖ కార్యాలయానికి సొంత భవన నిర్మాణం కోసం శనివారం కడప నగరం పాతరిమ్స్‌లో భూమిపూజ కార్యక్రమం ఏసీబీ డీఎస్పీ నాగరాజు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో ఇంతవరకు ఏసీబీ కార్యాలయం భవనం లేకపోవడంతో అద్దె భవనాల్లో కార్యాలయం నిర్వహిస్తున్నామన్నారు. భవన నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేయడంతో శనివారం భూమి పూజ నిర్వహించామన్నారు. కార్యక్రమంలో ఏసీబీ సీఐలు రామచంద్ర, సుధాకర్‌రెడ్డి, పోలీసు హౌసింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

దాడిచేసి గొలుసు లాక్కెళ్లిన దొంగ అరెస్టు

కడప, క్రైం: కడప నగరం భరత్‌నగర్‌లో ఒంటరిగా ఉన్న ఓ వృద్ధురాలిని దాడి చేసి బంగారు గొలుసు లాక్కెళ్లిన దొంగను శుక్రవారం సాయంత్రం అప్సరా సర్కిల్ వద్ద సీసీఎస్ పోలీసులు అరెస్టు చేశారు. కడప నగరం సీసీఎస్ పోలీసుస్టేషన్‌లో సీసీఎస్ డీఎస్పీ నాగేశ్వర్‌రెడ్డి శనివారం చిన్నచౌకు సీఐ రామక్రిష్ణ సీసీఎస్ ఎస్సై జీవన్‌రెడ్డితో కలిసి విలేకరులకు నిందితుని వివరాలను వెల్లడించారు. కడప ఎన్జీఓ కాలనీ వాసి తుమ్మలూరు అనిల్‌కుమార్ ఆటో డ్రైవర్‌గా జీవనం సాగిస్తుండేవాడు. మద్యానికి బానిసై చిల్లర దొంగతనాలకు పాల్పడుతుండేవాడు. కొంతకాలం రాజంపేటలోని బంధువుల వద్ద ఉండేవాడు. విలాసాలకు డబ్బు లేకపోవడంతో కడప ఎన్జీఓ కాలనికి వచ్చాడు. నగరంలోని పలు ప్రాంతాల్లో సంచరిస్తూ చిన్నచిన్న వస్తువులను అపహరిస్తుండేవాడు. గత నెల 28న సుబ్బిరెడ్డి కాలేజీ సమీపంలోని భరత్‌నగర్ రోడ్డు నెంబర్ మూడులో అనిల్ కుమార్ సంచరిస్తుండగా ఓ వృద్ధురాలు ఇంట్లో ఒకరే ఉండగా నిందితుడు ఆ ఇంట్లోకి వెళ్ళి మంచి నీరు అడిగినట్లు అడిగి ఆ వృద్ధురాలిపై దాడి చేసి ఆమె మెడలో ఉన్న మూడు తులాల బంగారు గొలుసును అపహరించాడు. దొంగలించిన బంగారుతో పరారవుతున్నట్లు సమాచారం రావడంతో సీసీఎస్ ఎస్సైలు నాగరాజు, జీవన్‌రెడ్డి సిబ్బందితో దాడి నిర్వహించి అనిల్‌కుమార్‌ను అరెస్టు చేసి మూడు తులాల సరుడును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ మేరకు నిందితున్ని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.


వివరాలు తెలుపుతున్న సీసీఎస్ డీఎస్పీ నాగేశ్వర్‌రెడ్డి

హడలెత్తిస్తున్న చిరుత సంచారం

● భయం గుప్పిట్లో చాకిబండ పల్లెలు



నీటి చెలిమివద్ద ఉన్న చిరుత పాదముద్రికలు, చిరుతకోసం అన్వేషిస్తున్న ఎస్ఐ సుధాకర్, ప్రజలు

చిన్నమండెం: చిరుతపులి సంచారం ప్రజలను హడలెత్తిస్తోంది. అదిగో చిరుత ఇదిగో ఇక్కడ అంటూ హడలిపోతున్నారు. నీళ్ల చెలిమి వద్ద నీరుతాగి వెళ్ళింది...అంటూ రోజుకో చోట....పూటకు ఒక ప్రాంతంలో చిరుత కనిపిస్తుండడంతో చాకిబండ ప్రజలు హడలెత్తిపోతున్నారు. ఆప్రాంత పల్లెలన్నీ భయం గుప్పెట్లో బిక్కుబిక్కుమంటూ జీవనం సాగిస్తున్నాయి. నాలుగు రోజులుగా ఈప్రాంత వాసులకు కంటిపై కునుకు లేకుండా పోయింది. వీరు పోలీసులకు నిద్రలేకుండా చేస్తున్న సంఘటన చాకిబండలో చోటు చేసుకుంది. మండలంలోని మారు మూల ప్రాంతం చాకిబండ. ఈగ్రామం చుట్టూ కొండలు గుట్టలు, అటవీ ప్రాంతం విస్తరించింది. కొద్ది రోజులుగా చాకిబండ పరిసర ప్రాంతాల్లో చిరుత సంచరిస్తోంది. నాలుగు రోజలు కిందట చాకిబండ కుమ్మరపల్లెకు వెళ్ళే దారిలో ఉన్న మామిడి తోటలో చిరుతను గ్రామస్తులు చూశారట. విషయం పోలీసులకు తెలియజేశారు. ఎస్ఐ సుదాకర్ సిబ్బందితో వెళ్ళి ఆరోజు రాత్రి తిరిగి వచ్చారు. కానీ కనిపించలేదు. ఆమరుసటి రోజు బలిపల్లెకు చెందిన రమేష్ బాబు తెల్లవారు జాముల ఆటోలో వెళుతుంటే రోడ్డు దాటుకుని వెళిందటున్నాడు. తిరిగి ఈరోజు నీటి చెలిమి వద్ద నీళ్ల తాగడానికి వచ్చిందని ఒక మహిళచూసి చెప్పడంతో ప్రజలు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు అటవీ అధికారులకు సమాచారం ఇచ్చి మహిళ చెప్పిన ఆనవాళ్ల ప్రకారం నీటి చెటిమి వద్ద , వచ్చి వెళ్ళిన దారిలో పరిశీలించారు. చిరుత పాదముద్రికలను గుర్తించారు. అవి చిరుత అడుగులేనని అటవీ అధికారులు దృవీకరించారని చెబుతున్నారు. చిరుత ఇప్పటి వరకు కేవలం మేకలు, గొర్రెలపైనే దాడి చేస్తున్నదని తెలిపారు. ఇప్పటి వరకు మూడు మేకలను బలితీసుకుందన్నారు. పొలాల వద్ద పాడి పశువులు పెట్టుకుని జీవిస్తున్న వారు భయాందోళనకు గురి అవుతున్నారు. చిరుత మనుషులపై దాడి చేయకమునుపే అటవీ అధికారులు పట్టుకోవాలని కోరుతున్నారు.

క్రీడాపాఠశాల ఫలితాలు విడుదల

బాలికల్లో మొదటి రెండు స్థానాలు కడప జిల్లా

బాలికల్లో అధికంగా విశాఖపట్నం ● బాలురలో అధికంగా కర్నూలు

కడప, స్పోర్ట్స్: రాష్ట్రంలోని ఏకైక క్రీడాపాఠశాల జిల్లా కేంద్రం కడప నగరంలోని డాక్టర్ వైఎస్ఆర్ క్రీడాపాఠశాల నాలుగో తరగతి ప్రవేశ ఫలితాలు శనివారం విడుదలయ్యాయి. జూన్ 16, 17వతేదీల్లో మండల హెడ్‌క్వార్టర్లలో మండల స్థాయి 22, 23వ తేదీల్లో జిల్లా హెడ్‌క్వార్టర్లలో జిల్లాస్థాయి జూన్ 27 నుంచి 31 వరకు గుంటూరు జిల్లాలోని నాగార్జున యూనివర్శిటీలో రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహించారు. ఎట్టకేలకు 40రోజుల తరువాత విజయవాడలో శాప్ కార్యాలయంలో క్రీడాపాఠశాల ఫలితాలు విడుదల చేశారు.



పావని (మొదటిర్యాంకు), గాయత్రి (రెండోర్యాంకు)

జిల్లా విద్యార్థుల హవా

జిల్లా స్థాయి నుంచి పాల్గొన్న విద్యార్థుల్లో బాలికల విభాగాల్లో మొదటి రెండు స్థానాలు నిలిచారు. బాలురు నలుగురు ఎంపికయ్యారు.

నూతన విధానంతో నష్టపోయిన జిల్లా

2017-18 విద్యాసంవత్సరానికి సంబంధించి క్రీడాపాఠశాల ఎంపికలో శాప్ అమలు చేసిన నూతన విధానంతో జిల్లా విద్యార్థులు నష్టపోయారు. ఏటా జిల్లా నుంచి కనీసం 10 నుంచి 20 మంది విద్యార్థులు వుండేవారు. ఈ విద్యాసంవత్సరం కేవలం ఆరుగురు మాత్రమే ఎంపికయ్యారు.

ర్యాంక్	విద్యార్థి పేరు	జిల్లా
	బాలికల విభాగం	
1.	టి.పావని	కడప
2.	ఎన్.గాయత్రి	కడప
3.	కె.తులసి	విశాఖపట్నం
4	బి.సంధ్య	విశాఖపట్నం
5	ఎల్.శృతి	నెల్లూరు
6	కుమినిదేవి	ప్రకాశం
7	హేమశ్రీ	విశాఖపట్నం
8	రెడ్డిహేమలత	విశాఖపట్నం
9	ఎస్.రిచిత	విశాఖపట్నం
10	జి.అనిత	చిత్తూరు
11	దేవి	అనంతపురం
12	వై.గంగాభవానీ	ప్రకాశం
13	అరుణ	విశాఖపట్నం
14	శ్రీలక్ష్మీ	విశాఖపట్నం
15	ఎస్.ధరణి	చిత్తూరు
16	ఎస్.భానుశ్రీ	ప్రకాశం
17	వి.మనెమ్మ	నెల్లూరు
18	బి.రాఘవప్రసన్న	అనంతపురం

ర్యాంక్	విద్యార్థి పేరు	జిల్లా
19	కె.అనురాధ	విశాఖపట్నం
20	బి.కోమలి	విశాఖపట్నం
	స్టాండ్‌బై	
1	బి.లాస్యప్రియ	శ్రీకాకుళం
2.	వై.సాత్విక	శ్రీకాకుళం
3	బి.వేలూరు	నెల్లూరు
4	కె.స్వాతి	చిత్తూరు
5	ఎ.గౌతమి	విజయనగరం
	బాలుర విభాగం	
1	సి.రవి	కర్నూలు
2	కె.మల్లికార్జున	కర్నూలు
3	నాగరాజు	కర్నూలు
4	భాస్కర్	చిత్తూరు
5	మహ్మద్	కడప
6	మల్లికార్జున	కర్నూలు
7	మాధవ్	కడప
8	సాయిగంధంమహర్షి	కర్నూలు
9	వై.రామక్రిష్ణ	కర్నూలు

ర్యాంక్	విద్యార్థి పేరు	జిల్లా
10	వసంతనాయుడు	క్రిష్ణ
11	ఆర్.సింహాచలం	విశాఖపట్నం
12	అరవింద్	కర్నూలు
13	చంద్రశేఖర్	విశాఖపట్నం
14	శశాంక్	కడప
15	కుర్మనాధ్	విశాఖపట్నం
16	దినేష్	చిత్తూరు
17	హరిశంకర్	అనంతపురం
18	వీరనాగప్ప	కర్నూలు
19	వి.బసవరాజు	కర్నూలు
20	సుదర్శన్	కడప
	స్టాండ్‌బై	
20	బి.కోమలి	విశాఖపట్నం
1	బాలయ్య	కర్నూలు
2	వెంకటాద్రినాయుడు	గుంటూరు
3	నవీన్	విశాఖపట్నం
4	రాముడు	విశాఖపట్నం
5	యశ్వంత్ అంకమ్మస్వామి	ప్రకాశం

వేమన సతీష్‌కు నేడు ఘన సన్మానం

రాజంపేట: ఉత్తర అమెరికా తెలుగు సంఘం (తానా) అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించి తన సొంత గ్రామం రాజంపేటకు తొలిసారిగా విచ్చేసిన తానా అధ్యక్షుడు వేమన సతీష్‌కు రాజంపేటలో ఆదివారం ఘనంగా సన్మానించనున్నారు. ఆయన చిరకాల స్నేహితులు, పురప్రముఖులు, తెలుగుదేశం నేతలు, తానా సభ్యులచే ఈ సన్మాన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఆదివారం మధ్యాహ్నం నుంచి జరిగే సన్మాన కార్యక్రమాల్లో భారీ ఎత్తున జనసమీకరణ చేస్తున్నారు. సుమారు 1000మోటారు సైకిళ్ళ ర్యాలీ, భారీ ఎత్తున ఇతర వాహనాలను కూడా ర్యాలీ నిర్వహిస్తున్నారు. ఈ మేరకు కోడూరు, ఓబులవారిపల్లె, పుల్లంపేట, చిట్వేలి, పెనగలూరు, రాజంపేట, నందలూరు, ఒంటిమిట్ట, సిద్దవటం, సుండుపల్లె, వీరబల్లి, కడప తదితర ప్రాంతాల నుంచి భారీ ఎత్తున జనసమీకరణ చేస్తున్నారు. ప్రధానంగా పట్టణ పురప్రముఖులతో పాటు తెలుగుదేశం పార్టీ నేతలు హాజరు కానున్నారు. రాష్ట్రమంత్రులు గంటా శ్రీనివాసరావు, పత్తిపాటి పుల్లారావు, సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, ఆదినారాయణరెడ్డి, రాజ్యసభ సభ్యులు సి.ఎం.రమేష్, ఎంపీ గరికిపాటి రామ్మోహన్‌రావు, ప్రభుత్వ విప్ మేడా మల్లికార్జునరెడ్డి తదితర ప్రజాప్రతినిధులు కార్యక్రమానికి హాజరుకానున్నారు. ఐజీ ఎగ్బాల్, ఎస్పీ అట్టాడ బాబూజీ హాజరు కానున్నారు.

గో సంరక్షణకు 3.82ఎకరాల స్థలం వితరణ

పులివెందుల టౌన్: సత్యసాయిబాబా గో సంరక్షణ సమితికి 87/2సి, 82/డి సర్వేనంబర్లలో ఉన్న 3.82 ఎకరాల స్థలాన్ని ఇస్తున్నట్లు దాత బాబా సాహెబ్ ప్రకటించారు. దీన్ని రాతపూర్వకంగా కౌన్సిలర్ వైఎస్ మనోహర్‌రెడ్డికి అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలోనే ప్రత్యేక కమిటీని ఎన్నుకుని గోసంరక్షణ సమితిని బలోపేతం చేస్తామన్నారు. ఇందుకు దాతలు ముందుకు వచ్చి సహకరించాలన్నారు. సత్యసాయిబాబా గోసంరక్షణ సమితి గౌరవాధ్యక్షుడిగా మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి, స్థలదాత బాబా సాహెబ్ వ్యవహరిస్తారని గోసంరక్షణ ప్రతినిధులు పేర్కొన్నారు. గోసంరక్షణ కలిగే ప్రయోజనాల గురించి వివరించారు. అనంతరం స్థలదాత బాబా సాహెబ్‌ను ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో భగవద్గీత ధర్మ ప్రచార సమితి సభ్యులు పుల్లారెడ్డి, సత్యసాయి బాబాసేవా సమితి అధ్యక్షుడు విశ్వనాథ్, లక్ష్మినారాయణ పాల్గొన్నారు.


గోసంరక్షణ శాలకు స్థలాన్ని ఇస్తున్నట్లు రాతపూర్వక పత్రాన్ని అందిస్తున్న స్థల దాత బాబా సాహెబ్

లారీడ్రైవర్ అనుమానాస్పద మృతి

ఎర్రగుంట్ల: చిలమకూరు ఐసీఎల్ సమీపం లో మహంకాళి అమరేశ్వర్(35) అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. గుంటూరు జిల్లా మాచెర్ల వాసి అమరేశ్వర్ రాజమండ్రి నుంచి ఎర్రమట్టిలోడుతో చిలమకూరు ఫ్యాక్టరీకి వచ్చాడు. ఉన్నట్టుండి ఫ్యాక్టరీ సమీపంలో కుప్పకూలిపోయాడు. వెంటనే ఆతన్ని ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు. పరీక్షించిన వైద్యులు మృతిచెందినట్లు తెలిపారు. డ్రైవర్ భార్య ఫిర్యాదుపై పోలీసులు కేసునమోదు చేసుకున్నారు.

ఎత్తపువారి కాలనీలో చోరీ

జమ్మలమడుగు రూరల్: స్థానిక ఎత్తపువారి కాలనీలో ఈశ్వరమ్మ ఏఎన్ఎం నర్సు ఇంట్లో శుక్రవారం రాత్రి చోరీ జరిగింది. బాధితురాలు కర్నూలు జిల్లా రుద్రవరంలో ఏఎన్ఎంగా పనిచేస్తోంది. రాత్రి దొంగలు ఇంట్లో దూరి బీరువా లాకర్ పగులకొట్టి రూ.1.50 లక్షలు నగదు, అయిదు తులాల బంగారు వస్తువులు ఎత్తుకెళ్లినట్లు బాధితురాలు తెలిపింది.

ఆంధ్రజ్యోతి
4
రాజంపేట
కడప ● ఆదివారం 13 ఆగస్టు 2017
రాజంపేట ● సిద్ధవటం ● ఒంటిమిట్ట ● నందలూరు ● వీరబల్లి ● టి.సుండుపల్లె

మొక్కల పెంపకంతోపాటు పరిరక్షించాలి



సిద్ధవటం : మొక్కలు నాటడమే కాకుండా వాటిని పరిరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందని అటవీ శాఖ అధికారి డీఎన్ బాలాజీ తెలిపారు. సిద్ధవటం, ఎగువపేటలోని శ్రీ నలంద పాఠశాల ఆవరణలో వన మహోత్సవంలో భాగంగా వేప, కానుగ, నేరేడు, రావి 40మొక్కలు నాటారు. లంకమల్ల వనేశ్వరంలో చందనం 200విత్తనాలు విత్తించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు సిబ్బంది పాల్గొన్నారు.

ఏపీఎండీసీ బెరైటీస్‌కు విద్యుత్ కాంతులు

● రూ.2.50కోట్లతో విద్యుద్దీకరణకు ఏపీఎండీసీ శ్రీకారం ● మంగంపేట బెరైటీస్ ప్రాజెక్టు నుంచి రాష్ట్ర 4వ నెంబరు జాతీయ రహదారి వరకు వెలుగులు

ఓబులవారిపల్లె : ఆంధ్రప్రదేశ్ ఖనిజాభివృద్ధి సంస్థ యాజమాన్యం బెరైటీస్ గనులున్న మంగంపేట గ్రామం ఫ్లడ్‌లైట్ల వెలుతురుతో దేదీప్యమానంగా వెలిగి పోతోంది. రాత్రి సమయాలు విద్యుత్ దీపాలతో పగలును తలపిస్తోంది. బెరైటీస్ గనులతో పాటు వృథా మట్టి ఖనిజ నిల్వల ప్రాంతం, పల్వరైజింగ్ మిల్లుల వద్ద ఏపీఎండీసీ కేంద్రంగా జాతీయ రహదారి వరకు పూర్తిగా విద్యుదీకరణ పనులు పూర్తి కావచ్చాయి. గతంలో అరకొర విద్యుత్ దీపాలకు ఏపీఎండీసీ పరిసరాలు మిణుకు.. మిణుకు.. మంటుండేటివి. పూర్తిస్థాయిలో విద్యుద్దీకరణ లేక వెలుతురు సరిగ్గా లేకపోవడంతో మేలు రకం బెరైటీస్‌ను సైతం కొందరు అక్రమార్కులు అక్రమంగా తరలించేవారు. అలాంటి అక్రమాలకకు చెక్ పెట్టేందుకు ఏపీఎండీసీ మేనేజింగ్ డైరెక్టర్ చిరమామిళ్ళ వెంకయ్య చౌదరి శాశ్వత పరిష్కారం చేపట్టారు. ముందుగా బెరెటీస్ తవ్వకాల మొదలు కొని ఇతర ముఖ్య ప్రాంతాలలో సి.సి.కెమె రాలను ఏర్పాటు చేశారు. రాత్రి సమయాలలో సి.సి.కెమెరాల నిఘా పటిష్టతతో పాటు ప్రమాదాల నివారణకు కార్మికులు విధుల నిర్వహణలో అసౌకర్యానికి గురికాకుండా ఉండేందుకు విద్యుద్దీకరణ పనులకు పాలక మండల ఆమోదంతో శ్రీకారం చుట్టారు. అంత ర్జాతీయ స్థాయిలో గురికాకుండా ఉండేందుకు విద్యుద్దీకరణ పనులకు పాలక మండలి ఆమోదంతో శ్రీకారం చుట్టారు. అంతర్జాతీయ స్థాయిలో ఆడే క్రికెట్ క్రీడకు



రాష్ట్ర 4వ నెంబర్ రహదారి నుంచి ఏపీఎండీసీ కార్యాలయం వరకు ఏర్పాటు చేసిన విద్యుత్ దీపాలు

ఉపయోగించే విద్యుత్‌దీపాలకు తీసి పోకుండా ఏపీఎండీసీ ఆవరణంలో విద్యుద్దీకరణ పనులు పూర్తి కావచ్చాయి. ఎండీ వెంకయ్యచౌదరి, విద్యుద్దీకరణ పనులకు 250కోట్లు కేటాయించారు. ఈ పనులను లోకల్ సంస్థలకు అప్పగించకుండా బజాజ్ కంపెనీకు అప్పగించారు. విద్యుత్ దీపాలకు విద్యుత్ సరఫరా వైర్లన్నీ భూమి లోపల ఏర్పాటు చేసి అత్యంత ఆధునీకతతో పెద పెద్ద నగరాల తరహాలో విద్యుత్ స్థంబాలు, లైట్లు బజాజ్ కంపెనీ వారు ఏర్పాటు చేశారు. బెరైటీస్ ప్రాజెక్టు నుంచి రాష్ట్ర 4వ నెంబర్ రహదారి వేబ్రిడ్జీల వద్ద వృథామట్టి



ఏపీఎండీసీ బెరైటీస్ గనులు

నిల్వలకు తరలించే దారికి జనరేటర్లతో పాటు ముఖ్య ప్రాంతాలకు 150వాల్టుల విద్యుత్ బల్బులు 42స్తంభాలకు రెండు చొప్పున ఏర్పాటు చేశారు. వాటితో పాటు 30అడుగుల ఎత్తుగల 11 విద్యుత్ స్తంభాలకు (హైమాస్క్) ఏర్పాటు చేశారు. ఒక్కొక్క విద్యుత్ స్తంభానికి రెండు కిలో వాల్టుల సామర్థ్యం కలిగిన 18బలుపులు అమర్చారు. ఈ విద్యుత్ కాంతులతో నిఘా కెమెరాలు స్పష్టంగా పనిచేస్తున్నాయి. ప్రధానంగా బెరైటీస్ ఖనిజ నిల్వల ప్రాంతంలో ఎక్కువ నిఘా ఏర్పాటు చేశారు. రూ.2.50 కోట్లతో మంగంపేట ఏపీఎండీసీ నందు ఏపీఎండీసీ ఎండీ వెంకయ్యచౌదరి ఏర్పాటు చేసిన విద్యుద్దీకరణ తో మంగంపేట దేదీప్యమానంగా వెలిగిపోతోంది.

బెల్టుషాపులపై దాడులు

సిద్ధవటం : సిద్ధవటం, ఒంటిమిట్ట, అట్లూరు, నందలూరు మండలాల్లో మద్యం బెల్టుషాపులపై దాడులు నిర్వహించామని ఎక్సైజ్ సీఐ విశ్వేశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా సిద్ధవటం ప్రొహిబిషన్ కార్యాలయంలో శనివారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ నాలుగు మండలాల్లో టీములుగా ఏర్పడి బెల్టుషాపులు నిర్వహించకుండా దాడులు చేయనున్నమన్నారు. సిద్ధవటం మండలంకు సీఐ విశ్వేశ్వరరావు, ఒంటిమిట్ట ఎస్ఐ భారతి, నందలూరు మఎస్ఐ లావణ్య, అట్లూరు మండలంకు హెడ్‌కానిస్టేబుల్ నాగేశ్వర్‌రెడ్డిలు పర్యవేక్షిస్తారన్నారు.

బీజేపీని బలోపేతం చేయాలి

బీజేవైఎం జాతీయ నాయకుడు నాగోతు రమేష్‌నాయుడు



కూచవారిపల్లెలో మాట్లాడుతున్న బీజేవైఎం జాతీయ నాయకుడు నాగోతు రమేష్‌నాయుడు

రాజంపేట రూరల్ : గ్రామ స్థాయి నుంచి భారతీయ జనతాపార్టీని బలోపేతం చేయాలని బీజేవైఎం జాతీయ నాయకుడు నాగోతు రమేష్‌నాయుడు పిలుపునిచ్చారు. మండల పరిధిలోని కూచవారిపల్లెలో శనివారం సాయంత్రం గ్రామస్థాయి బూత్ కమిటీని బీజేపీ నాయకులు ఎన్ను కున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన నాగోతు రమేష్‌నాయుడు మాట్లాడుతూ బీజేపీని బలోపేతం చేయడానికి గ్రామస్థాయి నుంచి బూత్ కమిటీని వేయడం జరుగుతున్నదని, రాబోయే రోజుల్లో పార్టీ అభివృద్ధికి మరింత కృషి చేస్తామన్నారు.అనంతరం బూత్ కమిటీని ఎన్నుకున్నారు. ఇందులో కమిటీ అధ్యక్షుడిగా అబ్బూరి ప్రభాకర్‌నాయుడు, ఇన్‌చార్జిగా అమ్మినేని విజయేంద్రనాయుడులతో పాటు తదితర సభ్యులను ఎన్నుకున్నామన్నారు. రాష్ట్ర అభివృద్ధి కోసం బీజేపీ అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి ఏపీకి చేయవలసిన అన్నీ పనులు సజావుగా చేస్తున్నదన్నారు.

కార్యక్రమంలో బీజేపీ నాయకులు అమ్మినేని విజయేంద్రనాయుడు మాట్లాడుతూ బీజేపీ అభివృద్ధికి కార్యకర్తలు, నాయకులు సైనికుల్లా పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు గుణవర్మ, నాగరాజ నాయుడు, ఎం.ఓబయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా విగ్రహా పునఃప్రతిష్ఠ పూజలు





కల్యాణోత్సవంలో పాల్గొన్న మహిళాభక్తులు, ప్రత్యేక అలంకరణలో ముకంతేశ్వరస్వామి

సిద్ధవటం : మండల పరిధిలోని నేకనాపురం గ్రామంలో శనివారం ఆలయ విగ్రహ పునఃప్రతిష్ఠ పూజలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా గ్రామ శివారులోని ముకంతేశ్వరస్వామి ఆలయంలో పునఃప్రతిష్ట పూజలు చివరి రోజు స్వామి వారికి గణపతి పూజ, హోమాలు, అభిషేకం, మంత్రప్రతిష, విగ్రహ ప్రతిష్ఠ, ప్రాణప్రతిష్ఠ, గోవర్ధనం, జ్వాలాదర్శనం, కూష్మాండబలి, పూర్ణాహుతి, తీర్థప్రసాదాలు వినియోగం నిర్వహించారు. అంతేకాకుండా గణపతిపూజ, నందిపూజ, నవగ్రహపూజలు, నాగదేవత నూతన విగ్రహప్రతిష్ఠ పూజా జరిగింది. అనంతరం శివపార్వతుల కల్యాణంలో గణపతిపూజ, కంకణాధారణ, జిలకర్రబెల్లం, కన్యాదానం, మంగళ సూత్రాధారణ, ముత్యాల తలంబ్రాలు వంటి పూజలు జరిగాయి. కల్యాణం తిలకించేందుకు భక్తులు భారీగా హాజరయ్యారు. అనంతరం ఆలయ ఆవరణలో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ చిన్న సుబ్బారెడ్డి, సుబ్బారెడ్డి, ఆర్ఎంపీ వైద్యాధికారి వెంకటసుబ్బయ్య, చంద్రశేఖర్‌రెడ్డి, కుమార్‌రెడ్డి, యల్లారెడ్డి, పుల్లారెడ్డి, ధర్మకర్త, నాగశివమల్లిక పాల్గొన్నారు.

గీతాంజలి కళాశాలలో ఘనంగా ఫ్రెషర్స్‌డే వేడుకలు

రాజంపేట టౌన్ : పట్టణంలోని గీతాంజలి కళాశాలలో శనివారం ఘనంగా ఫ్రెషర్స్ డే వేడుకలు కరస్పాండెంట్ ఎస్.వి.రమణ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ రమణ మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదువుకొని ఉన్నత స్థానాలకు చేరుకోవాలన్నారు. ఇంటర్మీడియట్ దశ నుంచి ఒక ఆశయాన్ని ఏర్పాటు చేసుకొని ఆ దిశగా నడవాలన్నారు. అనంతరం విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి.

తగ్గిన టమోటా.. పెరిగిన ఉల్లిఘాటు

● కుప్పకూలిన చికెన్ రేటు... అన్నింటి కన్నా తక్కువగా ● బంగాళాదుంప రేటు...

● ఉల్లి రూ.15 నుంచి 50 ● టమోటా రూ.80 నుంచి 40, ● చికెన్ రూ. 120, బంగాళాదుంప రూ.20





రాజంపేట : ఒక్క సారిగా ఉల్లిరేటు ఘాటెక్కింది. నాలుగు రోజుల వరకు కేవలం 15 రూపాయల లోపు ఉన్న ఉల్లిరేటు ఒక్క సారిగా 50రూపాయలకు చేరింది. నిత్యావసరాల్లో ప్రతి అంశానికి వాడే ఉల్లిరేటు ఒక్క సారిగా ఆకాశాన్నంటడంతో గృహిణులు ఇబ్బంది పడు తున్నారు. ఇప్పటి వరకు ఆకాశాన్నంటిన టమోటా 80రూపాయల నుంచి 40రూపాయలకు తగ్గింది. అదే క్రమంలో 210 రూపాయలు పలికిన చికెన్ రేటు ఒక్క సారిగా 120రూపాయలకు కుప్పకూలిపోయింది. ఇక బంగాళాదుంప రేటు నెల రోజుల నుంచి 20రూపాయలే ఉంది. ఈ విధంగా అంతర్జాతీయ మార్కెట్‌లో ఆయా వస్తువుల ఉత్పత్తులను బట్టి ధరలు అమాంతంగా పెరగడం.. తగ్గడం.. జరుగుతోంది. ఏదేమైనా ప్రతి కూరగాయలోనూ పచ్చళ్లలోనూ, ప్రతి అంశంలోనూ వాడే ఉల్లిధర అమాంతంగా రేటు పెరగడంతో గృహిణులు చాలా ఇబ్బంది పడుతున్నారు. ఉల్లిని చాలా తక్కువగా వాడే పరిస్థితి ఏర్పడింది. అదే విధంగా నిన్నటి వరకు 200రూపాయలు ఉన్న చికెన్ రేటు 120రూపాయలకు తగ్గిపోవడంతో చికెన్ ప్రియులు ఆనందంవ్యక్తం చేస్తున్నారు. బంగాళా దుంపలు 20రూపాయలే ఉండటంతో అవి అందరికీ అందుబాటులో ఉన్నాయి. టమోటాలు కొంచంగా తగ్గడం ఒక రకంగా శుభపరిణామమే అయితే ఉల్లిరేటు రెండురెట్లు అధికంగా పెరగడంతో సామాన్యులు చాలా ఇబ్బంది పడుతున్నారు. ప్రభుత్వం స్పందించి ఉల్లిరేటును వెంటనే తగ్గించేలా చర్యలు తీసుకోవాలని గృహిణులు కోరుతున్నారు.

వైభవంగా ముత్తుమారెమ్మ జాతర మహోత్సవం



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు



కుంకుమార్చన చేస్తున్న మహిళలు

నందలూరు : మండలంలోని నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామ పంచాయతీ అరవపల్లెలో వెలసిన శ్రీ ముత్తుమారెమ్మ జాతర మహోత్సవం శనివారం అత్యంత వైభవంగా నిర్వహించారు. తమిళనాడు నుంచి తెచ్చిన ప్రత్యేక పూలతో అమ్మవారిని అత్యంత సుందరంగా అలంకరించి అనంతరం గ్రామోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కాళికా నృత్యం, విచిత్ర వేషధారణ, పొడగాటి మనిషి విన్యాసాలు ప్రజలను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఉదయం భోగాపతి వెంకటరమణ(మటన్ రమణ) దంపతుల ఆధ్వర్యంలో నిర్వహించిన కుంకుమార్చనలో 100మంది మహిళలు పాల్గొని భక్తి శ్రద్ధలతో అర్చన చేశారు. వేదపండితులు బండాత్మకూరు శివకుమార్ శర్మ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం ముత్తుమారెమ్మ జాతర మహోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త, ఆర్గనైజర్ సీలం చంద్రశేఖర్ మొదలియార్, సీలం శ్రీనివాస్ మొదలియార్‌లు తెలిపారు.

సినిమా గ్రేడ్

రాజంపేట

సమద్ :లై
సుదర్శన్ :నేనే రాజు నేనే మంత్రి
పీవై : ఫిదా
బీఎస్: నక్షత్రం
ఎన్ఎస్ఆర్: జయజానకి నాయక

16న దేవస్థాన భూముల కౌలు బహిరంగ వేలం

సుండుపల్లె: మండలంలోని వైఎన్‌పాలెం, బాగంపల్లె గ్రామ దేవస్థాన భూముల కౌలు బహిరంగ వేలం ఈ నెల 16న(బుధవారం) మధ్యాహ్నం 3 గంటలకు వైఎన్‌పాలెం కుప్పగుట్టలో దేవాదాయశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా 2017 నుంచి 2020 సంవత్సరాల వరకు మూడు సంవత్సరాల వరకు వేలం పాట నిర్వహిస్తామన్నారు.

అదేరోజు ఉదయం 11 గంటలకు పోలిమేపల్లె గ్రామ దేవస్థానం భూముల కౌలుకు బహిరంగ వేలం నిర్వహిస్తామని అధికారులు తెలిపారు. వేలంపాట పాల్గొనే వారు రూ.1000 ధరావత్తు చెల్లించి పాటలో పాల్గొనాలన్నారు. కౌలు హక్కులు పొందకుండా దేవస్థాన భూమి యందు సాగుకొనే వారిపై చట్టపర చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు.

ఒక వైపు కంపు.. మరో వైపు ముప్పు

● ప్రధాన రహదారి పక్కనే మురుగుకాల్వ ● పట్టించుకోని అధికారులు



నందలూరు : మండల కేంద్రమైన నందలూరు ప్రధాన రహదారి పక్కనే మురుగు కాలువ పోతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారు. కాల్వలో చెత్తచెదారం పేరుకు పోయి కంపుకొట్టడమే కాకుండా రహదారి పక్కనే ఉండడంతో ఏమాత్రం అజాగ్రత్త వహించినా వాహనదారులకు ముప్పు తప్పదని స్థానికులు వాపోతున్నారు. కన్యకాచెరువుకు నీరు తీసుకువెళ్ళే ప్రధాన కాలువలో ఎక్కడ చూసినా చెత్తాచెదారంతో నిండిపోయి అస్తవ్యస్తంగా ఉన్నప్పటికీ పట్టించుకునే అధికారులే కరువయ్యారు. మురుగునీటితో దోమలకు నిలయంగా మారి ప్రజలు జ్వరాల బారిన పడుతున్నారు. వర్షాకాలం కావడంతో కన్యకా చెరువులోకి నీరు వెళ్ళేందుకు అడ్డంగా మారిన చెత్తాచెదారం తొలగించకపోతే వర్షం పడిన తరువాత వచ్చే నీరు లోతట్టు ప్రాంతాల్లోని ఇళ్ళల్లోకి వెళుతోందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అటు పంచాయతీ అధికారులు కానీ, ఇటు ఇరిగేషన్ అధికారులు కానీ ఎవరికి వారే యమునే తీరే అన్నట్లు వ్యవహరిస్తుంటే ప్రజల కష్టసుఖాలను పట్టించుకునే సరైన నాయకుడే లేడా అని ప్రజలు చర్చించుకోవడం గమనార్హం. స్థానిక బస్టాండు కూడలి నుంచి ఆర్.ఎస్.రోడ్డుకు వెళ్ళే ప్రధాన రహదారికి పక్కనే ఈ కాలువ ఉన్నప్పటికీ నిత్యం అటువైపు అదికారులు, ప్రజాప్రతి నిధులు వెళుతున్నా కన్నెత్తి చూడకపోవడం శోచనీయం. ఇప్పటికైనా అధికారులు స్పందించి కన్యకాచెరువు ప్రధాన కాలువలో ఉన్న చెత్తాచెదారాన్ని తొలగించడంతోపాటు రహదారి పక్కనే ఉండడంతో ప్రమాదాలు జరుగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

అభాగ్యులను ఆదుకోవడమే లక్ష్యం



అనాథలకు సాయం చేస్తున్న దాతలు

నందలూరు : అభాగ్యులను మానవతా దృక్పదంతో ఆదుకోవాలన్నదే తమ సంస్థ లక్ష్యమని కువైట్ అమ్మ హెల్పింగ్ హ్యాండ్స్ ప్రతినిధి దొరబాబు తెలిపారు. శనివారం నందలూరులో అనాథలకు ఆదరణ కల్పించిన ఆవుల ధనమ్మ 10వేల రూపాయలు విలువ చేసే వస్తువులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కువైట్ అమ్మ హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ అధ్యక్షులు ప్రభాకర్ యాదవ్, మురళీకృష్ణలు పంపిన 10వేల రూపాయలతో నలుగురు అనాథలకు దుప్పట్లు, బియ్యం, సరుకులు, పండ్లు అందజేశారు. భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రమేష్, లక్ష్మీనరసయ్య, శ్రీనాద్, రాధాకృష్ణలు పాల్గొన్నారు.

మూడు ఐసీడీఎస్ ప్రాజెక్టులకు నిలిచిన గుడ్డు

కడప, కోటిరెడ్డిసర్కిల్: అంగన్‌వాడీ కేంద్రాల్లో కోడిగుడ్డు పంపిణీ నిలిచిపోయింది. కడప అర్బన్, కడప రూరల్, కమలాపురం ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాలకు ఈ నెల మొదటివారానికి సంబంధించిన గుడ్ల పంపిణీకి బ్రేక్ పడింది. ఫలితంగా పిల్లలకు, గర్భిణులకు అందాల్సిన పోషకాహారానికి తూట్లు పడ్డట్లయింది. కాగా అంగన్‌వాడీ కేంద్రాలకు నిర్దేశించిన సమయానికి గుడ్లు సరఫరా చేయడంలో సంబంధిత కాంట్రాక్టర్ ఎందుకు నిర్లక్ష్యం చేశారనే విషయం అర్థం కావడం లేదు. కాంట్రాక్ట్ పొందిన ఆదిలోనే సరఫరాలో అంతరాయానికి తావ్విడం ఏమిటనే ప్రశ్న తలెత్తుతోంది. జిల్లావ్యాప్తంగా ఉన్న అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా అయిన గుడ్డు కేవలం ఆ మూడు ప్రాజెక్టులకు సకాలంలో చేరకపోవడానికి రాజకీయ అడ్డంకులు ఏమైనా ఉన్నాయా అనే విషయం ప్రశ్నార్థకంగా మారింది. జిల్లాలో 15 ఐసీడీఎస్ ప్రాజెక్టులు ఉన్నాయి. వీటి పరిధిలో 3621 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. ఇందులో 19,714 గర్భిణులు, 18,058 మంది బాలింతలు ఉన్నారు. ఆరు నెలల నుంచి ఏడాది లోపు 22,103 మంది పిల్లలు ఉన్నారు. సంవత్సరం నుంచి మూడేళ్ల లోపు 77,393 మంది పిల్లలు ఉన్నారు. 3 నుంచి 6 ఏళ్లలోపు 59,210 మంది పిల్లలు ఉన్నారు. గర్భిణులు, బాలింతలకు నెలకు 25 గుడ్లు, మూడు నుంచి ఆరేళ్లలోపు పిల్లలకు 16 గుడ్లు, మూడేళ్లలోపు పిల్లల వారికి 8 గుడ్లు మోను ప్రకారం అందించాల్సి ఉంది. అయితే జూలై వరకు సక్రమంగా గుడ్లు సరఫరా కాగా ఆగస్టు మొదటి వారం వచ్చే సరికి పూర్తి స్థాయిలో అంగన్‌వాడీ కేంద్రాలకు గుడ్లు సరఫరా కాలేదు.

వైజాగ్ నుంచి సరఫరా

అంగన్‌వాడీ కేంద్రాలకు గుడ్లను సరఫరా చేసేందుకు వైజాగ్‌కు చెందిన యునైటెడ్ ట్రేడర్స్ గత నెలలో కాంట్రాక్టు పొందింది. ఈ కాంట్రాక్టు విశాఖ జిల్లాతో పాటు వెస్ట్‌గోదావరి, కర్నూలు, కడప జిల్లాలకు గుడ్లు సరఫరా చేయాల్సి ఉంది. ఈ క్రమంలో కడప జిల్లాకు సంబంధించి ఆగస్టు నెలలో 3621 అంగన్‌వాడీ కేంద్రాలకు ఐదు వారాలకు కలిపి 30,06,408 ఐదు రంగులు కలిగిన గుడ్లు సరఫరా చేయాలి. అయితే నిర్దేశించిన తేదీకి ముందు రోజున ఆయా కేంద్రాలకు గుడ్లు అందేలా చేయాలి. ఆగస్టు మొదటి వారంలో 5వ తేదీ వరకు పసుపు రంగు కలిగిన గుడ్లు పిల్లలకు, గర్భిణులకు పంపిణీ చేయాలి. జిల్లా మొత్తానికి మొదటి వారంలో 6,01,282 గుడ్లు సరఫరా చేసినట్లు అధికారిక లెక్కల ద్వారా తెలుస్తోంది. అయితే కడప అర్బన్, కడప రూరల్, కమలాపురం ఐసీడీఎస్ ప్రాజక్టుల పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాలకు ఆ వారానికి సంబంధించిన పసుపురంగు గుడ్లు సరఫరా కాలేదు. దీనిపై పలు రాజకీయ విమర్శలు వచ్చాయి. అధికార యంత్రాంగం ఏ మేరకు చర్యలు తీసుకుంటుందో లేదో అనే విషయం చర్చనీయాంశంగా మారింది.

ఇసుక ఇక చౌక

అందరికీ అందుబాటు ధరలు

కడప, వినాయకనగర్ : రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ఉచిత ఇసుక ధర నియంత్రణ కమిటీ ఏర్పాటు చేసిన తరువాత జిల్లాలో ఇసుక ధర పేద, మధ్యతరగతి వారికి చౌకగా లభించనున్నది. దీంతో అన్ని వర్గాల వారికి ఇసుక అందుబాటులోకి రానుంది. అధిక ధరలు వసూలు చేస్తే రూ. 2 లక్షల జరిమానా, రెండేళ్ల జైలు శిక్ష విధించే అధికారం ప్రభుత్వం కల్పించింది. రాష్ట్ర ప్రభుత్వం మొదట ఇసుక క్వారీలను స్వయం సహాయక సంఘాలకు అప్పగించింది. అయితే జిల్లాలో ఆశించిన స్థాయిలో స్వయం సహాయక సంఘాలు క్వారీలను నడపలేక పోయాయి. అంతేకాకుండా స్వయం సహాయక సంఘాలపై స్థానిక రాజకీయ నేతల పెత్తనం అధికం కావడంతో స్వయం సహాయకసంఘాల ఆధ్వర్యంలో ఇసుక క్వారీలు విఫలమయ్యాయి. దీంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వాదాయాన్ని వదులుకొని ఉచిత ఇసుక విధానాన్ని ప్రవేశపెట్టింది. ఈ విధానం కూడా ప్రజలకు ప్రయోజనం చేకూర్చకపోయింది. ఆయా క్వారీలు ఇసుక మాఫియా చేతుల్లో వెళ్లిపోయాయి. అక్రమార్కులు ఇసుక ధర అమాంతంగా పెంచి పేదలకు విక్రయించడం మొదలుపెట్టారు. దీంతో ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉచిత ఇసుక విధానం కూడా పేద ప్రజలకు ప్రయోజనం కలిగించలేదు. తిరిగి ఇసుక ధర నియంత్రించాలనే ఉద్దేశంతో ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం జిల్లా వ్యాప్తంగా, మండలవ్యాప్తంగా జీవో 102 ప్రకారం ఇసుక ధరల నియంత్రణ కమిటీలను ఏర్పాటు చేసింది. ఈ కమిటీలో కలెక్టర్ చైర్మన్‌గా, ప్రాంతీయ రవాణాశాఖాధికారి, గనులశాఖాధికారి, ఇరిగేషన్ శాఖ ఇంజనీర్లు, ఎస్పీ కమిటీ సభ్యులుగా వున్నారు. వీరంతా రెండు వారాల క్రితం సమావేశమై జిల్లాలో ఇసుక ధరలను నియంత్రించారు.

జిల్లాలో 22 క్వారీలు వుండగా వాటి నుంచి సమీప ప్రాంతాలకు ఇసుకను తరలించేందుకు కిందివిధంగా ధరలు వసూలు చేయాలని నిర్ణయించారు. కడప నగరానికి ట్రాక్టర్ ఇసుక రూ.1600, రాజంపేటకు రూ.1000, రైల్వేకోడూరుకు రూ.2100, బద్వేల్‌కు రూ.2400, ఎర్రగుంట్లకు రూ. 1500, ప్రొద్దుటూరుకు రూ. 1500, జమ్మలమడుగుకు రూ.1100, పులివెందులకు రూ. 1750 వసూలు చేయాలని అధికారులు నిర్ణయించారు. లోడింగ్, అన్‌లోడింగ్, రవాణాచార్జీలు కలిపి ఈ మేరకు ధర నిర్ణయించారు. దీనికన్నా ఎక్కువ ధరలు వసూలు చేస్తే తక్షణం టోల్‌ఫ్రీ నెంబరు 1100 గానీ జిల్లా మైనింగ్ శాఖకు కానీ కలెక్టర్, ఎస్పీల దృష్టికి తీసుకెళితే సంబంధిత వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకుంటారు. అధిక ధరలు వసూలు చేసే ఇసుక వ్యాపారులపై రూ.2 లక్షల జరిమానా, రెండేళ్ల జైలుశిక్ష విధించే అధికారం కమిటీకి కలిగి వుంది. దీంతో జిల్లాలో ఇసుక కొనుగోలు దలచిన వారు ఆయా ధరలకు అనుగుణంగా కొనుగోలు చేయాలి. కొత్తపాలసీ ప్రకారం నగర, పట్టణ ప్రాంతాల్లో ఎక్కడా ఇసుక నిల్వలు ఏర్పాటు చేయరాదు. అలా చేసిన పక్షంలో ఆ స్థల యజమానులపై కఠిన చర్యలు తీసుకుంటారు. కేవలం నిర్మాణ కార్యక్రమాలు జరిగే చోట ఇసుక కుప్పలు వేయాల్సి వుంది. ఇతర ప్రాంతాల్లో నిల్వ చేసేందుకు కమిటీ ఏమాత్రం అధికారం ఇవ్వలేదు. అలాగే నగర, గ్రామీణ ప్రాంతాల్లో ఇసుకపై పోలీసుల నిఘా ఉంటుంది. అంతర్‌రాష్ట్ర ప్రాంతాల వద్ద ఇసుక ఇతర రాష్ట్రాలకు వెళ్లకుండా పోలీసులు నిఘా పెట్టాల్సి వుంది.

పులివెందుల్లో దాహం..దాహం...

- ఏ వార్డులో చూసినా కన్నీటిగాథలే
- దిక్కుతోచని స్థితిలో పులివెందుల ప్రజలు

పులివెందుల: పులివెందుల మున్సిపాలిటీ ప్రజలకు తాగునీటి సమస్య పెద్ద శాపంలా మారింది. నీటి కోసం పడరాని పాట్లు పడుతున్నారు. గతేడాది నుంచి ఇప్పటి వరకు నీటి కష్టాలే తాండవిస్తున్నాయి. మొన్న వేసవిలో అయితే మరీ దారుణంగా మారింది. పులివెందుల మున్సిపాలిటీలో దాదాపు 70 వేల జనాభా ఉంది. ఈ జనాభాకు ప్రతి రోజు దాదాపు 6.95 ఎంఎల్‌డీ నీరు అవసరం ఉంది. కానీ ఏ రోజు కూడా పూర్తిస్థాయిలో ఇక్కడ నీరు ఇచ్చిన దాఖలాలు లేవు. కదిరికి వెళ్లే నామాలగుండు సమీపంలో ఐదు మున్సిపాలిటీ బోర్లుఉన్నాయి. ఆ బోర్లే మున్సిపాలిటీలో జనాభాకు నీరు అందిస్తూ వచ్చాయి. కానీ గతేడాది నుంచి అనుకున్న స్థాయిలో వర్షాలు కురవకపోవడంతో, వాగులు, వంకలు ప్రవహించలేదు. దీనితో భూగర్భ జలాలు అడుగంటాయి. పులివెందుల మున్సిపాలిటీకి ఆదరువుగా ఉన్న ఈ ఐదుబోర్లలో నీరు అడుగంటి అరాకొరగా అందుతోంది. ఈ బోర్ల ద్వారా వచ్చిన నీరు ఎస్‌బీఐ కాలనీ, బాక్రాపురం, ఎర్రగుడిపల్లె తదితర ప్రాంతాలకు మాత్రమే అందిస్తున్నట్లు మున్సిపల్ అధికారులు పేర్కొన్నారు. మిగిలిన ప్రాంతాలకు ట్యాంకర్లతో, మరికొన్ని బోర్ల ద్వారా నీటిని అందిస్తున్నామని ఓ అధికారి పేర్కొన్నారు. నగరిగుట్ట, ఇస్లాంపురం, జండామానువీధి, మారుతీ థియేటర్, బంగారువీధి, మెయిన్ బజార్ తదితర ప్రాంతాలలో తాగునీటి సమస్య అధికంగా ఉంది. ప్రతి రోజు మున్సిపాలిటీకి అవసరమైన నీటిలో సగం మేర మాత్రమే పట్టణ ప్రజలకు అందిస్తున్నట్లు సమాచారం. వీధి కొళాయిలకు నాలుగు రోజులకో ఐదు రోజులకో ఒకమారు మాత్రమే నీరు అందిస్తున్నారు. ట్యాంకర్లతో నీరు అందిస్తున్నామని ఎవరికీ ఇబ్బంది లేకుండా చూస్తున్నామని మున్సిపల్ అధికారులు అంటున్నారు. కానీ కేవలం ఐదు ట్యాంకర్లతో ఆ ప్రాంతాల్లో తాగునీటి సమస్యను తీర్చేందుకు ఆ ట్యాంకర్లు ఏ విధంగా కూడా సరిపడడం లేదని అక్కడి ప్రజలు వాపోతున్నారు. పలుకుబడి ఉన్న వారికి మాత్రమే ట్యాంకర్ నీరు వచ్చి ఇంటి ముందు వాలుతోంది తప్ప సామాన్య ప్రజలకు అందుబాటులో లేదని పలువురు బహిరంగంగానే విమర్శిస్తున్నారు. పలుకుబడి ఉంటే ట్యాంకర్ మొత్తం నీరు వారి ఇంటి పైకప్పు మీద ఉన్న ప్లాస్టిక్ ట్యాంకుకో లేక ఇంటిముందున్న సంపులోనో వదిలేసి వెళ్తున్నారు. సామాన్య ప్రజలకు ఏదో నీరు అందిస్తున్నామంటే అందిస్తున్నామని మొక్కుబడిగా బిందో రెండు బిందెలతో సరిపెడుతున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పులివెందుల్లో ఎటుచూసినా తాగునీటి కోసం ప్రజలు పడరానిపాట్లు పడుతున్నారు.

రైలు నుంచి పడి వ్యక్తికి తీవ్రగాయాలు

నందలూరు: తిరుపతి నుంచి హుబ్లీ వెళుతున్న ఇంటర్ సిటీ ఎక్స్‌ప్రెస్ నుంచి నందలూరు వద్ద వ్యక్తి జారిపడి తీవ్ర గాయాలపాలైన సంఘటన శనివారం చోటు చేసుకుంది. వై.కోట గ్రామానికి చెందిన యల్లయ్య యాదవ్ (65) అనే వ్యక్తి అనంతరాజుపేట రైల్వేస్టేషన్ నుంచి కడపకు వెళుతూ మార్గమధ్యంలో నందలూరు దాటిన వెంటనే ప్రమాదవశాత్తు వెళుతున్న రైలు నుంచి జారిపడ్డాడు. ఈ సంఘటనలో ఆ వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. ఈ విషయాన్ని గమనించిన స్థానికులు గాయపడిన వ్యక్తిని చికిత్స నిమిత్తం రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి వైద్యులు మెరుగైన చికిత్స కోసం కడప రిమ్స్‌కు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు రైల్వే పోలీసులు నరేంద్ర, నందకుమార్‌లు తెలిపారు.

మినీ లోకం



రాజకీయాల్లోకి వెళ్లకుండా ఇక్కడికి వచ్చారేంటి.. మిమ్మల్ని తీసుకోవడం కుదరదు!

శ్మశాన స్థలం దర్జాగా కబ్జా

- పట్టించుకోని అధికారులు
- కుందూ నదిలో శవాలు పూడ్చివేత

రాజుపాళెం: మండల పరిధిలోని టంగుటూరు గ్రామంలో హిందూ శ్మశాన స్థలం రూ.1.60 ఎకరాలు కబ్జాకు గురైంది. ఈ స్థలం విలువ రూ.15 లక్షలు ఉంటుందని ప్రజలు తెలిపారు. శ్మశాన స్థలం కబ్జాకు గురి కావడంతో శవాలను కుందూ నదిలో పూడ్చడం, దహనం చేయడం జరుగుతోంది. దీంతో కుందూ నది కలుషితం కావడంతో పాటు వరదలు వచ్చినప్పుడు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. అదే విధంగా ఎస్సీ కాలనీకి శ్మశాన స్థలం లేకపోవడంతో వారు కూడా కుందూ నదిలోనే శవాలను పూడ్చుతున్నారు. తొండలదిన్నె, వెలువలి గ్రామ ప్రజలు స్థలాలు లేకపోవడం, కబ్జాకు గురి కావడంతో శవాలను పూడ్చడం జరుగుతోందని, దీనివలన దిగువ ప్రాంతం వారు తాగునీటికి ఉపయోగిస్తున్నారని, క్యాన్సర్, ఎయిడ్స్, క్షయ వ్యాధులతో చనిపోయిన వారిని కూడా కుందూలో పూడ్చడంతో ప్రజలు రోగాల బారిన పడవలసిన దుస్థితి ఏర్పడుతోంది. కబ్జారాయుళ్లు మాత్రం స్థలాలను ఆక్రమణకు గురి చేసుకుని పంటలను సాగు చేసుకుంటూ పట్టీపట్టనట్లు ఉన్నారు. గ్రామంలోని అధికారులు, మండలస్థాయి అధికారులకు తెలిపినా స్థలాలు కావాలని అర్జీలు మొరపెట్టుకున్నా కబ్జా అయిన స్థలాలను స్వాధీనం చేసుకోవాలని కోరినా ఫలితం లేదు. ఇప్పటికైనా కబ్జా అయిన స్థలాన్ని ప్రభుత్వం స్వాధీనం చేసుకోవలని ప్రజలు కోరుతున్నారు.



కబ్జాకు గురైన శ్మశాన స్థలం



కుందూలో శవాలను పూడ్చుతున్న దృశ్యం

హోరాహోరీగా అండర్-16 క్రికెట్ పోటీలు

కడప, స్పోర్ట్స్ : ఈనెల 11వ తేదీ నుంచి కడప నగరంలోని వైఎస్ఆర్ఆర్-ఏసీఏ, కేఎస్ఆర్ఎం, కేవోఆర్ఎం ఇంజినీరింగ్ క్రీడా మైదానంలో ప్రారంభమైన అండర్-16 అంతర్ జిల్లా క్రికెట్ పోటీలు హోరాహోరీగా జరుగుతున్నాయి.

వైఎస్ఆర్ఆర్-ఏసీఏలో విశాఖ ముందంజ : విశాఖపట్నం, వెస్ట్‌గోదావరికి మధ్య జరిగిన మ్యాచ్‌లో రెండవరోజు మొదటి ఇన్నింగ్స్ ప్రారంభించిన విశాఖ 89.4 ఓవర్లలో 288 పరుగులకు ఆలౌట్ అయింది. ఇందులో నితీష్‌కుమార్‌రెడ్డి 119, హేమనాథరెడ్డి 87 పరుగులతో నాటౌట్‌గా నిలిచారు. వెస్ట్ గోదావరి బౌలింగ్‌లో శశిరాజ్-4, కె.జానర్‌రిచర్డ్స్-3 వికెట్లు తీశారు. అనంతరం వెస్ట్ గోదావరి రెండో ఇన్నింగ్స్ ప్రారంభించి 10 ఓవర్లలో ఒక్క వికెట్ నష్టానికి 21 పరుగులు చేసింది.

కేఎస్ఆర్ఎంలో కృష్ణ ముందంజ : కృష్ణ, నెల్లూరు జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో నెల్లూరు మొదటి ఇన్నింగ్స్ 58.3 ఓవర్లలో 88 పరుగులు చేసి ఆలౌట్ అయింది.

అనంతరం బ్యాటింగ్ చేసిన కృష్ణ జట్టు 61 ఓవర్లలో ఏడు వికెట్లు నష్టానికి 172 పరుగు చేసింది.ఇందులో సుశాంత్-59, పవన్ 52 పరుగులు చేశారు. నెల్లూరు బౌలింగ్‌లో పర్వాద్-3, శరత్-2 వికెట్లు తీశారు.

కేవోఆర్ఎంలో చిత్తూరు ముందంజ : చిత్తూరు, తూర్పుగోదావరి మధ్య మ్యాచ్‌లో 230 పరుగులకు ఆలౌట్ అయింది. ఇందులో కె.గౌతమ్ 66, ఎ.గౌతమ్ 59 పరుగులు చేశారు. తూర్పుగోదావరి బౌలింగ్‌లో యు.సందీష్-5, జె.వి.హరినాద్-2 వికెట్లు తీశారు. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన తూర్పుగోదావరి 4 ఓవర్లలో వికెట్లు ఏమీ కోల్పోకుండా పరుగులు ఏమి చేయలేదు.

ఎయిర్‌పోర్టు స్థలానికి హద్దులు చూపండి

చర్యలు చేపట్టిన రెవెన్యూ అధికారులు

కడప, ఆంధ్రజ్యోతి : కడప ఎయిర్‌పోర్టుకు సంబంధించిన 35 ఎకరాల స్థలానికి హద్దులు చూపాలని ఎయిర్‌పోర్టు అధికారులు కలెక్టర్ బాబూరావునాయుడును కోరారు. ఈ మేరకు కలెక్టర్ ఆదేశాల మేరకు అధికారులు ఎయిర్‌పోర్టుకు సంబంధించిన స్థలానికి సంబంధించిన హద్దులు చూపేందుకు చర్యలు చేపట్టారు. కడప ఎయిర్‌పోర్టుకు చిన్నమాచుపల్లె పొలంలో 35 ఎకరాల స్థలం గతంలో ఇచ్చారు. ఈ స్థలానికి సంబంధించిన హద్దులు లేకపోవడంతో ఇప్పుడు వాటిని చూపించాలని కలెక్టర్‌ను కోరినట్లు సమాచారం. కడప ఎయిర్‌పోర్టు రన్‌వేతో పాటు ఎయిర్‌పోర్టు ఆవరణాన్ని కూడా విస్తరించనున్నారు. ఉడాన్ పథకం కింద ఇప్పటికే కడప-హైదరాబాద్ విమానం రోజువారీగా నడుస్తోంది. ఈ ఫ్లైట్‌కు ఆక్యుపెన్సీ కూడా బాగానే ఉండడంతో భవిష్యత్‌లో ఎయిర్‌పోర్టు విస్తరణకు ఎక్కువ అవకాశాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో స్థల సేకరణ, హద్దులపై ఎయిర్‌పోర్టు అధికారులు దృష్టి సారించారు.

తానా అధ్యక్ష పదవి

సీమకు రావడం అదృష్టం

- నేడు అభినందన సభకు తరలిరండి
- కమ్మ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు దొడ్డపనేని



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న దొడ్డపనేని

కడప, మారుతీనగర్ : తానా అధ్యక్షుడిగా రాయలసీమకు చెందిన వేమన సతీష్ నియమితులు కావడం సీమవాసుల అదృష్టమని కమ్మ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు దొడ్డపనేని చంద్రశేఖర్‌నాయుడు అన్నారు. శనివారం స్థానిక చిన్నచౌకులోని కమ్మ సంక్షేమ సంఘం జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తానా అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన వేమన సతీష్ ఈనెల 13వ తేదీ ఆదివారం రాజంపేటకు వస్తున్న దృష్ట్యా అదేరోజు సాయంత్రం రాజంపేట ఎస్ఆర్ ఫంక్షన్ హాలులో అభినందన సభ జరగనుందన్నారు. సభకు రాష్ట్ర మంత్రులు, ఎంపీలు, శాసనసభ్యులు హాజరు కానున్నారన్నారు. కావున రాయలసీమ నలుమూలల నుంచి వేమన సతీష్ శ్రేయోభిలాషులు, అభిమానులు, కుటుంబసభ్యులతో అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రాజానాయుడు, కమ్మ సంక్షేమ సంఘం నాయకులు చంద్రబాబునాయుడు, భవానీశంకర్ చెన్నకేశవ, ప్రసాద్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఆట అవార్డుకు గోవిందు ఎంపిక




అవార్డుకు ఎంపికైన గోవిందు

గోపవరం : కళ, సంగీతం, సాహిత్య సేవారంగాల్లో విశిష్టసేవలకు, ప్రతిభకు గుర్తింపుగా ఆట 'అవార్డు టీవర్స్ అసోషియేషన్ ఇండియా' అవార్డును ప్రకటిస్తుంటారు. ఇందులో సాహిత్య రంగానికి సంబంధించి రాచాయిపేట జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో ఆంగ్ల ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న జి.గోవిందును ఆట అవార్డు 2017కు ఎంపిక చేసినట్లు నిర్వాహకులు చెక్కంటి శ్రీనివాస్ తెలియజేసినట్లు గోవిందు పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రంలోని భద్రావలంలో అక్టోబరు 10వ తేదీ జరిగే అవార్డుల కార్యక్రమంలో ప్రముఖులచే ఈ అవార్డును అందజేయనున్నట్లు ఆయన తెలిపారు. 1998 నుంచి ఆకాశవాణి కడప రేడియో కేంద్రంలో తన కవితలు ప్రసారమయ్యాయని, అలాగే 2015లో జాతీయ ఉత్తమ కవితా పురస్కారం, 2016లో ఎన్టీఆర్ అవార్డు, సాహితీరత్న అవార్డు, రాజమండ్రి వారు అందజేశారని, 2017 సహస్ర కవి మిత్ర బిరుదు తెలుగుకవితా వైభవం హైదరాబాదు, వీటితో పాటు అనేక జాతీయ కవి సమ్మేళనాలు, కవితా సదస్సుల్లో అనేక సామాజిక స్పృహను కల్పించే కవితలను సమాజంలోకి తీసుకువెళ్లడం జరిగిందన్నారు. ఇప్పుడు ఈ అవార్డు మరింత ప్రోత్సాహాన్ని అందిస్తుందని ఆయన తెలిపారు.

పాఠకులకు సూచన:

క్లాసిఫైడ్ ప్రకటనలకు స్పందించే ముందు పూర్తిగా విచారించి తగిన నిర్ణయం తీసుకోగలరు. ప్రకటనదారు ప్రకటిస్తున్న లేదా చేసుకుంటున్న క్లయిమ్‌లతో మా పత్రికకు ఎటువంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు. - మేనేజర్

మరణించినా.. జీవించు!



అవయవ దానంతో ప్రాణదాతలయ్యే అవకాశం
బ్రెయిన్ డెత్ వ్యక్తి శరీర భాగాల నుంచి 9 మందికి కొత్త జీవితం

మనం చనిపోయాక కూడా పది మందికి ఉపయోగపడాలి. అపుడే ఈ జన్మకు సార్థకత ఉంటుందని పెద్దలు అంటారు. బ్రెయిన్ డెత్ అయిన వారి అవయవాల దానంతో ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారికి పునర్జన్మ ఇవ్వొచ్చు. ప్రధానంగా రోడ్డు ప్రమాదాలు ఇతర కారణాలతో బ్రెయిన్ డెత్ పరిస్థితికి కొందరు చేరువవుతుంటారు. వీరిలో జీవం ఉన్నా మెదడు పనిచేయదు. ఇలాంటి వారు 24 గంటల్లో మరణిస్తారు. ఇలా బ్రెయిన్‌డెత్ అయిన వ్యక్తి అవయాలతో 9 మందికి ప్రాణం పోయవచ్చు. విస్తరించిన సాంకేతిక కాలానికి అనుగుణంగా ఆరోగ్య రంగంలో పెను మార్పులు చోటుచేసుకుంటున్నాయి. ఈ క్రమంలో ప్రతి సంవత్సరం ఆగస్టు 13వ తేదీన జాతీయ అవయవ దాన దినోత్సవం జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది. ఈ సందర్భంగా ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం..

కడప, వినాయకనగర్

నేడు జాతీయ అవయవ దాన దినోత్సవం

అవగాహన అవసరం...


మన దేశంలో గుండె, ఊపరితిత్తులు, కాలేయం, కిడ్నీ, కళ్లు తదితర అవయవాలు లభించక ప్రతిరోజు ఎంతో మంది చనిపోతున్నారు. ఇలాంటి వారికి బ్రెయిన్‌డెత్ అయిన వ్యక్తి అవయవాలు దానం చేస్తే బతుకుతారు. అయితే అవయవ దానంపై సరైన ప్రచారం, అవగాహన లేకపోవడంతో అవయవ దానం చేయడానికి ఎవ్వరూ ముందుకు రావడం లేదు. అభివృద్ధి చెందిన దేశాలలో అమెరికా, స్పెయిన్, బ్రెజిల్ లాంటి దేశాలలో ప్రజలు స్వచ్ఛందంగా అవయ దానం చేయడానికి ముందుకు వస్తారు. ఇలాంటి పరిస్థితిలో మన దేశంలో అవయ దానంపై మరింత అవగాహన పెరగాల్సిన అవసరం ఉంది.

వయస్సుతో సంబంధం లేదు..

అవయవాలు దానం చేయడానికి వయస్సుతో సంబంధం లేదు. ఏ వయస్సువారు దానం చేసినా వారి అవయాలు ఆ వయస్సులో ఉన్న వారికి అమర్చవచ్చు. అవయవాలతో పాటు దేహాన్ని కూడా మెడికల్ కళాశాలలకు అప్పగించవచ్చు. వ్యక్తి చనిపోయిన తరువాత కుటుంబ సభ్యులే దేహాన్ని అప్పగించాలి.

అవయావాలన్నీ ప్రధానమే..

బ్రెయిన్ డెత్ అయిన వ్యక్తి అవయవాలు 18 మందికి ఉపయోగపడతాయి. ఇద్దరి కళ్ళ, ఒకరికి గుండె, ఇద్దరికి కర్ణభేరులు, ఇద్దరికి మూత్రపిండాలు, ముగ్గురికి కాలేయం,



మావన దేహం.. అవయవాలు

ఒకరికి క్లోమగ్రంధి, గాల్‌బ్లాడర్, గుండెకవాటాలు.. ఇలా అన్ని అవయవాలు ఉపయోగపడతాయి. అయితే ప్రమాదంలో మృతి చెందిన వారి అవయవాలను నాలుగు గంటల్లో తీయగలిగితేనే ఉపయోగపడతాయి.

జిల్లాలో కళ్లు సేకరణ..

జిల్లాలో కొన్ని స్వచ్ఛంద సంస్థలు, ప్రైవేటు ఆస్పత్రులు దానం చేసిన కళ్లను సేకరించి హైదరాబాదు, విజయవాడల్లో ప్రముఖ కంటి ఆసుపత్రులకు పంపుతున్నారు. ఈ పంపిన కళ్లల్లో కార్నియాను తీసుకుని చూపు కోల్పోయిన వారికి అమర్చుతున్నారు. తద్వారా చూపులేని వారికి చూపు వచ్చి సరికొత్త బంగారులోకాన్ని చూస్తున్నారు. జిల్లాలోని ప్రొద్దుటూరులో స్నేహ అనే స్వచ్ఛంద సంస్థ దాతల నుంచి కళ్లను సేకరించి కంటి ఆసుపత్రులకు పంపి అనేక మందికి కంటి చూపును ప్రసాదిస్తున్నారు.

అవయవదానంపై అవగాహన అవసరం

డాక్టర్ మోక్షేశ్వరుడు, డీఎంహెచ్‌వో



అవయదానంపై ప్రజల్లో మరింత అవగాహన పెంపొందించాల్సిన అవసరం ఉంది. అవయవ దానం చేస్తే మరిణించినా కూడా జీవించవచ్చనే సూత్రాన్ని పాటించాలి. ముఖ్యంగా అవయదానంలో కంటిదానం సులభతరం. కళ్లు దానం చేసేందుకు ఇటీవల చాలమంది ముందుకువస్తున్నారు. అలాగే ఇతర అవయవాలు దానం చేసేందుకు కూడా ప్రజలు ముందుకురావాలి. ముఖ్యంగా కుటుంబ సభ్యులు అవయవదానం చేస్తే రోగికి కూడా మ్యాచింగ్ సరిపోతుంది.

రాజంపేట

ఆర్టీసీ.. అధోగతి...



రాజంపేట ఆర్టీసీ బస్టాండు ముఖద్వారం

ఏడాదికి రూ.4 కోట్లు పైబడి నష్టం
ఇక పల్లెలకు ఆర్టీసీ బస్సు కష్టం...
ప్రైవేటుకు అందలం.. ప్రభుత్వ బస్సులకు మంగళం...
పల్లెవెలుగు బస్సులకు తిలోదకం.. ఆదాయమే పరమార్థం...

ప్రయాణీకుల సేవలకు పంగనామాలు.. ఆదాయ మార్గాలే ఆర్టీసీ లక్ష్యాలు...

ప్రయాణీకుల సేవే పరమార్థమంటూ వెలుగులోకి వచ్చిన ఆర్టీసీ రానురానూ ప్రయాణీకులకు పంగనామాలు పెడుతూ ఆదాయ మార్గాలనే లక్ష్యాలను చేసుకుంటూ ముందుకు సాగలేక.. వెనక్కు రాలేక... సతమతమవుతూ ఊగిసలాడుతోంది. పల్లె బస్సులకు మంగళం పాడుతూ ఆదాయం వచ్చే మార్గాలను లక్ష్యంగా చేసుకుంటోంది. ప్రభుత్వ బస్సులను తగ్గిస్తూ అద్దె బస్సుల పేరిట ప్రైవేటు బస్సులకు అగ్రతాంబూలం ఇస్తోంది.

రాజంపేట ఆర్టీసీ జిల్లాలో ఆది నుంచి నష్టాలలోనే నడుస్తోంది. రైల్వేకోడూరు, రాజంపేట నియోజకవర్గాలకు కూడలిగా ఉండే రాజంపేట ఆర్టీసీ పదేళ్ల కిందట 110 బస్సులతో కళకళలాడుతూ ఉండేది. ఈ 110 బస్సులు ఆర్టీసీ బస్సులే కావడం గమనార్హం. అయితే ఆర్టీసీలో వచ్చిన పెనుమార్పుల వల్ల రాజంపేటలో కూడా అనేక మార్పులు చేసుకున్నాయి. 110 ఆర్టీసీ బస్సులు ఉన్నప్పుడు రోజూవారి నష్టం మూడు లక్షలు, నెలవారి కోటి రూపాయలు నష్టం వస్తుండేది. కారణం ఆర్టీసీ ఉన్నత ఉద్యోగుల్లో అంకిత భావం లేకపోవడం, అందుకు తగ్గట్లు కార్మికులు పనిచేయకపోవడం, వేళాపాళా లేకుండా బస్సులు నడపడం ఇత్యాది కారణాల వల్ల భారీనష్టాలను చవిచూస్తూ ఉండేది. ఈ విషయాన్ని గమనించిన ఆర్టీసీ అధికారులు రాజంపేట డిపోలో పెనుమార్పులు చేశారు.

110 నుంచి 66 బస్సులకు...

110బస్సులున్న స్థానంలో నేడు కేవలం 66 ఆర్టీసీ బస్సులను మాత్రమే ఉంచారు. మిగిలిన 29సర్వీసులన్నీ మొత్తం హైర్ బస్సులే.. నేడు నెలకు 3.50కోట్ల రూపాయలు ఆదాయం వస్తుండగా ఖర్చు 3.79కోట్లు అవుతోంది. నెలకు 29లక్షలు అనగా రోజూవారి నష్టం రూ.లక్ష వస్తోంది. ఈ విధంగా ఏడాదికి 4కోట్ల పైబడి రాజంపేట ఆర్టీసీకి నష్టాలు వస్తున్నాయి. గతంలో 84లక్షలు నెలవారి నష్టం వస్తుండగా దానిని 29 లక్షలకు తగ్గించారు.

తెలుగు వెలుగు (పల్లె వెలుగు) బస్సులు తొలగింపు

కలెక్షన్‌లు లేని సుమారు 10 తెలుగువెలుగు బస్సులను తీసివేశారు. కడప-రాజంపేట మార్గంలో అనేక పల్లె బస్సులను తీసివేశారు. ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రయాణీకులకు, విద్యార్థులకు, ఉద్యోగులకు అనువుగా గతంలో బస్సులుండేవి. వాటిని తొలగించి అర్ధగంటకు ఒకటి, 15నిమిషాలకు ఒకటి కడప-రాజంపేట ప్రధానమార్గంలో బస్సులు నడపడం వల్ల ప్రయాణీకులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు.

చిట్వేలి-కోడూరు మార్గంలో రాపూరు-నెల్లూరు బస్సులే దిక్కు

చిట్వేలి-రైల్వేకోడూరు, రైల్వేకోడూరు వయా పుల్లంపేట మార్గంలో రాజంపేటకు వచ్చే బస్సులను గణనీయంగా తగ్గించారు. అసలు ప్రయాణీకుల సేవలను పూర్తిగా మరిచిపోయారు. ఉదయం, సాయంత్రం వేళల్లో అటు కడప-రాజంపేట, చిట్వేలి-రైల్వేకోడూరు మార్గంలోనూ ప్రయాణీకుల బాధలు అన్నీఇన్నీ కావు. ప్రయాణీకులు ఆర్టీసీ వారిని శాపనార్థాలు పెడుతున్నారు. రాజంపేట, చిట్వేలి, రైల్వేకోడూరు మార్గంలో రాపూరు, నెల్లూరు, గూడూరు బస్సులు లేకపోతే రాజంపేట బస్సులు ఉన్నా లేన్నట్లే లెక్క. ఆ ప్రాంతాల్లో కేవలం నెల్లూరు జిల్లా బస్సులపైనే ఆధారపడతారు. కోడూరు-చిట్వేలి మార్గంలో రాజంపేట ఆర్టీసీ బస్సులు ఎప్పుడు వస్తాయో.. ఎప్పుడు రావో తెలియని పరిస్థితి. వీరికందరికీ నెల్లూరు, గూడూరు బస్సులే ప్రధాన ప్రయాణ వనరు. రాజంపేట ప్రాంతం నుంచి పట్టణ ప్రాంతాలైన హైదరాబాదు, అమరావతి, నెల్లూరు, కర్నూలు, శ్రీశైలం, బెంగుళూరు, చెన్నై ప్రాంతాలకు ప్రత్యేక బస్సులు నడుపుతూ ఉన్నారు.



వర్షమొస్తే రాజంపేట ఆర్టీసీ బస్టాండు ప్రాంగణం తీరు ఇదీ..

అమరావతి బస్సు ఎక్కితే ఇక అంతే..

రాజంపేట నుంచి నూతన రాజధాని అమరావతికి నడుపుతున్న బస్సులను చూస్తే రాజంపేట ఆర్టీసీ వారి పనితీరు పక్కాగా తెలిసి పోతుంది. ఇది పేరుకే హైటెక్ బస్సు. కేవలం రెండు బస్సులను మాత్రమే అమరావతికి నడుపుతారు. రాత్రి 9గంటల సమయంలో వెళ్లే అమరావతి బస్సును చూస్తే తెలుగు వెలుగు(పల్లె వెలుగు) బస్సు గుర్తుకు వస్తుంది. నెల్లూరు- రాజంపేటకు నాలుగు గంటల ప్రయాణం పడుతుంది. ఉన్నది అరకొర బస్సులే కనుక ప్రయాణీకులందరినీ ఆ బస్సులో ఎక్కించుకుంటారు. అదనపు బస్సు వేసినా నెల్లూరు వరకు ప్రయాణీకులు కావాల్సినంత మంది ఉంటారు. అయితే ఒక్క బస్సుతోనే అటు సీట్లలోనూ, ఇటు స్టాండింగ్‌లోనూ ప్రయాణీకులను ఎక్కించుకుంటూ ఎవ్వరికీ ప్రశాంతత లేక గూర్..బేర్...మంటూ ప్రయాణీకులు అమరావతి బస్సులో అష్టకష్టాలు పడుతుంటారు. ఈ విషయమై ప్రయాణీకులు ఫిర్యాదు చేసినా పట్టించుకునే వారులేరు. మాకు కావాల్సింది ఆదాయం.. ఎవరు ఇబ్బంది పడితే మాకేంటి అని రాజంపేట ఆర్టీసీ వారు ఉన్నారు.

నష్టాల నుంచి ఆర్టీసీని గట్టెక్కించాం..

ఎం.వి.కృష్ణారెడ్డి, డిపో మేనేజర్, రాజంపేట.



గతంలో రాజంపేట ఆర్టీసీ రూ.80 లక్షలనష్టంతో నడుస్తోంది. ఆ నష్టాన్ని కేవలం రూ.29లక్షలకు తగ్గించాం. అందరం కలిసికట్టుగా పనిచేయడం వల్లే నష్టాల నుంచి ఆర్టీసీని కాపాడుకున్నాం. ఇప్పుడు రోజూ లక్ష నష్టం వస్తోంది. దీనినుంచి బయటపడటానికి కృషి చేస్తున్నాం. ఆటోలతో ప్రయాణీకులు లేని 10 తెలుగువెలుగు బస్సులను తొలగించాం. ప్రయాణీకుల రద్దీనిబట్టి బస్సులనునడుపుతున్నాం. త్వరలో అమరా వతికి ప్రత్యేక బస్సులను నడుపుతాం. విజయవాడకు వెళ్ళే రాత్రి బస్సులో స్టాండింగ్‌లో ప్రయాణీకులను పంపడం జరుగుతోంది. కొత్త బస్సులు వచ్చిన వెంటనే స్టాండింగ్ లేకుండా బస్సులను నడుపుతాం

తెలుగు వెలుగు (పల్లె వెలుగు) సమయపాలన తుస్సు...

రెండు నియోజకవర్గాల్లో సుమారు 8 మండలాల్లో 200గ్రామాలకు పైబడి పల్లెలకు ఆర్టీసీబస్సులు తిరుగుతున్నాయి. ఏ బస్సుకూ సమయపాలన లేదు. ఎప్పుడు వస్తాయో పోతాయో తెలియదు. దీంతో ప్రయాణీకులు ఆర్టీసీ బస్సులకు మంగళంపాడి ఆటోలను ఎక్కు తున్నారు.

సిబ్బంది ఉన్నా ప్రయాణీకుల సేవలు సున్నా...

ఇక్కడ 150మంది డ్రైవర్లు, 154మంది కండక్టర్లు, 10మంది ఆఫీసు సిబ్బంది, 77మంది గ్యారేజీ సిబ్బంది పనిచేస్తున్నారు. రోజూవారి డీజల్ ఖర్చు రెండున్నర లక్ష దాటుతోంది. గతంలో కంటే ప్రస్తుతం నష్టాలు తక్కువైనా దానికి ప్రధాన కారణం ప్రైవేటు బస్సులను ప్రవేశపెట్టడం, సింగిల్‌మ్యాన్‌తో బస్సులు నడపడం, గణనీయంగా పల్లె బస్సులను తగ్గించడమే కారణం. ఆర్టీసీ ప్రయాణం సురక్షితమని తెలిసినా అందుకు తగ్గట్లు వారిసేవలు లేకపోవడంతో ఏమీ చేయలేని పరిస్థితుల్లో ఆర్టీసీని మరిచిపోతున్నారు. ఈ విధంగా రాజంపేట ఆర్టీసీ రోజురోజుకు తిరోగమనం వైపు పయనిస్తోంది.



రాజంపేట ఆర్టీసీ డిపోలోని బస్సులు

ఫలిస్తున్న విద్యార్థుల 'అనంత' పరిశోధనలు

ఉద్యాన కళాశాలలో పరిశోధనాత్మకంగా కొత్తరకం కూరగాయల సాగు
చిగురిస్తున్న విద్యార్థినుల ఆశలు

రైల్వేకోడూరు రూరల్



ఉద్యాన పరిశోధన కేంద్రంలో కూరగాయల పంటలను పరిశీలిస్తున్న విద్యార్థులు

అనంతరాజుపేట ఉద్యాన కళాశాల పరిశోధన స్థానంలో విద్యార్థులు ప్రయోగాత్మకంగా పెంచుతున్న కొత్తరకం మొటిక్కాయ, సొరకాయల పంట

మండలంలోని అనంతరాజుపేట డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయం, ఉద్యాన కళాశాల మరియు పరిశోధన స్థానంలో ప్రొఫెసర్లు బీఎస్‌ఇ మొదటి సంవత్సరం విద్యార్థుల అధ్వర్యంలో ఇతర యూనివర్సిటీల నుంచి తీసుకు వచ్చిన కొత్తరకం పొట్టి వంగడాల కూరగాయలు విస్తారంగా సాగు చేస్తున్నారు. కళాశాల అసోసియేట్ డీన్ ఎం. రామకృష్ణ అధ్వర్యంలో సీనియర్ శాస్త్రవేత్తలు సదరున్నీస అధ్వర్యంలో బీఎస్‌ఇ మొదటి సం వత్సరం విద్యార్థులు పరిశోధన ప్రాంగణంలో పొట్టిరకం మొటిక్కాయలు, సొరకాయ, బీన్స్, బెండ, దోస, కర్బూజ, కాకర, కీర తదితర కూరగాయల సాగులను చేస్తున్నారు. ఇవి నెల, రెండు నెలలకే బాగా పెరిగి మెండుగా పూతలు వచ్చాయి. అధిక దిగుబడులతో మంచి రకం కూరగాయలు పండుతాయని సీనియర్ శాస్త్రవేత్త సదరున్నీస తెలిపారు. బీఎస్‌ఇ ఉద్యాన విద్యార్థులు వైష్ణవి, తేజస్వని, స్వరూ పారాణి, స్వరూప తదితర 63మంది విద్యార్థులు కొత్త రకం వంగడాలను సాగు చేసి ఏపుగా పెరిగేట్లు చేశారని సీనియర్ శాస్త్రవేత్తలు తెలిపారు. ఇక్కడి నేలలకు అనుగుణంగా ఈ కూరగాయల పంటలు వచ్చే అవకాశం ఉందని వారు తెలిపారు. దిగుబడి రాగానే వాటిని పరిశోధనాత్మకంగా ఎంత దిగుబడి, దిగుబడిలో లోటుపాట్లు, కూరగాయల నాణ్యతను పరిశీలించి విద్యార్థుల ప్రతిభను గుర్తిస్తామన్నారు. అంతేగాకుండా ఈ వంగడాల సాగుపై ఇతర రైతులకు అవగాహన కల్పిస్తామని సీనియర్ శాస్త్రవేత్తలు సదరున్నీస తెలిపారు. కూరగాయల సాగులో ప్రతి రోజూ విద్యార్థులు అనువణువునా పరిశీలిస్తూ వాటి పెరుగుదల, తెగులు, చీడ పీడల నివారణకు చర్యలు చేపడుతున్నారు. మంచి దిగుబడి వస్తే ఇక్కడి రైతులకు అన్ని విధాలా ఉపయోగపడతాయని తెలిపారు.



పాపాఘ్ని నదిలో భక్తుల స్నానాల కోలాహలం



భక్తజనంతో నిండిన గండిక్షేత్రం



వేంపల్లె పట్టణంలో అన్నదానం



అంజన్నను దర్శనానికి వెళ్తున్న భక్తులు



అంజన్న సన్నిధిలో మంగళహారతి అందుకుంటున్న భక్తజనం

గండి అంజన్నా.. దండాలు మాయన్నా...

వైభవంగా శ్రావణ మాసోత్సవం

వేంపల్లె, చక్రాయపేట

అంజన్న సన్నిధిలో భక్తజనం పోటెత్తారు. జిల్లా నుంచే కాకుండా ఇతర జిల్లాల నుంచి భక్తులు గండి క్షేత్రం చేరుకుని వీరాంజనేయస్వామిని దర్శించుకున్నారు. గండి క్షేత్రంలో శ్రావణ మాసోత్సవాలలో భాగంగా మూడవ శనివారం గండి క్షేత్రంలో వేకువజామునే ఆలయ పూజారులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆంజనేయస్వామిని ప్రత్యేక పూలతో అలంకరించగా భక్తులు స్వామివారిని తిలకించి తరించారు. ఉదయం సాధారణంగా ఉన్న భక్తుల రద్దీ 9గంటల తర్వాత అనూహ్యంగా పెరిగింది. ఉచిత దర్శనం, రూ.50 దర్శనాల క్యూలో భక్తులు భారీగా కనిపించారు. రూ. 200 టికెట్‌ను మార్చి రూ.100 చేయడంతో ఆ క్యూలైన్లో కూడా భక్తజనం రద్దీ బాగా కనిపించింది.

భక్తుల కోసం సౌకర్యాల ఏర్పాటు

గండి క్షేత్రానికి చేరుకుని ఆంజనేయస్వామి దర్శించుకోవాలనుకున్న భక్తులకు హనుమత్ సేవకులు, ట్రిపుల్‌ఐటీ విద్యార్థులు సహాయ సహకారాలు అందించారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ గురుప్రసాద్, ఛైర్మన్ రాజారావు, పాలక మండలి సభ్యులు వెంకటస్వామి, పసుపులేటి బాబు, సిబ్బంది భక్తులకు అవసరమైన ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. మరోవైపు వేంపల్లె వైపు నుంచి వచ్చే వాహనాలను వీరన్నగట్టుపల్లె వద్ద, రాయచోటి వైపు నుంచి వచ్చే వాహనాలను అద్దాలమర్రి వద్ద పోలీసులు నిలిపివేయడంతో భక్తులు నడుచుకుంటూ గండికి చేరుకున్నారు. గండి క్షేత్రంలో భక్తులు భారీగా రావడంతో ఆ ప్రాంతమంతా జనసందోహంగా మారింది. పాపాఘ్ని నదిలో ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన స్నానాలఘట్టం వద్ద స్నానం చేసి స్వామివారిని దర్శించుకున్నారు. సాయంత్రానికి 80వేలకు మందికి పైగా భక్తులు అంజన్నను దర్శించుకున్నారని ఆలయ అధికారులు తెలిపారు.

అంజన్న సన్నిధికి పోటెత్తిన భక్తజనం

భారీగా అన్నదానాలు

గండి ప్రాంతంలో భారీగా అన్నదానాలు ఏర్పాటుచేశారు. వేంపల్లె పట్టణం గండిరోడ్డులోని పాలిటెక్నిక్ కళాశాల, నారాయణస్కూల్ వద్ద యాజమాన్యం, కుమ్మరాంపల్లె వద్ద చింతల మడుగుపల్లె వాసులు, వీరన్నగట్టుపల్లె వద్ద భూమానందాశ్రమం, పాపాఘ్ని నది గండి క్షేత్రంలోని పలుచోట్ల, ఆర్యవైశ్య అన్నదాన సత్రంలో, అన్నదానాలు నిర్వహించారు. వేంపల్లె హనుమాన్ జంక్షన్‌లో గాజులపేటకు చెందిన దేవస్థాన సభ్యులు పసుపులేటి బాబు దాతల సహకారంతో అన్నదానం ఏర్పాటుచేశారు.

స్వామివారిని దర్శించుకున్న ఎమ్మెల్యేలు, నాయకులు

గండి ఆంజనేయస్వామిని వివిధ ప్రాంతాల ప్రముఖులు, ఎమ్మెల్యేలు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. రాయచోటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి, వైసీపీ జిల్లా అధ్యక్షుడు అమర్‌నాథరెడ్డి, దుగ్గాయపల్లె మల్లికార్జునరెడ్డి, గుంటూరు జిల్లా మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, ఆప్కో ఛైర్మన్ గుజ్జుల శ్రీను, మైసూరారెడ్డి సోదరుడు రమణారెడ్డి, కడప తెలుగుదేశం నాయకుడు దుర్గాప్రసాద్, అనంతపురం జిల్లాకు చెందిన నాయకులు వీరాంజనేయులు తదితరులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.



శ్రావణ శనివారం పురస్కరించుకుని ప్రత్యేక అలంకరణలో పూజలందుకుంటున్న గండి వీరాంజనేయస్వామి

నీతి ఆయోగ్ వైస్ చైర్మన్‌గా రాజీవ్ కుమార్

కరెంట్ అఫైర్స్



రామచంద్రారెడ్డి ఉప్పుల

నియామకం

ప్రపంచ బ్యాంకు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అపర్ణ

గుజరాత్ కేడర్ ఐఏఎస్ అధికారిణి, గుజరాత్ ముఖ్యమంత్రి విజయ్ రూపానీ ప్రిన్సిపల్ సెక్రటరీ అపర్ణ ప్రపంచ బ్యాంకు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా నియమితులయ్యారు. 1988 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన అపర్ణ మూడేళ్ల ఈ పదవిలో కొనసాగుతారు. ప్రపంచ బ్యాంకులో భారత్, బంగ్లాదేశ్, భూటాన్, శ్రీలంక దేశాలకు ఆమె ప్రాతినిధ్యం వహిస్తారు.

నీతి ఆయోగ్ వైస్ చైర్మన్‌గా రాజీవ్ కుమార్



నీతి ఆయోగ్ వైస్ చైర్మన్‌గా ప్రముఖ ఆర్థికవేత్త రాజీవ్ కుమార్ నియమితులయ్యారు. 2015 జనవరి నుంచి వైస్ చైర్మన్‌గా సేవలందించిన అరవింద్ పనగడియా రాజీనామా చేయడంతో రాజీవ్‌ను ఆ స్థానంలో నియమించారు. ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయం నుంచి ఆర్థికశాస్త్రంలో డాక్టరేట్ పొందిన రాజీవ్ వివిధ సంస్థల్లో కీలక బాధ్యతలు నిర్వహించారు. ఫిక్కీ సెక్రటరీ జనరల్‌గా, సీఐఐ ముఖ్య ఆర్థిక సలహాదారుగా సేవలందించారు. పరిశ్రమలు, ఆర్థిక మంత్రిత్వశాఖల్లో, ఆసియా అభివృద్ధి బ్యాంకులో కీలక బాధ్యతలు నిర్వహించారు. 2006 నుంచి 2008 మధ్య నేషనల్ సెక్యూరిటీ అడ్వైజరీ బోర్డు సభ్యుడిగా పనిచేశారు. రాజీవ్ కుమార్‌తో పాటు ఎయిమ్స్ వైద్యుడు వినోద్ పాల్‌ను కూడా నీతి ఆయోగ్ సభ్యుడిగా కేంద్రం నియమించింది.

45వ సీజేగా దీపక్ మిశ్రా

సుప్రీంకోర్టు 45వ ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ దీపక్ మిశ్రా నియమితులయ్యారు. ప్రస్తుత సీజే జస్టిస్ జగదీష్ ఖేహర్ ఆగస్టు 27న పదవీ విరమణ చేయనున్నారు. ఆయన స్థానంలో దీపక్ మిశ్రా బాధ్యతలు చేపడతారు. మిశ్రా 2018 అక్టోబరు 3 వరకు పదవిలో ఉంటారు. 1990-91లో సుప్రీంకోర్టు 21వ ప్రధాన న్యాయమూర్తిగా సేవలందించిన రంగనాథ్ మిశ్రా మేనల్లుడే దీపక్ మిశ్రా. దీపక్ గతంలో పట్నా, ఢిల్లీ హైకోర్టు సీజేగా సేవలందించారు.

ఉపరాష్ట్రపతిగా వెంకయ్య ప్రమాణం

భారత 13వ ఉపరాష్ట్రపతిగా ముప్పవరపు వెంకయ్యనాయుడు ఆగస్టు 11న ప్రమాణ స్వీకారం చేశారు. రాష్ట్రపతి భవన్‌లోని దర్బార్‌హాల్‌లో రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ఆయనతో ప్రమాణం చేయించారు. ఆగస్టు 6న జరిగిన ఉపరాష్ట్రపతి ఎన్నికలో ప్రతిపక్షాల ఉమ్మడి అభ్యర్థి గోపాలకృష్ణ గాంధీపై వెంకయ్య విజయం సాధించారు. ఏపీ నుంచి ఉపరాష్ట్రపతి పదవి అలంకరించిన మూడో వ్యక్తి వెంకయ్యనాయుడు. గతంలో సర్వేపల్లి రాధాకృష్ణన్, వి.వి.గిరి. ఉపరాష్ట్రపతిగా ఎన్నికై రాష్ట్రపతి అయ్యారు.

తొలి ప్రైవేట్ క్షిపణి తయారీ

దేశంలోనే తొలిసారిగా ప్రైవేట్ రంగంలో క్షిపణి విడిభాగాల తయారీ సంస్థ 'కళ్యాణి-రఫెల్ అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్'ను ఆగస్టు 3న హైదరాబాద్‌లో తెలంగాణ రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ ప్రారంభించారు. మేకిన్ ఇండియాలో భాగంగా భారత్‌కు చెందిన కళ్యాణి గ్రూప్, ఇజ్రాయెల్‌కి చెందిన రఫెల్ అడ్వాన్స్‌డ్ డిఫెన్స్ సిస్టమ్స్ సంయుక్తంగా ఈ పరిశ్రమను హార్డ్‌వేర్ పార్కులో ఏర్పాటు చేశాయి. రక్షణ రంగంలో విదేశీ పెట్టుబడులకు అనుమతి లభించడంతో కళ్యాణి గ్రూప్ 51 శాతం, రఫెల్ 49 శాతం వాటాతో ఈ ప్రాజెక్టు చేపట్టాయి. ఈ కర్మాగారంలో రిమోట్ ఆయుధాలను, యాంటీ ట్యాంక్ మిస్సైల్స్‌ను, అత్యాధునిక క్షిపణి వ్యవస్థ పరికరాలను తయారు చేయనున్నారు.

అవార్డులు

గోరటి వెంకన్న, సుద్దాలకు 'జాలాది'

సినీ రచయిత జాలాది జయంతిని పురస్కరించుకొని విశాఖలో ఆగస్టు 9న జాలాది జాతీయ పురస్కారాలను అందజేశారు. ప్రజాకవి గోరటి వెంకన్నకు జాలాది జీవితకాల సాఫల్య పురస్కారం, సినీ గేయ రచయిత సుద్దాల అశోక్‌తేజకు జాలాది జాతీయ పురస్కారం అందించారు. ఏపీ మంత్రి గంటా శ్రీనివాసరావు అవార్డులను అందజేశారు. జాలాది రాజారావు 1500కి పైగా సినీ గేయాలు రాశారు. గుడివాడలో జన్మించిన జాలాది ఎక్కువగా జానపద గేయాలను రచించారు.

భారత డిజిటల్ గ్రంథాలయ యాప్‌కి 'గ్లోబల్'

జాతీయ డిజిటల్ గ్రంథాలయ యాప్‌కు 'ఎంబిలియంత్ దక్షిణాసియా-2017' అవార్డు దక్కింది. అభ్యసనం, విద్య విభాగంలో విద్య సంబంధ అభివృద్ధిలో మొబైల్ యాప్ ఆధారిత ఆవిష్కరణకుగానూ ఈ అవార్డు లభించింది. ఖరగ్‌పూర్ ఐఐటీ ఈ యాప్‌ను రూపొందించగా కేంద్ర మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వ శాఖ ఆమోదించింది. దేశంలోని మారుమూల ప్రాంతాలకు సైతం భారతీయ భాషల్లో విద్య విషయ, బోధన అంశాలు అందరికీ అందుబాటులో ఉంచాలన్నదే ఈ డిజిటల్ గ్రంథాలయం ప్రధాన లక్ష్యం. ఈ డిజిటల్ గ్రంథాలయ యాప్‌లో కోటికి పైగా విషయాంశాలు 200 భాషల్లో అందుబాటులో ఉన్నాయి.

దేవ్ పటేల్‌కి 'ఏషియన్ గేమ్ చేంజర్స్'



స్లమ్‌డాగ్ మిలియనీర్ చిత్ర నటుడు దేవ్ పటేల్ 'ఏషియన్ గేమ్ చేంజర్స్ అవార్డు-2017'కి ఎంపికయ్యారు. దేవ్ లయన్ హార్ట్ ప్రచారం ద్వారా దేశంలోని ఇల్లులేని చిన్నారుల కోసం 2.5 లక్షల డాలర్ల నిధులను సేకరించారు. పేద పిల్లల సంక్షేమం కోసం దేవ్ చేస్తున్న కృషికి ఈ అవార్డు దక్కింది. ఆగాఖాన్‌కు లైఫ్ టైం ఎచీవ్‌మెంట్ అవార్డు లభించింది. తదాషి యనాయ్, నుర్గేవ్, సొనిటా అలిజాదేలకు కూడా గేమ్‌చేంజర్స్ అవార్డు దక్కింది. 2017 నవంబరు 1న ఐక్యరాజ్య సమితి వీరికి అవార్డులను ప్రదానం చేస్తుంది.

క్రీడలు

పరుగుకు బోల్ట్ వీడ్కోలు



దిగ్గజ అథ్లెట్ ఉసేన్ బోల్ట్ తన చివరి వంద మీటర్ల పరుగును కాంస్యంతో ముగించాడు. లండన్‌లో జరుగుతున్న ప్రపంచ అథ్లెటిక్ చాంపియన్‌షిప్‌లో 100 మీటర్ల పరుగులో బోల్ట్ 9.95 సెకన్లతో మూడో స్థానంలో నిలిచాడు. అమెరికాకు చెందిన జస్టిన్ గాట్లిన్ 9.92 సెకన్లతో రేసు పూర్తిచేసి స్వర్ణం గెలుచుకొన్నాడు. మరో అథ్లెట్ కోల్‌మన్ 9.94 సెకన్లతో రజతం సాధించాడు. 100మీ. 9.58 సెకన్లు, 200మీ. 19.19 సెకన్లతో బోల్టు రికార్డులను నెలకొల్పాడు. 2008, 2012, 2016లో వరుసగా మూడు సార్లు 100మీ., 200మీ. పరుగులో స్వర్ణాలు గెలిచిన ఆటగాడిగా రికార్డు సృష్టించాడు. 8 ఒలింపిక్ పసిడి పతకాలను సొంతం చేసుకొన్నాడు. 11 సార్లు ప్రపంచ అథ్లెటిక్ చాంపియన్‌షిప్ విజేతగా నిలిచాడు.

టెస్టుల్లో నెంబర్‌వన్ బౌలర్ జడేజా

ఐసీసీ తాజా ర్యాంకింగ్స్‌లో భారత బౌలర్ రవీంద్ర జడేజా బౌలింగ్, ఆల్‌రౌండర్ విభాగాల్లో మొదటి స్థానంలో నిలిచాడు. శ్రీలంకతో జరిగిన టెస్టు మ్యాచుల్లో అద్భుత ప్రతిభ కనబర్చిన జడేజా ఆల్‌రౌండర్ల జాబితాలో బంగ్లాదేశ్‌కు చెందిన షకీబుల్ హసన్‌ను వెనక్కు నెట్టి నంబర్‌వన్ ర్యాంకు సాధించాడు. బౌలింగ్‌లో కూడా జడేజా నెంబర్‌వన్ ర్యాంకు సాధించాడు. బ్యాటింగ్‌లో పూజారా 3, కోహ్లీ 5, రహానే 6వ స్థానంలో నిలిచారు. బౌలింగ్‌లో అశ్విన్ మూడో స్థానానికి పడిపోయారు.

ముంబై అథ్లెట్ సరికొత్త రికార్డు

ముంబైకి చెందిన అథ్లెట్ సమీర్‌సింగ్ 100 రోజుల్లో 9964 కి.మీ. పరిగెత్తి సరికొత్త రికార్డు సృష్టించాడు. రన్నింగ్ కోచ్ అయిన సమీర్ 100 రోజుల్లో 10 వేల కి.మీ. పరిగెత్తే లక్ష్యంతో ఏప్రిల్ 29న పరుగు మొదలు పెట్టాడు. 100వ రోజు ఆగస్టు 6న 150 కి.మీ. పరిగెత్తాల్సి ఉండగా 114 కి.మీ.కే పరుగు ముగించాడు. సమీర్ మూడు నెలల మారథాన్ అంతా ముంబై మురికివాడలు, నగరంలోని ఇతర ప్రాంతాల్లో సాగింది.

విజేందర్ జైత్రయాత్ర

భారత ప్రొఫెషనల్ బాక్సర్ విజేందర్ సింగ్ మరోసారి తన సత్తా చాటాడు. ఆగస్టు 5న ముంబైలో జరిగిన ఆసియా పసిఫిక్ సూపర్ మిడిల్ వెయిట్ టైటిల్ పోరులో చైనా బాక్సర్ జుల్ఫికర్ మైమైటియాలిని ఓడించి టైటిల్ సాధించాడు. విజేందర్‌కు వరుసగా ఇది తొమ్మిదో బౌట్ విజయం, ప్రొఫెషనల్ కెరీర్‌లో అడుగు పెట్టిన నాటి నుంచి విజేందర్ ఓటమిని ఎరుగక విజయాలు సాధిస్తున్నాడు.

స్వయం ఉపాధి



మైనంపాటి శ్రీనివాసరావు
బిజినెస్ కన్సల్టెంట్
సెల్: 9866119816

దుస్తులను ఉతకడానికి సబ్బు, పొడి రూపంలో డిటర్జెంట్లను ఉపయోగించడం మనందరికీ తెలిసిందే. నాణ్యత ఆధారంగా పలు ధరల్లో రకరకాల డిటర్జెంట్లు అన్ని వర్గాలవారికి ప్రస్తుతం అందుబాటులోకి వస్తున్నాయి. ఫ్యాబ్రిక్ కేర్ మీద పెరుగుతున్న అవగాహన వల్ల సువాసన భరితమైన ఉత్పత్తులకు డిమాండ్ పెరుగుతూ వస్తోంది. మన దేశంలో మొత్తం డిటర్జెంట్స్ మార్కెట్ 2015కిగాను రూ.16184 కోట్లు ఉందని అంచనా వేశారు. ఇది 2019 నాటికి 19 శాతం వరకు వృద్ధి చెందుతుందని భావిస్తున్నారు. ఒకప్పుడు కేవలం నగరాలు, పట్టణాలకే పరిమితమైన డిటర్జెంట్స్ వినియోగం నేడు గ్రామాలకు, చిన్న చిన్న పల్లెలకు విస్తరించింది.

లిక్విడ్ డిటర్జెంట్స్



తక్కువగా ఉన్న తలసరి వినియోగం: అభివృద్ధి చెందిన దేశాలతో పోలిస్తే మన దేశంలో డిటర్జెంట్స్ తలసరి వినియోగం చాలా తక్కువగా అంటే ఏడాదికి 2.7 కేజీలు మాత్రమే ఉంది. ఫిలిప్పీన్స్, మలేషియా దేశాల్లో 3.7 కిలోలు, అమెరికాలో 10 కిలోలు ఉండటం గమనార్హం. అయితే ఇటీవల మన దేశంలో కూడా వీటి వినియోగం చెప్పుకోదగిన రీతిలో పెరుగుతుందని మార్కెటింగ్ వర్గాలు విశ్లేషిస్తున్నాయి.

ద్రవరూప డిటర్జెంట్స్: మనదేశంలో డిటర్జెంట్ ఉత్పత్తుల్ని ప్రధానంగా రెండు రకాలుగా వర్గీకరించవచ్చు. అవి డిటర్జెంట్ పొడి, డిటర్జెంట్ సబ్బు. వీటిని మళ్లీ రెండు రకాలుగా విభజించవచ్చు.

పాపులర్ / ఎకానమి ఉత్పత్తులు: ఇవి తక్కువ ధరలో లభిస్తాయి. వీటిని పేద, దిగువ మధ్యతరగతి వారికోసం ఉద్దేశించారు.

మధ్యస్థ ధర ఉత్పత్తులు: వీటిని మధ్య తరగతి కుటుంబాలకు ప్రత్యేకించారు.

ప్రీమియం ఉత్పత్తులు: వీటిని ధనిక, సంపన్న వర్గాలకోసం కేటాయించారు.

నాణ్యత ఆధారంగా ధరలను సమతౌల్యం చేస్తూ ఉత్పత్తులను మార్కెట్‌లోకి విడుదల చేస్తున్నారు. అభివృద్ధి చెందిన దేశాల్లో ఇప్పటికే సర్వసాధారణమైనప్పటికీ మనదేశంలో మాత్రం ఇప్పుడిప్పుడే ప్రాచుర్యం పొందుతున్న ఉత్పత్తి 'లిక్విడ్ డిటర్జెంట్'. బార్ సబ్బులు, లిక్విడ్ & పొడి రూప డిటర్జెంట్ల కంటే సమర్థంగా పనిచేయకపోవడం, వినియోగదారుల చేతులకు హానికారకంగా మారడం వల్ల వాటి వినియోగం క్రమంగా తగ్గుతూ వచ్చింది. మనదేశంలో కూడా సబ్బులకు బదులుగా ద్రవరూప డిటర్జెంట్స్ వాడకం ప్రారంభమైందనే చెప్పాలి.

లిక్విడ్ డిటర్జెంట్స్ వినియోగం: ఇతర డిటర్జెంట్స్ లాగే ద్రవరూప డిటర్జెంట్స్‌ను కూడా బకెట్ వాషింగ్‌లో, టాప్ లోడ్& ఫ్రంట్ లోడ్ వాషింగ్ మెషిన్లలో సైతం ఉపయోగించవచ్చు. 2008లో భారతదేశ లిక్విడ్ డిటర్జెంట్స్ మార్కెట్ రూ.60 కోట్లు ఉండగా ప్రస్తుతం రూ.350 కోట్ల స్థాయికి వృద్ధి పొందినట్లు అంచనా. అంటే ఏటా 35 శాతం వరకు పెరుగుతున్నట్లు చెప్పవచ్చు.

యంత్ర పరికరాలు:

● స్టెయిన్‌లెస్ స్టీల్ కెటిల్ మిక్సర్ ● వాటర్ ఫెజ్ ● లిక్విడ్ పంప్ ● వాటర్ చిల్లర్ ● ఎయిర్ కంప్రెషర్ ● వాటర్ హీటింగ్ సిస్టం ● సెమి ఆటోమెటిక్ బాటిల్ ఫిల్లింగ్ యంత్రం ● షింక్ ర్యాపింగ్ ప్యాకింగ్ యంత్రం ● ఇతర పరికరాలు

ముడి పదార్థాలు

● పాలిమర్ ● ఎఒఎస్ ● యాసిడ్ స్లరి ● ఎస్ఎల్ఎస్ ● ఎస్ఎల్ఇఎస్ ● యూరియా ● ఫైన్ సాల్ట్ ● కాస్టిక్ సోడా ● పర్ఫ్యూమ్స్ ● కలర్స్

తయారీ విధానం: ముందుగా నిర్ణయించిన వివిధ ముడి పదార్థాలను నిర్ణీత నిష్పత్తుల్లో కెటిల్ మిక్సర్‌లో వేడిచేసి బాగా కలుపుతారు. ఎటువంటి ముక్కలు లేకుండా బాగా కలిపి చిల్లర్ ద్వారా చల్లబరుస్తారు. చల్లని లిక్విడ్ డిటర్జెంట్‌ను 100మిలీ, 250 మిలీ, 500 మిలీ, 1 లీ బాటిల్స్‌లో నింపి ప్యాకింగ్ చేసి మార్కెటింగ్‌కు పంపుతారు. బల్క్ వినియోగదారుల కోసం 5 లీ, 10 లీ ప్లాస్టిక్ క్యాన్లలో ప్యాక్ చేసి మార్కెటింగ్ కోసం పంపుతారు.

మార్కెటింగ్: లిక్విడ్ డిటర్జెంట్ క్రమేణా ప్రాచుర్యం పొందుతోంది కాబట్టి నగరాలు, పట్టణాల్లోని సూపర్ మార్కెట్లు, కిరాణాషాపుల ద్వారా వినియోగదారులకు అందుబాటులో ఉండేలా ప్రత్యక్ష/ పరోక్ష మార్కెటింగ్ విధానాలను అనుసరించవచ్చు.

పరిశ్రమ వివరాలు:

ఉత్పత్తి సామర్థ్యం: 400 లీ/ రోజుకు(ఒక షిఫ్ట్‌లో)

పరిశ్రమ వ్యయం: రూ.45 లక్షలు

How much did the member gain?

QUANTITATIVE APTITUDE

1. The difference between compound interest and simple interest on a sum for 2 years at 10% per annum, when the interest is calculated compounded annually is ₹ 16. If the interest were compounded half yearly, then the difference in two interests will be:
(1) ₹ 24.81 (2) ₹ 31.61 (3) ₹ 32.40 (4) ₹ 26.90 (5) None of these


2. Efficiency of Alka is 25% more than Nisha and Nisha takes 25 days to complete a piece of work. Alka started the work alone and then Nisha joined her 5 days before completion of the work. For how many days Alka worked alone?
(1) 13 days (2) 11 days (3) 10 days (4) 16 days (5) None of these

3. In a Journey of 600 km, a Streamer was slowed down due to bad weather and its average speed for the trip was reduced by 200 km/hr and the time of trip increased by 30 minutes. What is the duration of the Journey?
(1) 1 hour (2) 2 hour (3) $\frac{4}{3}$ hour (4) $\frac{3}{2}$ hour (5) $\frac{5}{3}$ hour

4. 9 kg of wheat costs as much as 4 kg of oil, 14 kg of oil costs as much as 1.5 kg of tea, 2 kg of tea costs as much as 5 kg of coffee. Find the cost of 2.5 kg of wheat, if 11 kg of coffee costs ₹ 462.
(1) ₹ 13.50 (2) ₹ 14 (3) ₹ 16 (4) ₹ 12.50 (5) None of these

5. A box contains 30 balls out of which 6 are red. Two balls are chosen at random. What is the probability that at least one of the chosen balls is red?
(1) $\frac{53}{145}$ (2) $\frac{63}{145}$ (3) $\frac{51}{145}$ (4) $\frac{57}{145}$ (5) $\frac{48}{145}$

Direction (6-10): Study the following Pie-chart carefully to answer the given question.
Pie-chart show the percentage distribution of number of students who likes different subject
Total number of students = 1800



6. If two-ninth of the students who like Physics are female, then number of male who likes Physics are is approximately what percentage of the total number of students who like Chemistry?
(1) 57% (2) 42% (3) 63% (4) 69% (5) None of these

7. What is the total number of students who like Chemistry, English and Biology together?
(1) 1126 (2) 1116 (3) 1176 (4) 998 (5) None of these

8. What is the difference between the total number of students who like English and Physics together and the total number of student who like Mathematics and Biology together?
(1) 352 (2) 342 (3) 643 (4) 653 (5) None of these

9. What is the ratio between the number students who likes Mathematics and the number of students who like Hindi?
(1) 13 : 7 (2) 7 : 13 (3) 7 : 26 (4) 6 : 15 (5) None of the above

10. If the percentage of students who like Mathematics are increased by 50% and percentage of students who like Hindi are decreased by 25%, then what will be the total number of students who like Mathematics and Hindi together?
(1) 390 (2) 379 (3) 459 (4) 480 (5) None of these

11. A train leaves from Delhi for Bhagalpur at 6 AM, Another train leaves Bhagalpur for Delhi at 9 AM on the same day. Distance from Delhi to Bhagalpur is 2375 km. If the first train runs at the speed of 150 kmph and second train runs at the speed of 200 kmph, then at what time will both trains meet?
(1) 10:15 AM (2) 02:30 PM (3) 11:30 AM (4) 01:45 PM (5) 01:35 PM

12. A cycle travels 7.7 km in 3500 revolution of wheels. How much should be the diameter of the wheels to cover double distance in same revolutions?
(1) 0.7 m (2) 1.4 m (3) 2.1 m (4) 2.8 m (5) 3.2 m

13. A man offers 5% discount to all his customers and for members he offers 15% additional discount. Also, an additional discount of 3% is given to anyone who pays in cash. If the man, by mistake, took ₹ 39,000 in cash, from a member for an article whose original price was ₹ 50,000, then how much did the member gain?
(1) ₹ 175 (2) ₹ 163.75 (3) ₹ 230 (4) ₹ 170.25 (5) ₹ 170

14. Three pipe A, B and C can fill up a tank in 6 hours, 10 hours, and 15 hours respectively. If the pipe A and C is opened alternatively for 1 hour each and pipe B are opened for forever, when will the tank be filled up?
(1) $4\frac{1}{2}$ hours (2) 3 hours (3) $2\frac{1}{2}$ hours (4) 1 hours (5) 5 hours



B. Krishna Kishore
Senior Faculty
Dimensions Coaching Centre, Guntur.

RRB, PO's & Clerks Special

Answers With Explanation

1. (1) $C.I - S.I = P\left(\frac{R}{100}\right)^2$

$\Rightarrow 16 = P\times\left(\frac{10}{100}\right)^2$

$\Rightarrow P = ₹1600$

When interest compounded half-yearly,

$C.I = 1600\left[\left(1+\frac{5}{100}\right)^4 - 1\right]$

$= 1600 \times \left(\frac{194481}{160000} - 1\right)$

$= 1600 \times \frac{34481}{160000} = ₹344.81$

$S.I = \frac{1600\times2\times10}{100} = ₹320$

∴ Required difference $= 344.81 - 320 = ₹24.81$

2. (2) Nisha takes 25 days to complete the work.
Alka is 25% efficient than Nisha
So, she takes $25\times\frac{4}{5} = 25$ days.
Let Alka x days to complete the work.

$\frac{x}{20} + 5\left(\frac{1}{20}+\frac{1}{25}\right) = 1$

$\Rightarrow \frac{x}{20} + 5\times\frac{9}{100} = 1$

$\Rightarrow \frac{x}{20} = 1 - \frac{9}{20}$

$\Rightarrow \frac{x}{20} = \frac{11}{20} \Rightarrow x = 11$ days

3. (1) Let the duration of Journey be x hours.

$\frac{600}{x} - \frac{600}{x+\frac{1}{2}} = 200$

$\Rightarrow \frac{600}{x} - \frac{1200}{2x+1} = 200$

$\Rightarrow 2x^2 + x - 3 = 0$

$\Rightarrow 2x^2 - 2x + 3x - 3 = 0$

$\Rightarrow 2x(x-1) + 3(x-1) = 0$

$\Rightarrow (2x+3)(x-1) = 0 \Rightarrow x = \frac{-3}{2}, 1$

Ignore the –ve value of x.

∴ Time = 1 hour

4. (4) Here, $\frac{Wheat}{Oil} = \frac{4}{9}$

$\frac{Oil}{Tea} = \frac{1.5}{14} = \frac{3}{28}$

$\frac{Tea}{Coffee} = \frac{5}{2}$

∴ Ratio of Wheat, Oil, Tea and Coffee $= 20 : 45 : 420 : 168$

Cost of coffee per kg $= \frac{462}{11} = ₹42$

∴ Cost of 2.5 kg wheat

$= \frac{42}{168}\times 20 \times 2.5 = ₹12.5$

5. (5) Required probability

$= \frac{6c_1 \times 24c_1}{30c_2} + \frac{6c_2}{30c_2}$

$= \frac{6\times24}{435} + \frac{15}{435} = \frac{48}{145}$

(6-10):

6. (1) No. of male who likes Physics

$= 1800 \times \frac{17}{100}\times\frac{7}{9} = 238$

Total no. of students who like Chemistry $= 1800 \times \frac{23}{100} = 414$

∴ Required % $= \left(\frac{238}{414}\times100\right)\%$

$= 57.48\% \approx 57\%$

7. (2) Required total

$= 1800 \times \left(\frac{23+12+27}{100}\right)$

$= 1800 \times \frac{62}{100} = 1116$

8. (2) Total no. of students who like English and Physics together

$= 1800 \times \left(\frac{27+17}{100}\right) = 792$

Total no. of students who like Mathematics and Biology together

$= 1800 \times \left(\frac{13+12}{100}\right) = 450$

∴ Required difference $= 792 - 450 = 342$

9. (5) Required ratio $= 13 : 6$

10. (3) No. of students who like Mathematics

$= 1800 \times \frac{13}{100}\times\frac{150}{100}$

$= 351$

No. of students who like Hindi

$= 1800 \times \frac{6}{100}\times\frac{75}{100} = 108$

∴ Required total $= 351 + 108 = 459$

11. (2) Let both trains meet t hours after first train leaves Delhi. By then first train have been running for t hours and second train have been running for $(t-3)$ hours

Distance travelled by first train $= 150t$ km

Distance travelled by second train $= 200(t-3)$ km

ATQ,

Total distance covered = 2375 km

$\Rightarrow 150t + 200(t-3) = 2375$

$\Rightarrow 350t = 2375 + 600$

$\Rightarrow 350t = 2975$

$\Rightarrow t = 8.5$ hours

∴ Required time at both trains meet = 6 AM + 8.5 hours = 2 : 30 PM

12. (2) Distance travelled by a wheel in one revolution = Circumference of the whell $= 2\pi r = \pi d$

The wheel of a circle completes 3500 revolution to complete a distance of 7.7 km = 7700 m.

∴ Distance travelled in one revolution

$= \frac{7700}{3500} = \frac{11}{5}$ m.

$\Rightarrow \pi d = \frac{11}{5}$

$\Rightarrow \frac{22}{7}\times d = \frac{11}{5}$

$\Rightarrow d = 0.7$ m

We need to double the distance covered in 3500 revolution.

∴ Distance covered in one revolution should be doubled.

∴ New diameter of wheel should be $2 \times 0.7 = 1.4$ m.

13. (2) M.P of an article = ₹ 50,000
Discount given = 5% on M.P

∴ $S.P = 50000 \times \frac{95}{100}$ = ₹ 47,500

S.P of members

$= 47,500 \times \frac{85}{100} = ₹40,375$

and additional discount for cash payment

$= 40,375 \times \frac{97}{100}$

= ₹ 39,163.75

∴ Gain = 39,163.75 – 39000 = ₹ 163.75

14. (1) The part of tank filled by pipe A and B in 1 hour

$= \left(\frac{1}{6}+\frac{1}{10}\right) = \frac{4}{15}$

The part of tank filled by pipe B and C in 1 hour

$= \left(\frac{1}{10}+\frac{1}{15}\right) = \frac{1}{6}$

So, the part of tank filled up in 2 hrs

$= \frac{4}{15}+\frac{1}{6} = \frac{13}{30}$

Then, in 4 hours $= 2 \times \frac{13}{30} = \frac{13}{15}$

∴ Empty part $= 1 - \frac{13}{15} = \frac{2}{15}$

So, the empty part of tank will be filled up by pipe A and B.

∴ Required time $= \left(\frac{2}{15}\times\frac{15}{4}\right) = \frac{1}{2}$ hours

∴ Total time taken $= 4+\frac{1}{2} = 4\frac{1}{2}$ hours

ఉద్యోగాలు

ఇంటెలిజెన్స్ బ్యూరో

ఇంటెలిజెన్స్ బ్యూరో - **'అసిస్టెంట్ సెంట్రల్ ఇంటెలిజెన్స్ ఆఫీసర్'** పోస్టుల భర్తీకి ఉద్దేశించిన **ఎగ్జిక్యూటివ్ ఎగ్జామ్ - 2017**కు ప్రకటన విడుదల చేసింది.

మొత్తం ఖాళీలు: 1300(జనరల్ వర్గానికి 951, ఒబిసిలకు 184, ఎస్సీలకు 109, ఎస్టీలకు 56 పోస్టులు కేటాయించారు)

అర్హత: డిగ్రీ ఉత్తీర్ణతతోపాటు కంప్యూటర్ పరిజ్ఞానం ఉండాలి.

వయసు: 18 నుంచి 27 ఏళ్ల మధ్య ఉండాలి.

ఎంపిక: ఎగ్జిక్యూటివ్ ఎగ్జామ్, ఇంటర్వ్యూ, మెడికల్ ఎగ్జామినేషన్ ద్వారా

ఎగ్జిక్యూటివ్ ఎగ్జామ్ వివరాలు: ఇందులో టైర్ 1, టైర్ 2 విభాగాలు ఉంటాయి. గంటసేపు జరిగే టైర్ 1 పరీక్షలో అన్నీ మల్టిపుల్ చాయిస్ ఆబ్జెక్టివ్ టైప్ ప్రశ్నలే ఇస్తారు. జనరల్ అవేర్‌నెస్, క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్, లాజికల్/ అనలిటికల్ ఎబిలిటీ, ఇంగ్లిష్ లాంగ్వేజ్‌లకు సంబంధించి ఒక్కోదానిలో 25 ప్రశ్నలు ఇస్తారు. ఈ విభాగానికి 100 మార్కులు కేటాయిం చారు. ప్రతి తప్పు సమాధానానికి పావు మార్కు కట్ చేస్తారు. ఇందులో అర్హత పొందినవారిని మాత్రమే టైర్ 2కు అనుమతిస్తారు. డిస్క్రిప్టివ్ టైప్‌లో జరిగే టైర్ 2 పరీక్షకు కూడా గంట సమయం ఉంటుంది. దీనికి 50 మార్కులు కేటాయిం చారు. వ్యాసానికి 30 మార్కులు, ఇంగ్లిష్ కాంప్రహె న్షన్& ప్రీసెస్ రైటింగ్‌కు 20 మార్కులు ఉంటాయి.

టైర్ 1, టైర్ 2 పరీక్షల్లో అభ్యర్థులు సాధించిన మెరిట్ ఆధారంగా వారిని ఇంటర్వ్యూకి ఎంపిక చేస్తారు. ఇంటర్వ్యూ 100 మార్కులకు ఉంటుంది.

టైర్ 1 ఎగ్జామ్ పరీక్ష కేంద్రాలు: తెలుగు రాష్ట్రాల అభ్యర్థులు హైదరాబాద్, విజయవాడ కేంద్రాలను ఎంచుకోవచ్చు.

పరీక్ష ఫీజు: రూ.100

ఆన్‌లైన్ దరఖాస్తుకు ఆఖరు తేదీ: సెప్టెంబరు 2

వెబ్‌సైట్: www.mha.nic.in

అడ్మిషన్స్

తెలంగాణ డిఎంఇ

హైదరాబాద్‌లోని డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డిఎంఇ)- ప్రభుత్వ/ ప్రైవేట్ మెడికల్ విద్యా సంస్థల్లో **జనరల్ నర్సింగ్ అండ్ మిడ్‌వైఫరీ** కోర్సులో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతున్నారు.

కోర్సు కాలవ్యవధి: మూడేళ్లు

గవర్నమెంట్ సంస్థలు - సీట్లు: ఉస్మానియా జనరల్ హాస్పిటల్ 62, గాంధీ హాస్పిటల్ 62, ఎంజిఎం హాస్పిటల్ 62, నిజామాబాద్ ఏరియా హాస్పిటల్ 27, కరీంనగర్ హెడ్ క్వార్టర్స్ హాస్పిటల్ 42, నిజామాబాద్ జనరల్ హాస్పిటల్ 32

ప్రైవేట్ సంస్థల్లోని సీట్ల వివరాల కోసం వెబ్‌సైట్‌లోని ప్రకటన చూడవచ్చు.

అర్హత: 40 శాతం మార్కులతో ఇంటర్/ ఇంటర్ ఒకేషనల్ పూర్తిచేసి ఉండాలి.

వయసు: జూలై 1 నాటికి 17 నుంచి 35 ఏళ్ల మధ్య ఉండాలి.

ఎంపిక: అకడమిక్ మెరిట్ ఆధారంగా

గవర్నమెంట్ సంస్థల్లో ఎంపిక ప్రక్రియకు ఆఖరు తేదీ: సెప్టెంబరు 18

ప్రైవేట్ సంస్థల్లో ఎంపిక ప్రక్రియకు ఆఖరు తేదీ: అక్టోబరు 7

క్లాసులు ప్రారంభం: అక్టోబరు 21 నుంచి

రిజిస్ట్రేషన్ ఫీజు: రూ.200

రిజిస్ట్రేషన్‌కు ఆఖరు తేదీ: ఆగస్టు 24

ఆన్‌లైన్ దరఖాస్తుకు ఆఖరు తేదీ: ఆగస్టు 28

ప్రభుత్వ సంస్థల్లో దరఖాస్తు హార్డు కాపీ సబ్మిషన్‌కు ఆఖరు తేదీ: సెప్టెంబరు 4

వెబ్‌సైట్: http://dme.telangana.gov.in

నేటి నుంచి తాళ్ళపాకలో పవిత్రోత్సవాలు

రాజంపేట రూరల్ : తాళ్ళపాక అన్నమాచార్యుల ఆరాధ్యదైవాలైన చెన్నకేశవ, సిద్ధేశ్వరస్వామి వార్ల ఆలయంలో ఆదివారం నుంచి పవిత్రోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ ఇన్‌స్పెక్టర్ తెలిపారు. ఆదివారం ఉదయం ఆలయాల్లో గణపతి పూజ, పుణ్యాహవచనం, వాస్తుహోమం, అంకురార్పణ, 14వ తేదీన గణపతి పూజ, పుణ్యాహవచనం, యాగశాలపూజ, గ్రంధి పవిత్రపూజ, 15వ తేదీన గణపతి పూజ, పుణ్యాహవచనం, నిత్యపూజ, నిత్యహోమం, పట్టుపవిత్రసమర్పణ, పూర్ణాహుతి, 15వ తేదీన గ్రామంలో స్వామి వార్లకు గ్రామోత్సవం నిర్వహించనున్నారు.

విద్యుదాఘాతంతో బాలుడు మృతి

-మరొక బాలునికి గాయాలు

పుల్లంపేట : ట్రాన్స్‌కో అధికారుల నిర్లక్ష్యంతో మహమ్మద్అన్సారీ(8) అనే బాలుడు మృతి చెందగా పెదాపూర్ రెహ మాన్(8) అనే బాలుడు గాయపడ్డాడు. వివరాల్లోకెళితే మం డల పరిధిలోని అప్ప య్యరాజుపేట గ్రామం లో మీనార్ మసీదు గురువు ఇపనురెహ మాన్‌ది ఉత్తర ప్రదేశ్ రాష్ట్రం. కొన్నేళ్ళుగా వారి బంధువులంతా రాజంపేటకు వచ్చి మసీదులో గురువులుగా ఉంటున్నారు. ఇపనూర్ రెహమాన్ రాజం పేటలోని అహ్మ దుల్లా అన్సారీ సోదరిని వివా హమాడాడు. వరుసగా సెలవులు రావడంతో అహ్మదుల్లా అన్సారీ తన భార్య, పిల్లలతో పుల్లంపేటలోని సోదరి ఇంటికి వచ్చాడు. శనివారం మధ్యా హ్నం భోజనం చేసుకొని సరదాగా రెండు కుటుంబాలు కబుర్లు చెప్పుకుంటుండగా నాలుగు గంటల సమ యంలో అహ్మదుల్లా అన్సారీ కుమారుడు మహమ్మద్అన్సారీ(8), మృతి చెందినట్లు వార్త రావడంతో వారంతా విషాదంలో మునిగారు. మృతుడు మహమ్మద్అన్సారి, పెదాపూర్ రెహ మాన్(8) మసీదుకు వెళ్ళి ప్రార్థనలు చేసి ఆ తరువాత మసీదు పక్కనే ఉన్న ఉర్దూ పాఠ శాల పైకి వెళ్ళి ఆటలాడుకోసాగారు. అయితే అక్కడ అడుగు ఎత్తులో విద్యుత్ మెయిన్ తీగలు వెళుతున్నాయి. ప్రమాదవశాత్తు ఇద్దరు పిల్లలకు విద్యుత్‌తీగలు తగలడంతో మహ్మద్అన్సారీ చనిపోగా పెదాపూర్ రెహ మాన్ గాయపడ్డాడు. వెంటనే ఇద్దరినీ రాజం పేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు మహమ్మద్ అన్సారీ మృతి చెందాడని తెలిపారు. రెహమాన్ గాయపడి చికిత్స పొందుతున్నాడు. ప్రస్తుతం రెహమాన్ ప్రమాదం లేదని వైద్యులు తెలిపారు.


గాయపడి బాలుడు రెహమాన్

ట్రాన్స్‌కో అధికారుల నిర్లక్ష్యమే..

నాలుగేళ్ళుగా విద్యుత్ తీగల వల్ల ప్రమాదం ఉందని పలుమార్లు గతంలో ఉన్న ఏఈ బాలసుబ్రమణ్యంకు తెలియజేశామని గ్రామ స్థులు వివరించారు. ఫొటోలు తీసి కూడా అధికారులకు పంపించినా ట్రాన్స్‌కో అధికార లు ఏ మాత్రం స్పందించలేదని, విద్యుత్ తీగలు మార్చి ఉంటే ఈ ప్రమాదం జరిగి ఉండేది కాదన్నారు. రంజాన్ పండుగ పర్వ దినం ముందు ఓ చిన్నారి ఇదే విధంగా ప్రమాదానికి గురికాగా వెంటనే పుల్లంపేటకు తీసుకవచ్చి చికిత్సలు చేయడంతో బతికి బయటపడ్డారన్నారు. ఈ విషయాలన్నీ ట్రాన్స్‌కో ఏఈకి తెలిపినా పట్టీనట్లు వ్యవహరించారన్నారు. ఐదేళ్ళు ఏఈగా ఉన్న బాలసుబ్రమణ్యం ఏ నాడూ వచ్చి చూసిన పాపానపోలేదన్నారు. చనిపోయిన చిన్నారిని వారి కుటుంబానికి ఎవరు తెచ్చిస్తారని, వారి తల్లిదండ్రుల బాధ వర్ణనాతీతంగా ఉందని, ఇలాంటి సంఘటనలు మళ్ళీ జరగకుండా అధికారులపై చర్యలు తీసుకోవడంతో పాటు వెంటనే విద్యుత్ లైన్లను తొలగించాలని గ్రామస్థులు అంటున్నారు.

కోదండపాణి కోవెలకు శ్రావణశోభ


ఒంటిమిట్టలో ప్రత్యేక అలంకరణలో దర్శనమిస్తున్న కోదండపాణి

ఒంటిమిట్ట : ఏకశిలా నగరి ఒంటిమిట్టలోని కోదండపాణి కోవెల శ్రావణమాస శోభను సంతరించుకుంది. మూడవ శ్రావణ శనివా రంతో పాటు వరుస సెలవుల నేపథ్యంలో 3వేల మంది దాకా భక్తులు కోవెలకు తరలి రావడంతో సందడి నెలకొంది. ముందుగా శ్రీ సీతారామలక్ష్మణ సమేత మూలవరులకు ప్రధాన అర్చకులు వీణారాఘవాచార్యులు, అర్చకులు శ్రావన్‌కుమార్‌ల అధ్వర్యంలో పాలు, పెరుగు, పసుపు, గంధం, తేనె, కొబ్బరినీళ్ళు, సుగంధ పరిమళ ద్రవ్యాలు కలిపిన జలంతో అభిషేకించారు. అనంతరం పట్టుపీతాంబరాలు, తులసీగజమాలలతో ప్రత్యేక అలంకరణలు చేసి నైవేద్యం సమ ర్పించారు. విష్ణు సహస్ర నామార్చనలు, ఆదిత్యహృ దయం, శ్రీసూక్తం, పురుషసూక్తం, హను మాన్ చాలీసా పారాయణంతో వేదో క్తంగా పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులు స్వామి వారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అంతకుముందు ఆలయ అధికారులు, అర్చకులు సంప్రదాయ బద్ధంగా పూజాసామాగ్రి, పట్టుపీతాంబ రాలను స్వామి వారికి సమర్పించారు.

ఇలా అయితే.. ట్రాఫిక్ సమస్యలు రావా..?


రోడ్డుపైన ప్రయాణికులకు ఇబ్బందిగా మారిన లగేజీలు


బస్సుకు అడ్డంగా పెట్టిన కారు


లగేజీలు ఉండడంతో ప్రయాణికులు ఇక్కట్లుపడుతున్న దృశ్యం

రైల్వేకోడూరు

అసలే బైపాస్‌రోడ్డులేదు. దీనికితోడు నిత్యం ట్రాఫిక్‌జామ్‌అవుతుంది. నడిరోడ్డుపై నిర్లక్ష్యంగా పెద్దపెద్దబస్సాలు, టైర్లు లగేజీలు ఉంచడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పోలీసులు సీసీకెమెరాలు ఏర్పాటుచేసినా ఉదయాన్నే ఎక్కడపడితే అక్కడ కార్లు, ఆటోలు, జీపులు, టెంపోలు రోడ్డుకు అడ్డంగా పెడుతున్నా వాహనదారులు భయపడకుండా రోడ్డుకు అడ్డదిడ్డంగా లగేజీలు పెడుతున్నా పోలీసులు చూసిచూడనట్లుగా వ్యవహరిస్తున్నారనే విమర్శలున్నాయి. బస్సులు, పెద్దపెద్దవాహనాలు వెళ్లేందుకు అంతరాయం ఏర్పడుతోంది. వివరాల్లోకివెళితే... రైల్వేకోడూరు పట్టణంలోని ఎన్టీఆర్‌సర్కిల్, చిట్వేలిరోడ్డు, టోల్గేట్, మార్కెట్‌సర్కిల్, మార్కెట్‌యార్డు, ఆర్టీసీఅప్రోచ్‌రోడ్డు సర్కిల్ తదితర ప్రాంతాల్లో ట్రాఫిక్ ఎక్కువగా ఉంటుంది. దీంతోపాటు ఆటోలు ఎక్కడపడితే అక్కడ నిలుస్తుండడంతో ట్రాఫిక్‌కు అంతరాయంగా మారుతోంది. పెద్దపెద్దవాహనాలు చెన్నై, హైదరాబాద్ తదితర ప్రాంతాలకు వెళ్లాలంటే రైల్వేకోడూరు మీదుగా వెళతాయి. దీని కారణంగా ట్రాఫిక్‌కు తరచూ ఆటంకాలు ఏర్పడుతున్నాయి. ట్రాఫిక్ నివారణకు పోలీసులు ఎన్టీఆర్‌సర్కిల్, రైల్వేస్టేషన్‌రూటు, టోల్గేట్ తదితర ప్రాంతాల్లో బారికెడ్లను ఏర్పాటుచేసినా అవి పెద్దగా ట్రాఫిక్‌నివారణకు ఉపయోగపడడంలేదని పలువురు పేర్కొంటున్నారు. బస్టాండులో రోడ్లు ఇరుకుగా ఉన్నాయి. అందులోను నిత్యం వాహహనాలు వెళుతుంటాయి. తద్వారా ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులుపడుతున్నారు. వృద్ధులు, మహిళలు నానాపాట్లుపడుతున్నారు. ప్రతిరోజు ప్రమాదాలు జరుగుతున్నాయని దీంతో ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుని ప్రమాదాల నివారణకు చర్యలుతీసుకుంటున్నా కోడూరులో ఫలితాలుకానరావడంలేదని పలువురు వాపోతున్నారు. ప్రతిరోజు సాయంత్రం అయితే చాలు బొప్పాయి వాహనాలపై ఎక్కువమంది ప్రయాణిస్తున్నారు. టాప్‌ప్రయాణాలు ప్రమాదాలు జరుగుతున్నాబస్సులపైన లారీల్లో లగేజీలను తీసుకునివచ్చి వాటిని నడిరోడ్డుపైనే వేస్తున్నారు. ఈ విషయాన్ని పోలీసులకు ప్రజలు సమాచారం అందించినా ఫలితంలేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ట్రాఫిక్‌సమస్యలు అధికమించడానికి పోలీసులు ఇంకా మెరుగైన చర్యలుతీసుకుంటారో వేచిచూడాల్సిందే.

ప్రమాదాలు జరగకుండా అవగాహన కల్పిస్తున్నాం

ప్రమాదాలు జరగకుండా ప్రజల్లో అవగాహనకల్పిస్తున్నాం. ట్రాఫిక్‌కు ఇబ్బందిలేకుండా చేస్తున్నామని రైల్వేకోడూరు సీఐ కె.సాయినాథ్ తెలిపారు. ట్రాఫిక్‌కు ప్రజలు సహకరించాలని, ప్రతిఒక్కరు లైసెన్సులు తీసుకోవాలని, హెల్మెట్ వినియోగించాలని, వాహనాలకు రికార్డులు తప్పనిసరిగా ఉండాలన్నారు. మద్యంతాగి వాహనాలునడిపితే మాత్రం డ్రంక్‌అండ్‌డ్రైవ్ క్రింద జైలుకుపంపుతామని తెలిపారు. ప్రతిరోజు వాహనాలను తమ సిబ్బంది తనఖీలుచేస్తున్నారని, రహదారి పెట్రోలింగ్ అధికారులు పరిశీలిస్తున్నారని, వేగంగా వెళ్లే వాహనాలకు కూడా అపరాధరుసుములు వేస్తున్నామని, రోడ్డుకు అడ్డదిడ్డంగా పెడుతున్న వాహనాలపై చర్యలుతీసుకుంటామని తెలిపారు. టాప్‌ప్రయాణం కూడా పరిశీలిస్తున్నామని తెలిపారు.



-కె.సాయినాథ్,
సీఐ, రైల్వేకోడూరు

ఎస్.కొత్తపల్లెలో వైద్యశిబిరం

రైల్వేకోడూరురూరల్ : మండలంలోని ఎస్. కొత్తపల్లె గ్రామంలో చికెన్ గున్యా, విష జ్వరాలు వ్యాపించడంతో శనివారం స్థానిక శెట్టిగుంట ప్రాథమిక ప్రభుత్వ వైద్యశాల వెద్యుడు డాక్టర్ వినీల ఆధ్వర్యంలో ఉచిత వెద్యశిబిరం నిర్వహించారు. కొత్తపల్లె, శ్రీనివాసపురం, జానకిపురం వాసులకు రక్త నమూనాలు సేకరించి జ్వరపీడితులకు వెద్య చికిత్సలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. గ్రామంలో పేడదిబ్బలు అధికంగా ఉండడంతో వైరస్ విజృంబిస్తోందని వైద్య సిబ్బంది తెలిపారు. కీళ్ళువాపులు నొప్పులు తో కూడుకున్న జ్వరాలు అధికంగా ఉన్నాయని వైద్యాధికారలుతెలిపారు.

భక్తులతో కిక్కిరిసిన ఆలయాలు




ప్రత్యేక పూల అంకరణలో దర్శనమిస్తున్న వేంకటేశ్వరస్వామి,రెడ్డివారిపల్లె శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

రైల్వేకోడూరురూరల్ : శ్రావణమాస మూడో శనివారం సందర్భంగా శనివారం రైల్వేకోడూరులో ఆలయాలు భక్తులతో కిక్కిరిశాయి. పట్టణంలోని శ్రీవేంకటేశ్వరస్వామిఆలయంలో ఉదయం నుంచే శ్రీవారిని దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. ఆలయంలో వేంకటేశ్వరస్వామి మూలవిరాట్‌కు ప్రత్యేక అభిషేకం, అర్చన, పూజలను బండాత్మకూరు సుదర్శన శర్మ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.

అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని పూజలు చేశారు అదేవిధంగా మండలంలోని రెడ్డివారి పల్లె రోడ్‌లో వెలసి యున్న శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయం ఆలప్రధాన అర్చకు లు రాంసాయి ఆధ్వర్యంలో ప్రత్యేక అభిషే కం, అర్చన, పూజలను, నిర్వహించారు. విష్ణు సహస్రనామం, కుంకుమార్చనటు నిర్వహించారు, అధిక సంఖ్యలో మహిళ భక్తులు పాల్గొన్నారు. ఆలయ నిర్వాహకులు పంద్రాన రసింహులు స్వామి భక్తులకు తీర్థ ప్రసాద వినియోగం చేశారు.

నిబంధనలు పాటించని పాఠశాలలపై చర్యతీసుకోవాలి

రాజంపేట టౌన్ : ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్న పాఠశాలలపై విద్యాశాఖాధికారులు చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం రాజంపేట ఎన్జీవో హోంలో ఎస్ ఎఫ్ఐ నాయకులతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ నాయకులు ప్రశాంత్ మాట్లాడుతూ కనీస వసతులు లేకుండా నడుపుతున్న పాఠశా లలు, బాత్రూం, తాగునీరు, అధిక ఫీజులు వసూలు చేస్తూ కొన్ని పాఠశాలలు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయ కులు మహేష్, రమణ,సాయి, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేడు రామాలయంలో ప్రత్యేక పూజలు

సిద్దవటం : ఆదివారం ఉదయం సిద్దవటం లోని ఎగువపేట ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు సమీపంలో ఉన్న రామాలయంలో ప్రత్యేక పూజలు జరుగుతాయని డాక్టర్ వై.వి.చలపతి తెలిపారు. శ్రావణ మాసాన్ని పురస్కరించుకొని మన గుడి కార్యక్రమంలో భాగంగా ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహిస్తామన్నారు. అలాగే శనివారం ఆలంకు శోభ కార్యక్రమం జరిగింది. ఆదివారం స్వామి వారికి పట్టువస్త్రాము, అష్టోత్తరం, కుడుమ పూజా కార్యక్రమంనకు అందరూపాత్రులై హాజరు కావాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మైసూరయ్య, ఎం.వి.రత్నం, బాలుగారి వెంకటసుబ్బయ్య, కౌసల్య, అమృతవల్లి పాల్గొన్నారు.

బత్యాలకు ఉన్నత పదవులు రావాలని పాదయాత్ర

రైల్వేకోడూరురూరల్ : మాజీ ఎమ్మెల్సీ బత్యాల చెంగల్రాయులుకు ఉన్నత పదవులు రావాలని ఆకాంక్షిస్తూ పట్టణంలోని వెంకటేశ్వరపురం కు చెందిన పోతురాజుభరత్‌బాబు ఆధ్వర్యంలో సుమారు 70 మంది యువకులు తిరుమలకు అన్నమయ్య కాలి బాటన శనివారం పాదయాత్రగా వెళ్ళారు. మాజీ ఎమ్మెల్సీ బత్యాల చెంగల్ రాయులు తన ఎమ్మెల్సీ పదవీకాలంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేశారని అటువంటి ఆయన మరింత ఉన్నశిఖరాలలను అధిరోహించాలని కలియుగ వైకుంఠవాసుడైన శ్రీవేంకటేశ్వర్వస్వామి ఆశీస్సులు ఆయనకు లభించాలని స్వామివారికి మొక్కుకునేందుకు ఈ పాధయాత్ర చేపట్టినట్లు భరత్‌బాబుయువకులు తెలిపారు. కార్యక్రమాన్ని సర్పంచ్ తిప్పన క్రిష్ణయ్య, ఉపసర్పంచ్ నార్జాల హేమరాజు, ఎంపీటీసీ సభ్యులు భాస్కర్‌లు జెండాఊపి ప్రారంభించారు.



తిరుమలకు పాదయాత్ర ప్రారంభించిన వెంకటేశ్వర పురం యువకులు

లారీ బోల్తా - డ్రైవరుకు తీవ్రగాయాలు

రైల్వేకోడూరురూరల్ : మండలంలోని కొత్తమంగంపేట సమీపంలో ఓలారీ అదుపుతప్పి బాల్తాపడింది. ఈ ప్రమాదంలో లారీ డ్రైవర్ శ్రీరాములుతీవ్రంగా గాయపడ్డాడు. గాయపడిన డ్రైవరును రైల్వేకోడూరు 108 వాహనంలో స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రధమచికిత్స చేసి మెరుగైన వైద్యంకోసం తిరుపతి రుయా ఆసుపత్రికి తరలించారు. గాయపడిన లారీడ్రైవరుడి తాడిపత్రి అని స్థానికులు గుర్తించారు. ఆమేరకు స్థానిక పోలీసులు విచారిస్తున్నారు.

ఏకాగ్రతతో డ్రైవింగ్ చేయాలి

-రాజంపేట ఎంవీఐ రాజాబాబు



రాజంపేట టౌన్ : డ్రైవర్లు ఏకాగ్రతతో డ్రైవింగ్ చేయాలని రాజంపేట ఎంవీఐ ఎన్.వి.రాజాబాబు సూచించారు. శనివారం ఆయన రాజంపేటలో మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమనిబంధనలు పాటించాలని, పెరుగుతున్న జనాభా, వాహనాలను దృష్టిలో ఉంచుకొని వాహనాలు నడపాలన్నారు. 18సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ లైసెన్సుపొందాలని, ప్రభుత్వం ఇప్పుడు అన్నీ ఆన్‌లైన్ సేవలను అందిస్తున్నదని, కార్డ్‌లెస్ సేవలు కూడా రాజంపేట ఎంవీఐ కార్యాలయంలో ఉన్నాయన్నారు. ప్రమాదాలు జరగ కుండా ఉండేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని, డ్రంక్అండ్ డ్రైవ్‌లో దొరికితే వాహనా లు సీజ్ చేసి లైసెన్సులు రద్దు చేస్తున్నామన్నారు. ఈ మధ్యకాలంలో ప్రమాదాలపై ప్రత్యేక దృష్టి పెట్టి పోలీసుల సహకారంతో డెమో కారిడార్ ద్వారా పలు చోట్ల జాగ్రత్తలు వాహనాదారులకు చెబుతున్నామన్నారు. ప్రమాదాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు.

అలరించిన ముందస్తు కృష్ణాష్టమి



రైల్వేకోడూరులోని సిల్వర్‌బెల్స్ హైస్కూల్‌లో కృష్ణాష్టమివేడుకల్లో చిన్నారులు

రైల్వేకోడూరు రూరల్ : ఈ నెల14న కృష్ణాష్టమి పండుగ సందర్భంగా ముందస్తుగా పట్టణంలోని పలు పాఠశాలల్లో కృష్ణాష్టమి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని సిల్వర్‌బెల్స్ స్కూల్‌లో కరస్పాండెంట్ ఎంవీకుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలు అలరించాయి. చిన్నారులు చిన్నికృష్ణుని వేషధారణలు అందరినీ ఆకట్టుకునేలచేశాయి. గోపీ,రాధావేషదారణలో చిన్న పిల్లలు పిల్లని గ్రోవిని ఊదుతూ నృత్యాలు చేశారు. అదేవిధంగా పట్టణంలోని రవీంద్రబారతి హైస్కూల్‌లో ప్రిన్సిపాల్‌గంగయ్య ఆధ్వర్యంలో కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో స్థానిక యస్సైలు భక్తవత్సలం, వెంకటేశ్వర్లు తదితరలు పాల్గొన్నారు.



కోడూరులోని రవీంద్రభారతిలో వేడుకలు



రాజంపేట రవీంద్రభారతి స్కూల్‌లో..

రాజంపేటలో..

రాజంపేట టౌన్ : రాజంపేట భువనగిరి పల్లె ఆర్చీ వద్ద శ్రీ చైతన్య స్కూల్‌లో సోమవారం కృష్ణాష్టమి సందర్భంగా శనివారం ఘనంగా ముందస్తు కృష్ణాష్టమి వేడుకలను ప్రిన్సిపాల్ కళ్యాణ్‌చక్రవర్తి ఆధ్వర్యంలో నిర్వహించారు. ముందుగా చిన్నారులకు గోపికల, శ్రీకృష్ణుడు వేషధా రణలనూ, కృష్ణుడి గీతాలా పన, నృత్యాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యా ర్థులు పాల్గొన్నారు. అలాగే పట్టణంలోని నూనెవారిపల్లెలో ఉన్న రవీంద్రభారతి పాఠశాలలో శ్రీ కృష్ణాష్టమి వేడుకలు ప్రిన్సి పాల్ స్రవంతి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విద్యార్థులు వారి తల్లిదండ్రులు హాజరై ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.



రాజంపేట శ్రీ చైతన్య స్కూల్‌లో శ్రీ కృష్ణాష్టమి వేడుకల్లో విద్యార్థులు

విద్యార్థుల సమస్యలపై ఏఐఎస్ఎఫ్ నిరంతరం పోరాటం

రైల్వేకోడూరు రూరల్ : విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం ఏఐఎస్ఎఫ్ 52సంవత్సరాలుగానిరంతరం పోరాటాలు సాగిస్తోందని జిల్లా కార్యవర్గ సభ్యుడు రాజశేఖర్ అన్నారు. శనివారం ఏఐఎస్ఎఫ్ 82వ వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకొని పట్టణంలోని షిరిడీసాయి జూనియర్ కళాశాలలో జెండా ఆవిష్కరణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విద్యార్థినీ, విద్యార్థులు, ఎస్‌టివో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వెంకటరమణ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. షిరిడీ సాయి జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రత్నం చేతుల మీదుగా ఏఐఎస్ఎఫ్ జెండా ఆవిష్కరించారు. రాజశేఖర్ మాట్లాడుతూ విద్యార్థుల సమస్యల పట్ల నిరంతరం పోరాటం చేస్తూ ఏఐఎస్ఎఫ్ ఎన్నో విజయాలను సాధించిందన్నారు.

బెల్టుషాపులపై పోలీసుల దాడులు

రైల్వేకోడూరు రూరల్ : పట్టణంలోని చిట్వేలి రోడ్డు, ఆర్.ఎస్.రోడ్డు ప్రధాన రహదారుల్లో బెల్టుషాపులపై శనివారం ఎస్ఐ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో పోలీసులు దాడులు నిర్వహించారు. చిట్వేలి రోడ్డులోని నాగభూషణం అనే వ్యక్తి బెల్టుషాపు నిర్వహిస్తుండగా 30మద్యం బాటిళ్ళను స్వాధీనం చేసుకొని నిందితుడిని అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ తెలిపారు. ఎవరైనా బెల్టుషాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

దినఫలాలు


అదృష్టసంఖ్యలు: 3, 4



మేషరాశి: (మార్చి21-ఏప్రిల్20): సంతానం విషయంలో శుభపరిణామాలు సంభవం. ప్రేమాను బంధాలు బలపడతాయి. విద్యార్థులు లక్ష్యాలు సాధిస్తారు. ఖర్చులు అంచనాలు మించుతాయి. పెట్టుబడుల్లో నిదానం అవసరం.



వృషభరాశి: (ఏప్రిల్21-మే20): సినీరాజకీయ రంగాల వారు పట్టుదలతో పనులు పూర్తి చేస్తారు. కుటుంబ వ్యవహారాలపై దృష్టి పెడతారు. దూరంలో ఉన్న కుటుంబ సభ్యులు ఇల్లు చేరతారు. మనను ఏదో వెలితి బాధిస్తుంది.



మిథునరాశి: (మే21-జూన్21): బంధుమిత్రులతో ఉల్లాసంగా గడుపుతారు. సమావేశాలు ఫలిస్తాయి. ఆర్థిక విషయాల్లో సన్నిహితుల సహకారం అందుకుంటారు. పెట్టుబడులకు సంబంధించిన సమాచారం కలవరం కలిగిస్తుంది.



కర్కాటకరాశి: (జూన్22-జులై23): వృత్తి, వ్యాపారాల్లో ఆర్థికంగా ప్రోత్సాహకరంగా ఉంటుంది. పెద్దలు, పైఅధికారుల సహకారంతో లక్ష్యాలు సాధిస్తారు. అదనపు ఆదాయం కోసం చేసే ప్రయత్నాలకు ఆటంకాలు ఎదురవుతాయి.



సింహరాశి:(జులై24-ఆగస్ట్23): సమావేశాలు, ప్రయాణాలకు అనుకూలం. బంధు మిత్రులతో వేడుకల్లో పాల్గొంటారు. ప్రణాళికాబద్ధంగా వ్యవహరించి లక్ష్యాలు సాధిస్తారు. కొత్త పనుల ప్రారంభం విషయంలో ఆచితూచి ముందడుగు వేయాలి.



కన్యారాశి: (ఆగస్ట్24-సెప్టెంబర్23): సమావేశాలు, ప్రయాణాలకు అనుకూలం. బంధు మిత్రులతో వేడుకల్లో పాల్గొంటారు. ప్రణాళికాబద్ధంగా వ్యవహరించి లక్ష్యాలు సాధిస్తారు. విందు వినోదాల కోసం ఖర్చులు అధికం.




తులారాశి: (సెప్టెంబర్24-అక్టోబర్23): బ్యాంకులు, ఆర్థిక సంస్థలతో పనులు పూర్తవుతాయి. స్పెక్యులేషన్లు, పందాలు పోటీల్లో నిదానం అవసరం. బంధుమిత్రులతో ఉల్లాసంగా గడుపుతారు. ఖర్చులు అంచనాలు మించుతాయి.



వృశ్చికరాశి: (అక్టోబర్24-నవంబర్22): విందు వినోదాల్లో పాల్గొంటారు. పెద్దల ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపిస్తారు. వ్యవసాయం, పరిశ్రమల రంగాల వారికి అనుకూలం. వృత్తి, వ్యాపారాల్లో ప్రోత్సాహకరంగా ఉంటుంది.



ధనూరాశి: (నవంబర్23-డిసెంబర్21): చిన్నారులు, ప్రియతముల అంశాలపై దృష్టి పెడతారు. బంధుమిత్రులతో వేడుకల్లో పాల్గొంటారు. పొదుపు పథకాలకు సంబంధించిన సమాచారం అందుకుంటారు. పెట్టుబడుల్లో అంచనాలు తప్పే అవకాశం ఉంది.



మకరరాశి(డిసెంబర్22-జనవరి21): రియల్ ఎస్టేట్, గృహనిర్మాణ రంగాల వారికి ఆర్థికంగా లాభిస్తుంది. ఆర్థిక లావాదేవీలు కొలిక్కి వస్తాయి. ఇంటికి సంబంధించి విలువైన వస్తువులు సమకూర్చుకుంటారు. మనశ్శాంతి లోపిస్తుంది.



కుంభరాశి: (జనవరి22-ఫిబ్రవరి18): సోదరీసోదరుల విషయాల్లో శుభపరిణామాలు సంభవం. ప్రయాణాలు, సమావేశాల్లో కొత్త పరిచయాలు ఏర్పడతాయి. ప్రియతములకు సంబంధించి ముఖ్య సమాచారం అందుకుంటారు. చర్చల్లో తొందరపాటు తగదు.



మీనరాశి:(ఫిబ్రవరి19మార్చి20): ఆర్థిక అంశాల్లో ప్రోత్సాహకరంగా ఉంటుంది. అదనపు ఆదాయం కోసం చేసే ప్రయత్నాలు ఫలిస్తాయి. విలువైన వస్తువులు సమకూర్చుకుంటారు. విందు వినోదాల కోసం ఖర్చులు అధికం.

-బిజుమళ్ళ బిందుమాధవ శర్మ

పౌష్టికాహారం పంపిణీలో తేడాలు వస్తే చర్యలు

బాధ్యులను విధుల నుంచి తొలగిస్తాం ● గుడ్లు, పాలు పంపిణీ సక్రమంగా పంపిణీ జరగాలి : కలెక్టర్

కడప, కోటిరెడ్డిసర్కిల్ : జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పంపిణీ చేస్తున్న పౌష్టికాహారంలో తేడా వస్తే కఠిన చర్యలు తప్పవని సంబంధిత బాధ్యులను విధుల నుంచి తొలగిస్తామని కలెక్టర్ బాబూరావునాయుడు హెచ్చరించారు. శనివారం కలెక్టరేట్‌లోని మీకోసం సమావేశం భవనంలో సీడీపీవోలు, సూపర్‌వైజర్లతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా అవుతున్న గుడ్లు, పాలు, కూరగాయలు, సరుకులు అంశంపై ప్రాజెక్టుల వారీగా తెలుసుకున్నారు. ఏరోజుకారోజు ఎంతమంది పిల్లలకు పౌష్టికాహారం అందిస్తున్నారనే వివరాలను సీడీపీవోలు సేకరించాలని ఆయన సూచించారు. క్షేత్రస్థాయిలో ఎవరెవరు ఎలా పనిచేస్తున్నారనే పనితీరుపై తనవద్ద సమాచారం వుందని ఈ నెల 10న రాజంపేటమండలం ఏకిరపల్లె పర్యటన సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రానికి మూడు నెలలుగా కోడిగుడ్లు, పాలు అందడం లేదని తమ దృష్టికి వచ్చిందని, ఈ విషయంపై రాజంపేట ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీవో నిర్మలను ప్రశ్నించారు. ఆమె సరైన సమాచారం ఇవ్వకపోవడంతో మెమె జారీ చేసి వివరణ ఇవ్వాల్సిందిగా పీడీ మమతకు సూచించారు. మూడు నెలలకు సంబంధించి గుడ్లు, పాలు బిల్లులు నిలుపుదల చేసేందుకు డీవో లేఖను ఉన్నతాధికారులకు రాయాలన్నారు. ఆయా అంగన్‌వాడీ పరిధిలో ఎవరైనా ఉపాధికి గల్ఫ్‌కు వెళ్లి వుంటే వారి వివరాలు అధికారులకు అందించాలన్నారు. ఐసీడీఎస్ పీడీ మమత, ఏపీడీ శ్రీదేవి, డీసీపీవో శివప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ బాబూరావునాయుడు

యువత శాంతి, సహనంతో లక్ష్యాలు చేరుకోవాలి





ర్యాలీలోపాల్గొన్న యువత, బహుమతి ప్రదానం చేస్తున్న ప్రముఖులు

కడప, స్పోర్ట్స్ : యువత శాంతి, సహనాలతో తమ లక్ష్యాలను సాధించుకోవాలని స్టెప్ సీఈవో మమత విద్యార్థులకు సూచించారు. శనివారం కడప సమీపంలోని సీకేదిన్నె మండలంలోని భారత్ ఇంజనీరింగ్ కళాశాలలో అంతర్జాతీయ యువజన దినోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసి ర్యాలీ నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ యువత సమాజ వ్యతిరేక కార్యక్రమాలకు దూరంగా ఉండాలని సూచించారు. భారత్ ఇంజనీరింగ్ కళాశాల కరస్పాండెంట్ బషీర్‌అహ్మద్ మాట్లాడుతూ యువత దుర్వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. కళాశాల డైరెక్టర్ ఫరూక్ అహ్మద్ మాట్లాడుతూ యువత విద్యే కాకుండా, సాంస్కృతిక, సాంఘీక కార్యక్రమాలలో పాలు పంచుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులకు వక్తృత్వ, సాంస్కృతిక పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల సిబ్బంది, స్టెప్ సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఉక్కుపరిశ్రమతోనే జిల్లా అభివృద్ధి: మైసూరా

కడప, రవీంద్రనగర్ : ఉక్కు పరిశ్రమ వస్తేనే జిల్లా ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి చెందుతుందని మాజీ మంత్రి ఎం.వి.మైసూరారెడ్డి అభిప్రాయపడ్డారు. రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ (ఆర్‌సీపీ) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉక్కు పోరాట దీక్షలకు శనివారం మద్దతు తెలిపి 37వ రోజు దీక్షలో పాల్గొన్న వారికి పూలమాలలు వేసి మాట్లాడారు. కడపలో ఉక్కు ఫ్యాక్టరీని నిర్మించాలని విభజన చట్టంలో రాసుకున్నారన్నారు. అప్పుడు ప్రతిపక్షంలో భారతీయ జనతా పార్టీ ఉండేదని ఇప్పుడు ప్రభుత్వం ఆ పార్టీ దే కాబట్టి ఇచ్చిన హామీన నిలబెట్టుకోవాలని ఆయన అన్నారు. ఉక్కు ఫ్యాక్టరీ నిర్మాణం చేస్తే యువతకు ఉద్యోగ అవకాశాలు మెండుగా వస్తాయని తెలిపారు. రాష్ట్రాన్ని విభజించే సందర్భంలో కాంగ్రెస్ పార్టీ వ్యతిరేకిస్తే బీజేపీ మాత్రం మద్దతు ఇచ్చింది. ఇప్పుడు ఉక్కు ఫ్యాక్టరీ నిర్మాణం కూడా బీజేపీ ఏర్పాటు చేసి తీరాలన్నారు. రెండు రాష్ట్రాల పాలన, కేంద్ర ప్రభుత్వం దయాదాక్షిణ్యం పైన జరుగుతోందన్నారు. రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రులు విభజనచట్టంలోని హామీలను అమలు చేయాలని చెప్పారు. ఒక వేళ స్పెషల్ కేటగిరీ వుంటే ఉక్కు ఫ్యాక్టరీ నిర్మించాలన్నా ప్రధాన మంత్రి దయాదాక్షిణ్యాలపై ఆధారపడి ఉందన్నారు. కానీ హామీలను మరచి విదేశీ పర్యటనలను, నోట్ల రద్దులు అన్ని చేస్తూ కొండనుతవ్వి ఎలుకలను పడుతున్నారని అన్నారు. ఈ దీక్షలు వంద రోజులు చేయడం హర్షించదగ్గ విషయం అన్నారు. ఈ దీక్షలలో స్వాతి,సుప్రియా,సుబ్బమ్మ, జ్యోతి, మేరి, వెంకటమ్మ, సిమ్రాన్, హసీనా, రిహానా శామ్యూల్, శివశంకర్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.



దీక్షలో కూర్చున్న మైసూరారెడ్డి

ఆత్మహత్యలను మానాలి

పోస్టర్ల ఆవిష్కరణలో జిల్లా ప్రధాన జడ్జి శ్రీనివాస్

కడప లీగల్ : మానవ జీవితంలో సమస్యలు అనేవి సహజమని వాటిని సమర్థవంతంగా ఎదుర్కొని ఆత్మహత్యలు చేసుకోవడం మానాలని జిల్లా ప్రధాన జడ్జి జి. శ్రీనివాస్ పేర్కొన్నారు. శనివారం జడ్జి బంగ్లాలో అమృతహస్తం సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆత్మహత్యల నివారణ పోస్టర్లను జడ్జి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జూనియర్ సివిల్ జడ్జి కె. గురు అరవింద్‌బాబు, అమృతహస్తం సేవా సంస్థ వ్యవస్థాపకుడు పట్టెం కిరణ్ గంగిరెడ్డి, ఆర్ట్స్ కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్, అమృత హస్తం సేవాసంస్థ సలహాదారుడు హరేరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



ఆత్మహత్య నివారణా పోస్టర్లను ఆవిష్కరిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీనివాస్

ఉచిత శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానం

కడప, ఐటీఐసర్కిల్ : జిల్లాలోని నిరుద్యోగ యువతీ యువకులకు ఉచిత శిక్షణ ఇచ్చే స్వయం ఉపాధి దిశగా ప్రోత్సహించేందుకు అర్హత ఉన్న అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సిండ్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థ డైరెక్టర్ లీలా ప్రకాష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్టీసీ వర్క్‌షాపు వద్ద ఉన్న శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో ఫొటోగ్రఫీ, వీడియోగ్రఫీ, టూవీలర్ మెకానిక్ 30రోజులు సీసీ టీవీ, కెమెరా, ఇన్సులేషన్ సర్వీసింగ్‌లో 13 రోజుల పాటు ఉచిత శిక్షణ ఇస్తామన్నారు. 18 నుంచి 45 సంవత్సరాలలోపు వయసు వారు అర్హులన్నారు. వారికి ఉచిత భోజనం, సౌకర్యాలు కల్పిస్తామన్నారు. ఆసక్తి గల వారు 9440905476ను సంప్రదించాలన్నారు.

17న జాబ్‌మేళా

కడప, ఐటీఐసర్కిల్ : జిల్లాలోని నిరుద్యోగ అభ్యర్థులకు ఉపాధి అవకాశాలు కల్పించి ఆర్థికంగా చేయూతనివ్వాలనే లక్ష్యంతో 17న కలెక్టరేట్‌లో ఉన్న ఎంప్లాయిమెంట్ కార్యాలయంలో ప్రముఖ ప్రైవేటు కంపెనీ కోర్‌కార్బన్ ఎక్స్ సొల్యుషన్ కంపెనీ తరపున కో-ఆర్డినేటర్స్ ఉద్యోగాలకు ఉదయం 10 గంటల నుంచి జాబ్ మేళాను నిర్వహిస్తున్న జిల్లా ఎంప్లాయ్‌మెంట్ అధికారి వెంకటరమణ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మొత్తం 25 పోస్టులు ఖాళీ వున్నాయన్నారు. విద్యార్హతతో పాటు 3 నుంచి 5 ఏళ్లఅనుభవం వుండాలన్నారు.

సీమ పొలికేక మహాధర్నాకు తరలిరండి

ఆర్‌ఆర్‌ఎస్ అధ్యక్షుడు కుంచం



కడప, మారుతీనగర్ : ప్రత్యేక రాయలసీమ రాష్ట్ర సాధనే లక్ష్యంగా అక్టోబర్ 28న అనంతపురం జిల్లా కేంద్రంలో తలపెట్టిన రాయలసీమ పొలికేక మహాధర్నా కార్యక్రమానికి సీమ నలుమూలల నుంచి ప్రజలు తరలిరావాలని రాయలసీమ రాష్ట్ర సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు కుంచం వెంకటసుబ్బారెడ్డి పిలుపునిచ్చారు. శనివారం స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.సీమను ప్రత్యేక రాష్ట్రంగా ప్రకటించే వరకు ఉద్యమాన్ని ఆపే ప్రసక్తే లేదన్నారు.

నంద్యాలపై అతిశ్రద్ధ వద్దు

నంద్యాల ఉప ఎన్నిక దృష్ట్యా పాలక, ప్రతిపక్షపార్టీల నాయకులు ఆ నియోజకవర్గంపై అతిశ్రద్ధ చూపడం సరైందికాదన్నారు. ఇప్పటికే ప్రజలు టీడీపీ, వైసీపీలు దొందూ..దొందే అనే విధంగా వున్నారని ఆ పార్టీలకు త్వరలో కాంగ్రెస్‌పార్టీకి పట్టిన గతి పట్టడం ఖాయమన్నారు. ముఖ్యమంత్రి కుర్చీ కోసం చంద్రబాబు, అటు జగన్ పాకులాడుతున్న తీరు పట్ల ప్రజలు ఆరా తీస్తున్నారన్నారు. ప్రజా సంక్షేమం కంటే కూడా వీరికి పదవులే ముఖ్యమనే విధంగా ఉన్నారన్నారు.

టంగ్ ట్విస్టర్స్

1. It's not the cough that carries you off,it's the coffin they carry you off in!
2. I wish you were a fish in my dish
3. Dust is a disk's worst enemy.

ఔనా!

హమ్మింగ్ బర్డ్ గుండె నిమిషానికి 1260 సార్లు కొట్టుకుంటుంది!



సూక్తి

శత్రువులు ద్రోహ ం చేసినా.. ఆశలు ఆవిరైనా.. గూడు చెదిరినా.. సంకల్పం వీడరాదు. ఆత్మవిశ్వాసంతో ముందుకు వెళ్లాలి.. అప్పుడే విజయం సాధిస్తారు.

రంగులు వేయండి



కాంక్రీట్ నగరాల్లో పిల్లలు ఆడుకోవడానికి స్థలమే దొరకడం లేదు. అక్కడక్కడా ఉన్న పార్కులే వారికి ఆట స్థలాలవుతున్నాయి. సెలవులొస్తే చాలు పార్కులన్నీ పిల్లల ఆటలతో సందడిగా ఉంటాయి. అలాంటి పార్కులను కూడా ప్రభుత్వం కనుమరుగు చేయాలని ప్రయత్నిస్తే..! పిల్లలు సైతం ఆ నిర్ణయాన్ని అడ్డుకుంటారు. ఇందుకు మంచి ఉదాహరణ ఢిల్లీకి చెందిన ఏడేళ్ల పాప నవ్యాసింగ్. తన ఇంటి దగ్గరున్న పార్క్‌ను అధికారులు తొలగించాలని చూస్తే 'మా సంతోషాన్ని దూరం చేస్తారా?' అంటూ కోర్టుకెళ్లి మరీ ప్రభుత్వ ప్రయత్నాన్ని అడ్డుకుంది.

పార్క్ కోసం పాప పోరాటం





పార్కులు పిల్లలు ఆడుకోవడానికి, పెద్దలు కాసేపు సేదతీరడానికి ఏర్పాటు చేసినవి. పార్కులో ఆడుకునే ఆ గంటసేపే పిల్లలకు ఎంతో సంతోషాన్నిస్తుంది. ఆ సంతోషాన్ని దూరం చేయాలని ప్రయత్నిస్తే పిల్లలు పులిలా మారి తిరగబడతారు. అలా తిరగబడి పార్కును తొలగించే ప్రయత్నాలు అడ్డుకుంది. ఢిల్లీకి చెందిన ఏడేళ్ల బాలిక నవ్యాసింగ్. తను రోజూ సాయంత్రం ఇంటి సమీపంలో ఉన్న పార్కులో తోటి పిల్లలతో కలిసి ఆడుకుంటుంది. రోహిణి సెక్టార్ 8లో ఉన్న ఆ 'హనుమాన్ మందిర్' పార్క్ 30 ఏళ్లుగా కాలనీవాసులకు ఆహ్లాదాన్ని పంచుతోంది. ఉన్నట్టుండి ఒకరోజు ఢిల్లీ డెవలప్‌మెంట్ అథారిటీ అధికారులు పార్కును తొలగిస్తున్నట్లు కాలనీవాసులకు చెప్పారు. కారణమేంటని అడిగితే పార్కును తొలగించి కమ్యూనిటీ హాల్ కడతామని సమాధానమిచ్చారు. ఎంతోమందికి ఆహ్లాదాన్ని పంచుతోన్న పార్కును తొలగించడమేంటని అడిగితే అధికారులు నిర్లక్ష్యంగా సమాధానమిచ్చారు. పార్కును తొలగిస్తున్న విషయం పిల్లల చెవిన పడింది. దాంతో నవ్యాసింగ్ 'ప్రభుత్వ నిర్ణయాన్ని ఆపడానికి ఏమీ చేయలేమా?' అని తండ్రిని ప్రశ్నించింది. నవ్యాసింగ్ తండ్రి ధీరజ్‌కుమార్ న్యాయవాది. కూతురు వేసిన ప్రశ్నతో ఆ తండ్రి ఆలోచనలో పడ్డాడు. తన కూతురు పార్కును కాపాడాలని ప్రయత్నిస్తున్న విషయం అర్థమయింది. 'కోర్టులో కేసు వేయడం ద్వారా అడ్డుకోవచ్చ'ని చెప్పాడు. అయితే 'నేను కేసు వేస్తాను' అని తండ్రి సహాయంతో కోర్టులో కేసు వేసింది. 'ఇప్పటికే కొంత పార్కు స్థలం ఆక్రమణకు గురయింది. పిల్లలు ఆడుకునే వస్తువులను తొలగించి మొబైల్ టవర్‌ను ఏర్పాటు చేయడానికి అధికారులు అనుమతినిచ్చారు. పార్కులు లేకుండా పోతే కాలనీవాసులపై, ముఖ్యంగా పిల్లలపై ఎక్కువ ప్రభావం పడుతుంది' అని పిటిషన్‌లో పేర్కొంది.

ప్రజల డబ్బు దుర్వినియోగం

నవ్యాసింగ్ వేసిన కేసుపై చీఫ్ జస్టిస్ గీతా మిట్టల్, జస్టిస్ సి.హరిశంకర్‌లతో కూడిన ఢిల్లీ హైకోర్టు బెంచ్ విచారణ చేపట్టింది. ఇరుపక్షాల వాదనలు విన్న తరువాత ప్రజలు చెల్లిస్తున్న ట్యాక్స్‌తో ఆటలు ఆడుకోవడం సరికాదని అభిప్రాయపడింది. ప్రజలు డబ్బును వృథా చేయడం సరికాదని చెబుతూ, పార్కును కమ్యునిటీహాల్‌గా మార్చడంపై స్టే విధించింది. పార్కులను పార్కులుగానే ఉంచాలని, కమ్యూనిటీ సెంటర్లుగా మార్చకూడదని న్యాయమూర్తులు వ్యాఖ్యానించారు. 'కమ్యూనిటీ సెంటర్ నిర్మాణానికి పార్కు స్థలం తప్ప మరో స్థలం లేదా అని ఢిల్లీ డెవలప్‌మెంట్ అథారిటీ అధికారులను బెంచ్ ప్రశ్నించింది. పూర్తి వివరాలతో అఫిడవిట్ దాఖలు చేయాలని అదేశిస్తూ కేసును సెప్టెంబర్ 18కి వాయిదా వేసింది. పార్కు తొలగించడాన్ని కోర్టు నిలువరించడంతో కాలనీవాసుల ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. కేసు వేసి పార్కును కాపాడిన నవ్యాసింగ్‌ను కాలనీవాసులతో పాటు, టీచర్లు, తోటివిద్యార్థులు శభాష్ అంటూ అభినందించారు.

జంతర్‌మంతర్

1. కాప్రారం ▸..............................
2. ఆయంల ▸..............................
3. కరరంర్వా ▸..............................


జంబ్లింగ్ వర్డ్స్

1. OWOL ▸.....................
2. YRAE ▸.....................
3. TECU ▸.....................

పదాలు కనుక్కోండి



బొమ్మ గీయండి



దారి కనుక్కోండి




నవ్వుల్ నవ్వుల్

టీచర్ : మనకు స్వాతంత్ర్యం ఎప్పుడు వచ్చిందో చెప్పమంటే అలా ఆలోచిస్తున్నావేమిటి?

బంటి : తెలివైన వాడు ఆలోచించి మాట్లాడతారని చెప్పారు కదా టీచర్. అందుకే ఆలోచిస్తున్నాను.

టీచర్ : !!!!!!!!

చుక్కలు కలపండి



చెప్పగలరా?

విసుగులో ఉన్నా కానీ ముసుగులో లేను
లోతులో ఉన్నా కానీ బాతులో లేను
మందులో ఉన్నా కానీ విందులో లేను
అయితే ఇంతకీ నేనెవర్నో చెప్పగలరా?

జవాబులు

చెప్పగలరా? : విలోమం **జంతర్‌మంతర్ :** 1. ప్రాకారం 2. ఆలయం 3. కర్పూరం **జంబ్లింగ్ వర్డ్స్ :** 1. WOOL 2. YAER 3. CUTE

పొన్నోలు వారి వివాహ రిసెప్షన్ ఆహ్వానము



కీ॥శే॥ శ్రీమతి
పొన్నోలు సుబ్బమ్మ
గారి ఆశీస్సులతో...



శ్రీ పొన్నోలు ప్రియతమ్‌కుమార్‌రెడ్డి
B.E., M.B.A.
Technical Lead, Cognizant US Corporation, New York

శ్రీమతి మెహరి ప్రియాంక
M.A. (Psychology)

ముత్యాల పెళ్ళిపందిరిలో, మామిడి తోరణాలతో, వేదమంత్రోచ్చారణల మధ్య, మూడుముళ్ళబంధంతో, ఏడడుగులు నడిచి ఒక్కటైన **శ్రీ ప్రియతమ్‌కుమార్‌రెడ్డి - శ్రీమతి మెహరి ప్రియాంక** ల వివాహ రిసెప్షన్‌కు మా ఆత్మీయులందరు సకుటుంబ సమేతంగా విచ్చేసి నవదంపతులకు మీ చల్లని దీవెనలందజేసి మా ఆతిథ్యం స్వీకరించ మనవి.

వేదిక : సాయి శ్రీనివాస గార్డెన్,
రామాంజనేయపురం, మద్రాస్ రోడ్, కడప.

సమయం : 13-08-2017వ తేది
ఆదివారం రాత్రి 7 గంటల నుండి

మనసారా ఆహ్వానిస్తూ... మీ రాకకు అభిలషిస్తూ...

PRINCIPALS, STAFF & STUDENTS

P.R.R.M. COLLEGE OF PHARMACY

P.R.R.M. COLLEGE OF PHYSIOTHERAPY

INDIRA PRIYADARSHINI COLLEGE OF NURSING

Prakruthi Nagar, Rayachoty Road, Kadapa.

ఘనంగా 82వ ఏఐఎస్‌ఎఫ్ జెండా ఆవిష్కరణ

బ్రహ్మంగారిమఠం : మండల కేంద్రంలోని స్థానిక జిల్లాపరిషత్తు పాఠశాల నందు ఏఐఎస్ఎఫ్ 82వ వార్షికోత్సవ జెండా ఆవిష్కరణను ఘనంగా చేపట్టారు. ఈ జెండా ఆవిష్కరణకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన బయన్న మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యను ప్రభుత్వం కార్పొరేట్, ప్రైవేట్‌లకు అమ్ముకుంటూ సామాన్యులకు విద్యను అందించడంలేదని, అధిక ఫీజులను వసూలు చేస్తున్న ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థలపై ఎటువంటి చర్యలు చేపట్టడంలేదన్నారు. ఇటువంటి సమయంలో విద్యార్థులు ఉద్యమాలకు సిద్ధంకావాలని వారు పిలుపునిచ్చారు. అనంతరం సీపీఐ మండల కార్యదర్శి హృదయనాథ్ మాట్లాడుతూ ప్రైవేటు విద్యాసంస్థలు స్వేచ్ఛగా అధికఫీజులను వసూలు చేస్తూ ఉంటే, వారిపై చర్యలు చేపట్టకపోవడం దారుణమన్నారు. పాఠశాలల్లో ఇప్పటి వరకు పుస్తకాలు సకాలంలో అందలేదన్నారు. పుస్తకాల కొరతను తీర్చాలని హృదయనాథ్ పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ మండల నాయకులు ఎస్. చందు, కత్తినాగేంద్ర, యువరాజ్, తదితరులు పాల్గొన్నారు.


జెండాను ఆవిష్కరిస్తున్న ఏఐఎస్ఎఫ్ జిల్లా నాయకుడు బయన్న

ఘనంగా సంతాన నాగుల ప్రతిష్ఠ



కలశ పూజ నిర్వహిస్తున్న అర్చకులు, పాల్గొన్న పుట్టా సుధాకర్‌యాదవ్, నాగుల ప్రతిమలను ఊరేగిస్తున్న దృశ్యం

దువ్వూరు : పాత దువ్వూరులోని శ్రీ కోదండరామస్వామి దేవాలయంలో శనివారం సంతాన నాగుల ప్రతిష్ఠ మహోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ తోట గురప్ప, కమిటీ సభ్యులు ప్రతిష్ఠ మహోత్సవాల్లో పాల్గొని పూజలు నిర్వహించారు. ఆవాహిత పూజ, సర్ప జపం, రుద్రహోమం నిర్వహించారు. కలశాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మైదుకూరు నియోజకవర్గ తెదేపా ఇన్‌చార్జి పుట్టా సుధాకర్‌యాదవ్ పాల్గొని పూజలు నిర్వహించారు. అనంతరం నూతనంగా ప్రతిష్ఠించే నాగుల ప్రతిమలను దువ్వూరులో గ్రామోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెదేపా మండల కన్వీనర్ గోపిరెడ్డి బాబు, గోపిరెడ్డి శ్రీనివాసులరెడ్డి, కేసీ కెనాల్ డిస్ట్రిబ్యూటరీ చైర్మన్ పి.వి.రమణయ్య నాయుడు, కొర్రపాటి పెద్ద వెంకటసుబ్బయ్య, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రమాదాలకు నిలయం

వినాయక నగర్


వినాయకనగర్ వద్ద స్కూటరిస్టును ఢీకొన్న లారీ (ఫైల్ ఫొటో)

మైదుకూరు : పట్టణంలోని ప్రొద్దుటూరు రోడ్డులోని వినాయకనగర్ వెళ్లే రహదారి వద్ద ప్రమాదాలు జరుగుతూ స్వల్ప గాయాలతో బయట పడుతున్నారు. ప్రొద్దుటూరు రోడ్డు నుంచి వినాయకనగర్, సంత రోడ్డు, నంద్యాలరోడ్డులోకి ప్రధాన రహదారి ఉంది. దీంతో రోజు వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. అయితే ప్రధాన రహదారి కావడంతో వీధి వద్ద అక్కడ ఎలాంటి హెచ్చరికలు లేవు. దీంతో ద్విచక్ర వాహన దారులు ఎక్కువగా ప్రమాదాలకు గురి అవుతున్నారు. పెద్ద వాహనాలు అధిక స్పీడుతో వస్తుండటంతో వీధి నుంచి వచ్చే వాహనాలు కనపడవు. దీంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. అక్కడ హెచ్చరిక బోర్డులు వేయాలని స్థానికులు కోరుతున్నారు. వారానికి కనీసం నాలుగైదు ప్రమాదాలు జరుగుతూ గాయాలపాలవుతున్నారు.

ప్రజా సమస్యలపై పోరాడేది ఎర్రజెండా

మైదుకూరు : ఆనాటి నుంచి ఈ నాటి వరకు ప్రజా సమస్యలపై పోరాటం చేసేదీ ఒక్క ఎర్రజెండా కల్గిన సీపీఎం పార్టీనేనని ఆ సంఘం జిల్లా నాయకులు బి.మనోహర్ పేర్కొన్నారు. పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో పలు పార్టీలకు చెందిన దళితులు, ముస్లీంలు, రజకులు దాదాపు 100 కుటుంబాల వారు సీపీఎం పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత పార్టీలు ప్రజలకు సంక్షేమ పథకాలను దూరం చేస్తున్నాయని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా మతం, కుల తత్వాలను పెంచి పోషిస్తున్నాయని తెలిపారు.

ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆర్థిక పరిస్థితి బాగులేదంటూనే ఎన్నికల్లో గెలవడం కోసం వందల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో ఎక్కడ ఏ సమస్య వచ్చినా కమ్యూనిస్టు పార్టీనే మద్దతుగా నిలిచి పోరాడుతూ సమస్యలు పరిష్కరిస్తున్నాయని తెలిపారు. సమావేశం అనంతరం నాయకులు సుబ్బరాయుడు, షరీఫ్, లక్షుమయ్య, జహంగీర్ బాష, రామయ్య గౌస్ తదితరుల ఆధ్వర్యంలో దాదాపు 100 కుటుంబాల వారిని ఎర్ర కండువాను కప్పి ఆయన పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు వి అన్వేష్, పి శివకుమార్, థామస్, గురివిరెడ్డి,సునీల్,నరసింహా శంకర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీఎం నాయకులు మనోహర్, పార్టీలో చేరిన వారు

సంజీవరాయస్వామికి ప్రత్యేక పూజలు

రాజుపాళెం: ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ చెన్నకేశవ సంజీవరాయస్వామి దేవస్థానంలో శ్రావణమాసం రెండో శనివారం కావడంతో స్వామిని ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు కూడా రద్దీగా ఉండడంతో వారిని స్వామి వారికి దర్శనార్థం అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఈవో మద్దిలేటి, చైర్మన్ దుద్యాల చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు.

తెలుగు మీడియం కొనసాగించాలి

● 16న మున్సిపల్ చైర్మన్ చాంబర్ ముట్టడి-జయశ్రీ

ప్రొద్దుటూరు అర్బన్: మున్సిపల్ స్కూళ్లలో తెలుగుమీడియంను కొనసాగించాలని పేదలకు ప్రభుత్వ విద్యను దూరం చేయవద్దని మానవ హక్కుల వేదిక కన్వీనర్ జయశ్రీ పేర్కొన్నారు. శనివారం విలేకరులతో జయశ్రీ మాట్లాడుతూ మున్సిపల్ స్కూళ్లకు తెలుగుమీడియం పుస్తకాలు సరఫరా చేయకుండా మూడు నెలలు నిలబెట్టిందన్నారు. అందరూ ఇంగ్లీషుమీడియం చదవాలని ఒత్తిడి పెంచిందన్నారు. దీంతో విద్యార్థులు బడి మానేస్తామని ఆందోళన చేయడం, విద్యార్థి సంఘాలు ప్రభుత్వం దృష్టికి తేవడంతో ప్రస్తుతానికి తెలుగుమీడియం పుస్తకాలు పంపిందన్నారు. కానీ మళ్లీ పరీక్షలు ఏ మీడియంలో రాస్తారని ప్రశ్నాపత్రాలు ఇంగ్లీషుమీడియం మాత్రమే పంపడం వలన ఇంగ్లీషు మీడియంనే కొనసాగించాలనే తెలుగుమీడియంకు స్వస్తి చెప్పాలని చూస్తున్నారన్నారు. ప్రభుత్వం మున్సిపల్ స్కూళ్లలో తెలుగుమీడియం కొనసాగిస్తున్నట్లు స్పష్టమైన ఉత్తర్వులు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఆగస్టు 16న మున్సిపల్ చైర్మన్ చాంబర్ ముట్టడి కార్యక్రమం చేపట్టనున్నట్లు తెలిపారు. మున్సిపల్ స్కూలు విద్యార్థులు, విద్యార్థి సంఘాలు పాల్గొంటారన్నారు. సమావేశంలో విరసం రాష్ట్ర కార్యదర్శి వరలక్ష్మి, రచయిత జింకా సుబ్రమణ్యం, జేవీవీ అధ్యక్షులు రాంగోపాల్, ఆర్ఎస్ఎఫ్ కన్వీనర్ భాస్కర్, ఓబులేసు పాల్గొన్నారు.

టీడీపీ హయాంలోనే లింక్‌రోడ్లు

ప్రొద్దుటూరు పుట్టపర్తి సర్కిల్: టీడీపీ పాలనలోనే గ్రామీణ లింక్ రోడ్ల నిర్మాణాలు జరిగాయని ప్రొద్దుటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసీ) చైర్మన్ బండి విజయభాస్కర్‌రెడ్డి అన్నారు. శనివారం ఆయన తన కార్యాలయంలో మాట్లాడుతూ గ్రామీణ లింక్ రోడ్ల నిర్మాణాల వల్ల రైతులు తమ వ్యవసాయ ఉత్పత్తులను మార్కెట్లకు తరలించుకోవచ్చునన్నారు. ఎఎంసీల వార్షికాదాయంలో 20 శాతం నిధులకు ఈ మొత్తంలో జాతీయ ఉపాధి హామీ పథకం నిధులను కలిపి మ్యాచింగ్ గ్రాంట్స్‌తో లింక్ రోడ్ల నిర్మాణాలకు ప్రభుత్వం ఉత్తర్వులిచ్చిందన్నారు. ప్రొద్దుటూరు ఏఎంసీ పరిధిలో రూ.48 లక్షల అంచనాలతో లింక్ రోడ్ల నిర్మాణాలకు ప్రతిపాదనలు తయారు చేశామన్నారు.

మద్యం షాపులను తొలగించాలి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న రామాంజి ఇమ్మానుయేల్

ప్రొద్దుటూరు టౌన్: కొర్రపాడు రోడ్డులోని భగత్‌సింగ్ కాలనీలో ఏర్పాటు చేసిన మద్యం షాపులను తొలగించాలని మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు రామాంజి ఇమ్మానుయేల్ డిమాండ్ చేశారు. శనివారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా భగత్‌సింగ్ కాలనీలో రెండు మద్యం షాపులు ఏర్పాటు చేశారన్నారు. మద్యం షాపులను స్టేట్ హైవే నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేశారని, దీనిపై 15 రోజులుగా ఎక్సైజ్ సూపరింటెండెంట్, ఎక్సైజ్ సీఐల దృష్టికి తెచ్చినా స్పందించడంలేదన్నారు. స్టేట్ హైవేపై మద్యం షాపులు ఏర్పాటు చేయడం వలన ఆక్సిడెంట్లు జరిగే అవకాశం ఉందన్నారు. మద్యం షాపుల వద్ద గంగమ్మ దేవాలయం, ఈద్గా, డీఎడబ్ల్యూ కళాశాల, డిగ్రీ జూనియర్ కళాశాల, ప్రభుత్వ ఇంజనీరింగ్, పాలిటెక్నిక్ కళాశాలలు, కామిశెట్టి డిగ్రీ కళాశాల, వరదరాజా పీజీ కళాశాల, టీవీఆర్ స్కూల్స్ ఉన్నాయని మద్యం షాపులు కళాశాలలకు వెళ్లే విద్యార్థినులు, మహిళలకు ఇబ్బందిగా మారిందన్నారు. ఇప్పటికైనా ఎక్సైజ్ అధికారులు మద్యం షాపులను తొలగించాలని, లేదంటే సోమవారం మద్యం షాపులను తెరవనీయమన్నారు.

మధ్యాహ్న భోజనానికి చిన్నగుడ్లు

ప్రొద్దుటూరు టౌన్: మధ్యాహ్న భోజన పథకంలో చిన్నసైజు గుడ్లు పంపిణీ చేస్తుండంతో విద్యార్థులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. పౌష్టికారంలో భాగంగా జూలై వరకు వంట ఏజెన్సీలు వారానికి రెండు గుడ్లు వడ్డించేవారు. ఈ నెల నుంచి ప్రభుత్వమే కాంట్రాక్టర్ ద్వారా పాఠశాలలకు నేరుగా గుడ్లు సరఫరా చేపట్టింది. ఒక్కొక్కగుడ్డుకు రూ.2.35 పైనలుగా ధర నిర్ణయించింది. వారానికి మూడు గుడ్లు వడ్డించాలని ఆదేశించింది. కాంట్రాక్టర్లు తక్కువ పరిమాణంలో ఉన్నగుడ్లను సరఫరా చేస్తుండడంతో విద్యార్థులు తల్లిదండ్రులు అభ్యంతరం తెలుపుతున్నారు. చిన్నసైజు గుడ్లతో పౌష్టికాహారం ఎలా అందుతుందని ప్రశ్నిస్తున్నారు. బజారులో లభించే పెద్దగుడ్లను పంపిణీ చేయాలని కోరుతున్నారు. మధ్యాహ్న భోజనంలో భాగంగా పాఠశాలలకు గుర్తులు వేసిన గుడ్లను సరఫరా చేస్తున్నారు. ఒక్కొక్క వారం ఒక్కొక్క రంగు గుడ్లను అందించనున్నారు. కాగా మండలంలో 125 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా 13 వేల మంది విద్యార్థులకు ఒక్కొక్కరికి వారానికి మూడు గుడ్లు ఇవ్వనున్నారు.



పాఠశాలలకు సరఫరా చేస్తున్న చిన్న సైజు గుడ్లు

పదో తరగతి విద్యార్థులకు ప్రతిభా పరీక్ష

జమ్మలమడుగు రూరల్: జమ్మలమడుగు పట్టణంలోని జీకే కోచింగ్ సెంటర్‌లో 10వ తరగతి విద్యార్థినీ విద్యార్థులకు ఆగస్టు 15 సందర్భంగా సోమవారం ఉదయం 10 గంటలకు ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో ఈ పరీక్ష నిర్వహిస్తున్నట్లు ప్రధాన కార్యదర్శి నాగరాజు తెలిపారు. జమ్మలమడుగు ప్రాంతంలోని అన్ని ప్రైవేటు, ప్రభుత్వ పాఠశాలలకు చెందిన విద్యార్థులు హాజరుకావాలని ఈ సందర్భంగా ఆయన కోరారు.

ఇసుక క్వారీ మంజూరు చేయాలి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న రామాంజనేయరెడ్డి

ప్రొద్దుటూరు టౌన్: ప్రొద్దుటూరు నియోజకవర్గానికి వారం రోజుల్లో ఇసుక క్వారీ నిమంజూరు చేయాలని, లేదంటే తహసీల్దారు కార్యాలయాన్ని ముట్టడిస్తామని కాంట్రాక్టర్ రామాంజనేయరెడ్డి అన్నారు. శనివారం ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రొద్దుటూరులో 2.50 లక్షల జనాభా ఉండగా పెద్ద ఎత్తున భవన నిర్మాణాలు, అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయన్నారు. నిర్మాణ రంగంపై ఆధారపడిన 70 ఫ్లయాష్ బ్రిక్స్ ఫ్యాక్టరీలు, ఇటుక బట్టీలు ద్వారా అయిదు వేల మంది కార్మికులు, భవన నిర్మాణ రంగం ద్వారా 25 వేల మంది కార్మికులు ఆధారపడి జీవిస్తున్నారని తెలిపారు. ప్రొద్దుటూరు ఇసుక క్వారీ లేకపోవడం దురదృష్టకరమని ఇసుక క్వారీ లేకపోవడం స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులకు సిగ్గుచేటన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రజలకు సులభంగా ఇసుక అందించడానికి ఉచిత ఇసుక విధానం ప్రవేశపెట్టిన ప్రొద్దుటూరులో రూ.2,500 ధర పలుకుతోందన్నారు. పోట్లదుర్తిలో 1, జమ్మలమడుగులో నాలుగు క్వారీలు మంజూరు అయినా ప్రొద్దుటూరుకు ఒక క్వారీ లేకపోవడం దారుణమన్నారు. ఆ క్వారీలోకి ప్రొద్దుటూరు ట్రాక్టర్లను రానివ్వడంలేదన్నారు. ఉచిత ఇసుక విధానం ఉన్నా పోలీసులు, అధికారులు పట్టుకుని లంచాలు తీసుకుంటున్నారని, ఇప్పటంటే రూ.20, రూ.25 వేలు ఫైన్ వేసి రెండు మూడు నెలలు ట్రాక్టర్లను సీజ్ చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఇసుక క్వారీని మంజరు చేయాలని కోరారు. భవన నిర్మాణ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి సంజీవరాయుడు, కోశాధికారి శ్రీనివాసులరెడ్డి, బిల్డర్ సంజీవరాయుడు, మేస్త్రీలు సుబ్బారాయుడు, శివ, ఇటుకల ఫ్యాక్టరీ యజమాని నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'వాగ్దేవి'లో ఘనంగా ఫ్రెషర్స్‌డే

ప్రొద్దుటూరు టౌన్: వాగ్దేవి ఇంజనీరింగ్ కళాశాలలో ఫ్రెషర్స్‌డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. శనివారం మొదటి సంవత్సరం విద్యార్థులకు, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు ఘనస్వాగతం పలికారు. వివిధ రకాల సాంస్కృతిక కార్యక్రమాలు, డ్రామా, గ్రూప్‌డ్యాన్స్, సింగింగ్, క్రియేటివ్ ఈవెంట్స్‌తో స్నేహపూరిత వాతావరణం కల్పించి మొదటి సంవత్సరం విద్యార్థుల్లో నెలకొన్న భయాందోళనలను తొలగించారు. అనంతరం ప్రిన్సిపాల్ డాక్టర్ జి.జగదీశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ నేటి విద్యార్థులే రేపటి పౌరులని, విద్యార్థులు తమ నైపుణ్యం ద్వారా పరిశోధనకు పెద్దపీట వేసి ప్రపంచ దేశాలలో భారతదేశం గొప్పదనం చాటి చెప్పాలన్నారు. హెచ్‌వోడీలు డాక్టర్‌హరికిషన్‌రెడ్డి, రామమోహన్‌రెడ్డి, రామమోహన్, సిద్ధేశ్వర్‌రెడ్డి, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

సినిమాగైడ్

ప్రొద్దుటూరు

సుధ :	లై
వెంకటేశ్వర :	జయ జానకి నాయకి
బీవీఎస్:	దువ్వాడ జగన్నాథమ్
ఆరవేటి:	నేనే రాజు నేనే మంత్రి
అర్చన :	లక్ష్మీకటాక్షం
చాంద్ :	అంధగాడు
సినీ హబ్: స్క్రీన్-1:	నేనే రాజు నేనే మంత్రి
స్క్రీన్ -2 :	జయ జానకి నాయకి
స్క్రీన్ -3 :	ఫిదా

హలో.. ఆంధ్రజ్యోతి

- మీకు సమస్యలుంటే ఈ కింది నంబర్లకు ఫోన్ చేసి సమాచారం ఇవ్వగలరు.
- ప్రొద్దుటూరు - 9985411190
- పుట్టపర్తి సర్కిల్, - 9000885325
- క్రైం - 9490633105
- కల్చరల్ - 9966349431
- టౌన్ - 9866885470
- ప్రొద్దుటూరు అర్బన్ -8341751401
- రాజుపాళెం - 9642093626

శ్రీకృష్ణుడి హ్యాండ్ పెయింటింగ్ చిత్రాల ప్రదర్శన

ప్రొద్దుటూరు టౌన్: శ్రీకృష్ణాష్టమి పర్వదినం సందర్భంగా 14, 15 తేదీల్లో శ్రీకృష్ణుని హ్యాండ్ పెయింటింగ్ చిత్రాల ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు మహేష్ ఆర్ట్స్ తుపాకుల రామాంజనేయరెడ్డి తెలిపారు. అగస్త్యేశ్వరస్వామి ఆలయం వద్ద ఉన్నవేదగాయత్రి వేద పాఠశాలలో చిత్రాల ప్రదర్శన ఉదయం 10 నుండి సాయంత్రం 6గంటల వరకు ఉంటుందని తెలిపారు. రాయలసీమలోనే మొదటిసారిగా 101 శ్రీకృష్ణుని చిత్రాలను ప్రదర్శనలో ఏర్పాటు చేస్తామన్నారు. చిత్రప్రదర్శనతోపాటు అమ్మకాలు ఉంటాయని తెలిపారు.

కేసీ కెనాల్ నీటి కోసం రైతుల ఎదురుచూపు

● నేడు మహిళల సామూహిక నిరాహార దీక్ష



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రసాద్‌రెడ్డి, జయశ్రీ

ప్రొద్దుటూరు అర్బన్: రామేశ్వరం రోడ్డు వసంతపేటలో వరుసగా నెలకొల్పిన అయిదు మద్యం దుకాణాలను ఆ ప్రాంతం నుంచి తరలించేవరకు ఉద్యమం ఆగదని మద్యం వ్యతిరేక ఐక్యవేదిక నేత జయశ్రీ, ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాద్‌రెడ్డిలు స్పష్టం చేశారు. శనివారం స్థానిక మున్సిపల్ గాంధీ పార్కులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జయశ్రీ మాట్లాడుతూ యేటా మద్యం అమ్మకాలు పెరుగుదల వల్ల తాగుబోతుల సంఖ్య పెరుగుతున్నదన్నారు. మద్యం దుకాణాల వల్ల మహిళలు పడే ఇబ్బందులు మాత్రం ప్రభుత్వంకు పట్టడంలేదన్నారు. ప్రజలకు తాగునీరు ఇవ్వలేనివాళ్లు ఇళ్ల ఇళ్లమధ్యకు బ్రాందీ షాపులు పెట్టి బ్రాందీ, విస్కీలను పారిస్తున్నారన్నారు. పార్టీలను పక్కనపెట్టి మద్యం వ్యతిరేక ఐక్యవేదిక ఆధ్వర్యంలో మద్యం దుకాణాలు తొలగింపుకు ఉద్యమం చేపడుతున్నామన్నారు. ఆదివారం మద్యం దుకాణాల వద్ద మహిళలు సామూహిక నిరాహార దీక్ష చేపట్టనున్నారన్నారు. ఎమ్మెల్యే ప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ మహిళలకు అభద్రతాభావాన్ని కలిగిస్తున్న మద్యం దుకాణాలు తొలగించాలన్నారు. అన్ని రాజకీయ పక్షాలు, ప్రజా సంఘాలు కలిసి మద్యం వ్యతిరేక ఐక్య వేదికగా ఏర్పడి బ్రాందీషాపుల ముందు ధర్నా, 10న ఎక్సైజ్ కార్యాలం ముట్టడి చేపట్టామన్నారు. 13న నిరాహార దీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. మానవతావాదులు చేసే అభ్యర్థనను ప్రభుత్వం మన్నించి ఎక్సైజ్ అధికారులకు ఉత్తర్వులు జారీ చేసి బ్రాందీషాపులు ఎత్తివేయించాలన్నారు. ప్రభుత్వం వైఖరిలో మార్పు రాకుంటే ఉద్యమకారుల్లో మార్పు వస్తుందన్నారు. 13న ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 6 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు జరిగే నిరాహార దీక్షలో తాను పాల్గొంటున్నట్లు తెలిపారు. మద్యం వ్యతిరేక వేదిక కన్వీనర్ బొర్రా రామాంజనేయులు, ఎం.పద్మ, కోకన్వీనర్ సర్దార్, విరసం రాష్ట్ర కార్యదర్శి వరలక్ష్మి, ఎ.పి.మహిళా సమాఖ్య అధ్యక్షురాలు సరస్వతి, రచయిత జింకా సుబ్రమణ్యం, ఆర్ఎస్ఎఫ్ కన్వీనర్ భాస్కర్ పట్టణ అధ్యక్షులు ఓబులేసు, వైసీపీ పట్టణ అధ్యక్షులు చిప్పగిరి ప్రసాద్, జనవిజ్ఞాన వేదిక అధ్యక్షులు ఆరవేటి చంద్రశేఖర్, రాంగోపాల్‌లు పాల్గొన్నారు.

విద్యారంగంలో ఏఐఎస్ఎఫ్ అలుపెరుగని పోరాటం

కడప, ప్రకాష్‌నగర్ : విద్యాభివృద్ధికి ఏఐఎస్ఎఫ్ అలుపెరుగని పోరాటం చేస్తోందని సీపీఐ నగర కార్యదర్శి వెంకటశివ తెలిపారు. శనివారం ఏఐఎస్ఎఫ్ కార్యాలయంలో 81వ వార్షికోత్సవం సందర్భంగా జెండాను ఎగురవేసి మాట్లాడుతూ 1936 ఆగస్టు 12వ తేదీన ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని లక్నోలో బెనారస్ హిందూ యూనివర్శిటీలో స్థాపించబడిందన్నారు.అనంతరం ప్రభుత్వ కళాశాల, బాలికల కళాశాల వద్ద జెండాను ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా మాజీ కార్యదర్శి మద్దిలేటి, ఈశ్వరయ్య, వలరాజు తదితరులు పాల్గొన్నారు.

జాబ్‌మేళాకు విశేషస్పందన

కడప, మారుతీనగర్ : నగర ఐటీఐ సమీపంలోగల ముక్తియార్ విద్యాసంస్థల్లో భాగమైన గీతమ్స్ డిగ్రీ కళాశాలలో శనివారం ఎంజీఐ టెక్నాలజీ ఆధ్వర్యంలో జరిగిన జాబ్‌మేళాకు విశేషస్పందన లభించింది. సుమారు 300 మంది విద్యార్థులు హాజరు కాగా ఇందులో మూడు కంపెనీలు పాల్గొన్నాయి. జానిఫర్ పబ్లిషర్స్ తరపున హెచ్ఆర్ మేనేజర్ ప్రత్యూష 12 మంది విద్యార్థులను, ఏజెస్ కంపెనీ హెచ్ఆర్ ప్రియాఐదుగురిని, ఏఐటీసొల్యూషన్స్ తరపున హెచ్ఆర్ మాధవ్ 8 మందిని ఎంపిక చేసినట్లు గీతమ్స్ కళాశాల కరస్పాండెంట్ అలీఅక్బర్ తెలిపారు.

సంపూర్ణ అక్షరాస్యత సాధనలో వెనుకబాటు

కడప, ఎర్రముక్కపల్లె : స్వాతంత్ర్యం వచ్చి 70ఏళ్ల పూర్తయినా సంపూర్ణ అక్షరాస్య సాధనలో వెనుకబడి వున్నామని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సుబ్బరాజు విమర్శించారు. యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో శనివారం స్కూల్ టీచర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్యారంగంలో కూడా ప్రజావ్యతిరేక విధానాలు పెరిగిపోతున్నాయని ఆయన తెలిపారు. జీడీపీ విధానంలో ఆరుశాతం నిధులు ఖర్చు చేయాలని కొఠారి కమిషన్ కేంద్ర బడ్జెట్‌లో పదిశాతం నిధులు విద్యకు కేటాయించాలని కోర్ కమిటీ సిఫారసు చేసిందన్నారు. అయితే ప్రభుత్వాలు మారినా ఈ విధానం అమలులో విఫలమయ్యాయన్నారు. కమిటీలపై కమిటీలు వేస్తూ వారిచ్చిన నివేదికలు అమలు చేయకుండా నిరంకుశంగా వ్యవహరిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో గంగన్న, సీవీ రమణ, రఫీక్ అహ్మద్, శ్రీహరి, మస్తానయ్య పాల్గొన్నారు.


జెండావిష్కరిస్తున్న నాయకులు

అభివృద్ధికి దూరం... పబ్బాపురం

మురుగు మధ్యనే సహజీవనం ● దోమలు, జ్వరాలతో సతమతం




కాలువలో చెత్తా చెదారం పడటంతరో నిలబడిన నీరు, కాలువను కప్పివేసిన కంపచెట్లు , కాలువకు అడ్డుగా వేసిన మట్టి

కడప, రవీంద్రనగర్ : కడప నగర శివారు ప్రాంతమైన పబ్బాపురం అసౌకర్యాల మధ్య కొట్టుమిట్టాడుతోంది. పేరుకే నగర పాలక పరిధిలో ఉన్నా సమస్యలకు పుట్టినిల్లుగా మారింది. కొన్నేళ్ళుగా గ్రామంలో అభివృద్ధి అన్న పదమే విన్పించకుండా పోయింది. నగరంలో అధ్వాన్నంలో ఉన్న గ్రామం ఏదంటే పబ్బాపురం మొదటిగా చెప్పవచ్చు. ఏ వీధి చూసినా మురుగు నీరే కనిపిస్తోంది. అటు నాయకులు, ఇటు అధికారులు ఎవరూ పట్టించుకోక పోవడంతో ఆందోళన చెందుతున్నారు. నగర శివారులోని పబ్బాపురంలో సుమారు 400 కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. అక్కడ ఉన్న వారంతా ఎక్కువ శాతం విరామం ఎరుగని శ్రామికులే. గ్రామం ఏర్పడి 40 సంవత్సరాలు అవుతున్నా ఎలాంటి సదుపాయాలు లేవు, ప్రధాన సమస్య మురుగు కాలువలు, గ్రామంలో నీరు వెళ్ళడానికి ఎలాంటి మార్గం లేకపోవడంతో మురుగంతా ఎక్కడి అక్కడే ఆగి ఉంది. కాలువకు అడ్డుగా మట్టిపడి ఇండ్ల దగ్గర ఉండే కాలువలను మట్టితో పూడ్చి వేస్తున్నారు. కొన్ని చోట్ల అయితే చెత్తచెదారం పేరుకపోయి మురుగు కాలువలు నిండి రోడ్ల మీద ఇళ్ళ మధ్య వచ్చి చేరుతోంది. దీంతో దోమలకు నిలయంగా మారడంతో గ్రామస్థులు విషజ్వరాలకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్లు ఉన్నప్పటికీ కొన్ని చోట్ల అవి పూర్తిగా పాడైపోయాయి. దీంతో వాహనదారులకు కాలిబాటన నడిచే వారికి అవస్థగా మారింది. వర్షం పడితే రోడ్ల మీదనే నీరు నిలిచిపోతుంది. పారిశుధ్య కార్మికులు రాకపోవడం వల్ల చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయడంతో దుర్వాసన వస్తోందని వాపోతున్నారు. ముళ్ళకంపలు పెరిగి ఉండడంతో రాత్రి వేళలో విషపురుగు సంచరిస్తున్నాయి. అధికారులకు ఎన్ని సార్లు ఫిర్యాదు చేసిన ప్పటికీ ఎలాంటి చర్యలు లేవని స్థానికులు చెబుతున్నారు. ఇప్పటికైనా మురుగు కాలువలు నిర్మించి కనీస సౌకర్యాలను కల్పించాల్సిన బాధ్యత ఎంతైనా ఉంది.



శుభ్రత మసకబారింది

కొద్ది నెలలుగా పారిశుధ్య కార్మికుల గ్రామం వైపుకన్నెత్తిన చూడటం లేదు. దీంతో చెత్తను ఇక్కడే వేసుకోవాల్సివస్తోంది. దీంతో పాటు మురుగు నీరు పోయే మార్గాలకు చెత్త పడటంతో నీరునిండి రోడ్ల మీదకు చేరుతోంది. ఫలితంగా గ్రామం మొత్తం దుర్గంధం భరితంగా మారింది.అధికారులు వెంటనే స్పందించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

● వెంకటసుబ్బారెడ్డి, స్థానికుడు



మురుగు మధ్యలో జీవనం

గ్రామంలో ఎక్కడ చూసినా మురుగు నీరే వెళ్ళడానికి వీలు లేకపోవడంతో ఎక్కడ నీరు అక్కడే నిలిచిపోతోంది.దీంతోపాటు చిన్న పాటి వర్షానికే మురుగు నీరంతా రోడ్లపైకి వచ్చి చేరుతోంది. అధికారులకు ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు లేవు. ఇప్పటికైనా అధికారులు వెంటనే మురుగు కాలువలు నిర్మించాలని కోరుకుంటున్నాం.

● చెన్నారెడ్డి, స్థానికుడు

శ్రీకృష్ణజన్మాష్టమి వేడుకలకు తరలిరండి


మాట్లాడుతున్న గోవర్ధన్‌రెడ్డి

కడప, మారుతీనగర్ : శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భాన్ని పురస్కరించుకుని శ్రీమురళీకృష్ణ ఆలయ కమిటీ సుందర సత్సాంగం ఆధ్వర్యంలో నగర ద్వారకానగర్‌లో వెలసిన శ్రీమురళీ కృష్ణాలయంలో 13, 14 తేదీలలో జరుగనున్న వేడుకలకు భక్తులు తరలిరావాలని ఆలయ ప్రధాన అర్చకుడు కృష్ణకిరణ్, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గోవర్ధన్‌రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం స్థానిక ద్వారకానగర్‌లోని శ్రీమురళీ కృష్ణాలయంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో వారు మాట్లాడారు. 13వ తేదీ ఉదయం 4.30 గంటలకు స్వామి వారికి సుప్రభాత సేవ, మూలమంత్ర, శ్రీసూక్తం,భూసూక్తం, సుదర్శన హోమం, 8.30 పూర్ణాహుతి, సాయంత్రం 6 గంటలకు బాల వికాస్ పాఠశాల విద్యార్థులచే సాంస్కృతిక కార్యక్రమాలుంటాయన్నారు. 14వ తేదీ తెల్లవారుజామున 4 గంటలకు సుప్రభాతం, అభిషేకరం తిరుమంజనం, మంగళహారతి, సర్వదర్శనం, తీర్థప్రసాదం వినియోగం, 9 గంటలకు గీతాపారాయణ, సాయంత్రం 5 గంటలకు ఊంజలసేవ, శ్రీకృష్ణ కీర్తనామృతం 5.30కు ఉట్టికొట్టు కార్యక్రమం, రాత్రి 7 గంటలకు ద్వారకానగర్ వీధులలో స్వామి వారి ఉత్సవ ఊరేగింపు, రాత్రి 9 గంటలకు ఏకాంతసేవ వుంటుందన్నారు.

వైద్యశాఖ నిర్లక్ష్యమే డెంగ్యూకు కారణం

కడప, రవీంద్రనగర్ : వైద్య ఆరోగ్యశాఖ నిర్లక్ష్యమే డెంగ్యూకు కారణం అని దళిత, గిరిజనుల హక్కుల పోరాట సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మండెం సుధీర్‌కుమార్ పేర్కొన్నారు. కడప నగరంలోని స్థానిక డీజీహెచ్‌పీఎస్ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో మాట్లాడుతూ వర్షాకాలం ప్రారంభం కాకమునుపే జిల్లాలో డెంగ్యూ, మలేరియాలాంటి విషజ్వరాలు ప్రబలుతున్నాయని అన్నారు. ఇప్పటికే చిన్నమండెం మండలం పడమటి కోన దళితవాడ, రైల్వేకోడూరు, జమ్మలమడుగు ప్రాంతాలల్లో విషజ్వరాల విజృంభిస్తున్నాయని తెలిపారు. నివారణకు ముందస్తు చర్యలు చేపట్టాల్సిన జిల్లా వైద్య ఆరోగ్యశాఖ నిర్లక్ష్యమే ఇద్దరు దళిత యువకుల మరణానికి కారణమని పేర్కొన్నారు. డెంగ్యూతో మరణించిన రెడ్డిశేఖర్, భానుప్రకాష్ దళిత కుటుంబాలకు ఒక్కొక్క కుటుంబానికి 10 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించి ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాజు, వెంకటేష్, నాగరాజు, మూర్తి, బాబు, శివ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సుధీర్‌కుమార్

జీవో 279ను రద్దు చేయాలి

కడప, ప్రకాష్‌నగర్ : కార్మికులకు నష్టం కలిగించే 279 జీవోను వెంటనే రద్దు చేయాలని రాయలసీమ ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు సుంకరరవి ప్రభుత్వాన్ని డిమాండ్‌చేశారు. శనివారం వారి కార్యాలయంలో మాట్లాడారు. ఈ నెల 16 నుంచి విజయవాడలో జరుగు దీక్షలకు కార్మికులు తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సుంకర కిరణ్, శివ తదితరులు పాల్గొన్నారు.

సినిమాగ్రేడ్

కడప సినిమాలు

మురళి	: జయజానకి నాయక
రవి	:నేనే రాజు నేనే మంత్రి
సుధ	: ఫిదా
ప్రతాప్	: జయజానకి నాయక
అమీర్	: టాయిలెట్ ఏక్ ప్రేమ్‌కథ
రమేష్	: నేనే రాజు నేనే మంత్రి
తాహర్	: లిప్‌స్టిక్ అండర్‌మై బుర్కా
అప్సర	: లై
రాజా	: లై
ఎస్ఆర్	: లై

వీరభద్రాలయంలో రేపు శ్రీకృష్ణాష్టమి వేడుకలు

రాయచోటిటౌన్: ఈనెల 14వ తేదీ సోమవారం శ్రీకృష్ణుని జన్మదినాన్ని పట్టణంలోని భద్రకాళీ సమేత వీరభద్రాలయంలో ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో మంజుల తెలిపారు. ఈ సందర్భంగా గోవులకు ప్రత్యేక పూజలు ఉంటాయన్నారు. గోకులాష్టమిని పురస్కరించుకుని భక్తులు గోవులకు పూజలు నిర్వహించి స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

సీమస్థాయి శిక్షణ తరగతులను జయప్రదం చేయండి



సమావేశంలో ఏఐటీయూసీ నేతలు

రాయచోటిటౌన్: అనంతపురం జిల్లాలో ఈనెల 13 నుంచి 15వ తేదీ వరకు జరగనున్న ఏఐటీయూసీ రాయలసీమస్థాయి శిక్షణా తరగతులను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ నియోజకవర్గ కార్యదర్శి సిద్దిగాళ్ల శ్రీనివాసులు, అధ్యక్షుడు వెంకట్రమణ పేర్కొన్నారు. శనివారం స్థానిక ఏఐటీయూసీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ కార్మికుల వ్యతిరేక విధానాలను అవలంభిస్తున్న ప్రభుత్వానికి వ్యతిరేకంగా మూడు రోజుల పాటు పెద్ద ఎత్తున జరిగే శిక్షణా తరగతులకు రాయచోటి నియోజకవర్గం నుంచి కార్మికులు, కర్షకులు తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ శిక్షణా తరగతుల్లో కార్మికులు ఎదుర్కొంటున్న పలు సమస్యలపైన చర్చించడం జరుగుతుందన్నారు. సమావేశంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకుడు శ్రీనివాసులు, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకుడు వెంకటేష్, శేషాద్రిబాబు, శ్రీధర్, ఆంజినేయులు తదితరులు పాల్గొన్నారు.

అనాధ వృద్ధులకు దుప్పట్లు పంపిణీ


దుప్పట్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

రాయచోటిటౌన్: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండుతో పాటు వీరభద్రాలయం, షిరిడీ సాయిబాబా మందిరం.. తదితర ప్రాంతాల్లో భిక్షాటన చేసే 35 మంది అనాధ వృద్ధులకు శుక్రవారం రాత్రి లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో దుప్పట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా దేవకీ సుబ్బరామయ్య వర్ధంతిని పురస్కరించుకుని ఆయన కుమారుడు లయన్ దేవకీసతీష్ దుప్పట్లను వితరణ చేశారు. వారు పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఉండే అనాధలకు ఈ దుప్పట్లను అందజేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ చార్టర్ ప్రెసిడెంట్ డాక్టర్ బయారెడ్డి, వృక్షరక్షణ సమితి అధ్యక్షుడు తులసీశ్వర్‌రెడ్డి, లయన్ అవయవదాన చైర్మన్ కొత్తసుదర్శన్, లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు కుసుమాకర్, కార్యదర్శి హరీశ్‌చంద్, కోశాధికారి చాన్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

ఆంజనేయుడిని స్మరిస్తే జన్మ ధన్యం

గాలివీడు: శ్రీరామభక్తుడైన శ్రీవీరాంజనేయ స్వామిని స్మరిస్తే మానవ జన్మ తరిస్తుందని వేదపురోహితుడు నాగఫణి కిశోర్‌శర్మ పేర్కొన్నారు. శ్రావణమాసం మూడో శనివారోత్సవాల్లో భాగంగా పవిత్ర కుషావతి నదీ తీరానా వెలసిన శ్రీఅరవీడు ఆంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. మండలంలోని పలు గ్రామాల్లోని శ్రీఆంజనేయస్వామి ఆలయాల్లో శ్రావణమాస ఉత్సవాలు ఘనంగా భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయానికి వచ్చిన భక్తులందరికీ తీర్థప్రసాదాలు అందజేసి అన్న సంతర్పణలు చేశారు.

చుక్కల పట్టాల రైతులకు న్యాయం చేస్తాం


చుక్కల పట్టా భూముల పైళ్లను పరిశీలిస్తున్న ఆర్డీవో

గాలివీడు: సోలార్ నిర్మాణం వల్ల భూములు కోల్పోతున్న చుక్కల పట్టాల రైతులకు న్యాయం చేస్తామని కడప ఆర్డీవో చిన్నరాముడు పేర్కొన్నారు. శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆయన సోలార్ భూములపై తూముకుంట రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ పాటికే సొంత పాత పట్టా భూములు కల్గిన రైతులకు నష్టపరిహారం అందజేయడం జరిగిందని, డీకేటీ భూములు కల్గిన కొంత మంది రైతులకు కూడా అందజేయడం జరిగిందన్నారు. మిగతా వారికి కూడా త్వరలో నష్టపరిహారాన్ని అందిస్తామన్నారు. చుక్కల పట్టాలు కల్గిన రైతుల వివరాలను సేకరిస్తున్నామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ భవానీ, ఆర్ఐ వినీత్‌కుమార్‌రెడ్డి, తూముకుంట గ్రామ రైతులు కదిరిరెడ్డినాయుడు, రాంమోహన్‌నాయుడు, ఆంజినేయరెడ్డి, మాజీ సర్పంచులు భద్రప్పనాయుడు, బయారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభమైన ఆంజనేయస్వామి జాతర



వీరాంజనేయస్వామిని దర్శించుకుంటున్న భక్తులు.. అన్నదానం చేస్తున్న దృశ్యం

చిన్నమండెం: గుట్టమొటుకు వీరాంజనేయ స్వామి జాతర శనివారం రంగరంగ వైభవంగా ప్రారంభమైంది. జాతర సందర్భంగా స్వామివారిని రంగురంగుల పూలతో అలంకరించారు. ఆలయాన్ని రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. శనివారం ఉదయం స్వామివారికి ఆకుపూజ, స్వస్తివాచకం, గణపతి పూజ, అభిషేకం నిర్వహించారు. అనంతరం హరికథ నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి అన్నదానం నిర్వహించారు. సాయంత్రం చెక్కభజనలు, రాత్రికి శ్రీవీరబ్రహ్మేంద్రస్వామి జీవత చరిత్ర నాటకం ఏర్పాటు చేశారు. మొక్కులు ఉన్నవారు చాందినీ బండ్లను కట్టి ఊరేగిస్తున్నారు. ఈ జాతర ఉత్సవాలను తిలకించడానికి మండలం నుంచే కాక గుర్రంకొం డ, రాయచోటి, వాయిల్పాడు, పెద్దమండెం మండలాల నుంచి భక్తులు తరలి వస్తున్నారు.

రేపు శ్రీకృష్ణాష్టమి వేడుకలు

రాయచోటిరూరల్: ఈనెల 14వ తేదీన శ్రీకృష్ణ జన్మదినం సందర్భంగా శ్రీకృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్లు యాదవ సంఘం అధ్యక్షుడు గోరంట్ల నాగేంద్రబాబుయాదవ్ పేర్కొన్నారు. శనివారం వారు కడప మార్గంలోని బండపల్లె సమీపంలో ఉన్న ప్రేమాలయం వృద్ధాశ్రమంలోని శ్రీకృష్ణ మందిరంలో మాట్లాడుతూ ఈనెల 14న సోమవారం ఉదయం 6 గంటల నుంచి 11 గంటల వరకు స్వామివారికి ప్రత్యేక పూజలతో పాటు 11 గంటల నుంచి 12.15 నిమిషాల వరకు అత్యంత వైభవంగా ఉట్టి కొట్టే కార్యక్రమం ఉంటుందన్నారు. అనంతరం విజేతలకు లక్కిరెడ్డిపల్లె మాజీ జెడ్పీటీసీ రెడ్డెయ్య తులం బంగారం బహుమతిగా ఇస్తున్నట్లు తెలిపారు. అనంతరం 12.30 గంటల నుంచి అన్నదాన కార్యక్రమం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో యాదవ సంఘం సభ్యులు ఈశ్వర్‌యాదవ్, ఆంజియాదవ్, భాస్కర్‌యాదవ్, రమేష్‌యాదవ్, శివయ్యయాదవ్, శ్రీనుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

రేపు టీడీపీ మండల సమావేశం

గాలివీడు: ఈనెల 14వ తేదీన తెలుగు దేశం పార్టీ కార్యకర్తల సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ మండల అధ్యక్షుడు మందపాటి రవీంద్రబాబు తెలిపారు. ఈ సమావేశం సాయంత్రం 4 గంటలకు ప్రారంభమవుతుందని, సమావేశానికి గ్రామ కమిటీ అధ్యక్షులు, అనుబంధ సంఘాల అధ్యక్షులు, కార్యదర్శులు, ఇతర కమిటీ సభ్యులు పాల్గొనాలని కోరారు.

లక్కిరెడ్డిపల్లెలో...

లక్కిరెడ్డిపల్లె: ఈనెల 14వ తేదీన తెలుగుదేశం పార్టీ కార్యకర్తల సమావేశాన్ని ఆర్‌ఆర్ స్వగృహంలో నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ మండల అధ్యక్షుడు, దప్పేపల్లె ఎంపీటీసీ జయరాం, మాజీ మార్కెట్ చైర్మన్ కాలాడి ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. ఈ సమావేశం ఉదయం 10 గంటలకు ప్రారంభమవుతుందని, గ్రామ కమిటీ అధ్యక్షులు, అనుబంధ సంఘాల అధ్యక్షులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

రాయచోటికి తరలుతున్న ఒంటెలు

రామాపురం: రాయచోటి ప్రాంతానికి రాజస్థాన్, మధ్యప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన పలువురు యజమానులు బృందాలుగా ఒంటెలతో తరలిరారున్నారు. వారు జిల్లా కేంద్రానికి రైతు మార్గాల్లో ఒంటెలను తరలించేవారు అక్కడ నుంచి త్వరలో రానున్న బక్రీద్ సందర్భంగా జిల్లాలో కడప, ప్రొద్దుటూరు, రాజంపేట, బద్వేల్, రాయచోటి, పులవెందుల తదితర పట్టణ ప్రాంతాలకు వాటిని తరలిస్తారు. ప్రధానంగా రామాపురంలో రాజస్థాన్, మధ్యప్రదేశ్ రాష్ట్రాలకు పలు కుటుంబాల వారు భరత్, దీపక్, రాంసింగ్ తదితరులు వాటిని ఈ పాలకొండల ప్రాంతాలైన గువ్వలచెరువు, ఇతర అటవీ ప్రాంతంలో సుమారు 40కిపైగా ఒంటెలను మేపుకుంటున్నామని వారు వివరించారు. ఒక్కటి పెద్దది సుమారు 50 నుండి 60 వేల వరకు, చిన్నవి రూ.20 వేల నుంచి 30 వేల వరకు ధర పలుకుతాయన్నారు. ఏటా మన రాష్ట్రాల నుండి భారీ సంఖ్యలో వీటిని ఇక్కడికి తరలిస్తున్నామన్నారు.


కొండావాండ్లపల్లె వద్ద ఒంటెలను మేపుతున్న దృశ్యం

అన్ని దానాల్లోకెల్లా అన్నదానం గొప్పది


అన్నదానం చేస్తున్న రాంప్రసాద్‌రెడ్డి

రాయచోటిటౌన్: మనిషి చేసే అన్ని దానాల్లోకెల్లా అన్నదానం చాలా గొప్పదని వైఎస్ ఆర్‌కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ నాయకుడు మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. శ్రావణ మాస ఉత్సవాల్లో భాగంగా మండల పరిధిలోని దిగువ అబ్బవరం గ్రామం కుమ్మరపల్లె సమీపంలో వెలసిన శ్రీఅభయాంజనేయస్వామి ఆలయంలో మూడో శ్రావణ శనివార వేడుకలకు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆంజినేయస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి అక్కడ ఆలయ కమిటీ సభ్యులు వెంకటాద్రి, రాజారెడ్డి, నారాయణరెడ్డి, సుబ్బరామరాజు, వెంకట్రామిరెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించి భక్తులకు అన్నం వడ్డించారు. అనంతరం మాట్లాడుతూ నేటి సమాజంలో ప్రజలు ఈర్ష్యాద్వేషాలు విడనాడి ఆధ్యాత్మిక భావనతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైసీపీ నేతలు సుధాకర్‌రెడ్డి, కొండారెడ్డి, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ముండ్లవాండ్లకోటలో ఘర్షణ - ఒకరికి గాయాలు

చిన్నమండెం: మండలంలోని ముండ్లవాండ్లకోటలో పశువులను రోడ్డుపై కట్టేస్తున్నారన్న విషయమై జరిగిన ఘర్షణలో ఒకరు గాయపడ్డారు. ఎస్ఐ సుధాకర్ కథనం మేరకు... ముండ్లవాండ్లకోటకు చెందిన దేవరాజులు తన పశువులను దారిపక్కనే కట్టేస్తుండటంతో వీరి ఇంటికి ఎదురుగా ఉన్న రామక్రిష్ణారెడ్డికి ఇబ్బందిగా ఉందని చెప్పాడు. దీంతో మాటామాట పెరిగి ఇరువురి మధ్య ఘర్షణ జరిగిందన్నారు. ఈ ఘర్షణలో దేవరాజులు గడ్డి చెక్కే పార తీసుకొని రామక్రిష్ణారెడ్డి తలపై తీవ్రంగా కొట్టడంతో తలకు తీవ్రగాయమైందన్నారు. మెరుగైన వైద్యం కోసం స్థానిక వైద్యుల సలహా మేరకు తిరుపతి రుయాకు తరలించారని తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

'లోకేష్‌ను విమర్శించే అర్హత రోజాకు లేదు'

● గాజుల ఖాదర్‌బాషా

రాయచోటిటౌన్: రాష్ట్ర ఐటీశాఖా మంత్రి నారా లోకేష్‌ను విమర్శించే అర్హత నిత్యం అపద్దాలతో బతికే రోజాకు లేదని మార్కెట్ కమిటీ చైర్మన్, టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి గాజుల ఖాదర్‌బాషా పేర్కొన్నారు. శనివారం 5వ వార్డులో ముస్లిం మైనార్టీ మహిళలతో కలిసి విలేకరులతో మాట్లాడారు. ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించిన నవరత్నాల హామీలను ముఖ్యమంత్రి చంద్రబాబు ఇప్పటికే అమలు చేస్తున్నారని, వైసీపీ కొత్తగా ప్రకటించిందేమీ లేదన్నారు. రాష్ట్రాభివృద్ధికి నిరంతరం శ్రమిస్తున్న ముఖ్యమంత్రిపై కనీస గౌరవం కూడా లేకుండా రోజా మాట్లాడడం సిగ్గుచేటన్నారు.

ఉప ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు

పోరుమామిళ్ల : ఉపముఖ్యమంత్రి కేఈ క్రిష్ణమూర్తికి దివ్యాంగుల సం ఘం జిల్లా కార్యదర్శి శివశంకర్‌నాయుడు కృతజ్ఞతలు తెలిపారు. దివ్యాంగులకు ఇండ్లపట్టాలు ఇచ్చేందుకు కృషిచేస్తానని ఉపముఖ్యమంత్రి కేఈ క్రిష్ణమూర్తి ఇచ్చినహామీపట్ల శివశంకరనాయుడులు కలసి కృతజ్ఞతలు తెలిపారు.



బసవన్నా నీ పరిస్థితి ఏందయ్యా..

● నాడు వైభోగం, నేడు శిథిలావస్థలో ● కంపపొదల్లో బసవన్న

బి.కోడూరు : నాడు వైభోగం, నేడు శిథిలావస్థలో బసవన్న విగ్రహం, అప్పట్లో బసవన్న విగ్రహం ఏ ఊరివైపు తిప్పినా ఆ ఊరంతా సుభీక్షంగా ఉండేది. వివరాల్లోకి వెళితే మండల పరిధిలోని అంకనగొడుగునూరు గ్రామం సగిలేటికి సమీపాన వెలసిన బసవన్న విగ్రహం ఆ కాలంలో పేరుప్రఖ్యాతలు మన్ననలు, దీప దూప నైవేద్యాలు పొందారు. ఈ బసవన్న చుట్టుపక్కల గ్రామాలు నల్లవాగుపల్లె, గొడుగునూరు, మరాఠిపల్లె, గొడ్లవీడు తదితర గ్రామాలవారు ఇంటి దేవతగా కొలిచేవారు, ఈ గ్రామంలో అయితే గర్భిణులు ప్రసవించకున్నా, ఇంటిలో ఎవరికైనా బాగులేకున్నా, వర్షాలు పడకపోయినా, పైర్లుబాగా చేతికి అందకపోయినా, ఎలాంటి సమస్యలు ఉన్నా, ఆ గ్రామపెద్ద ఒరేయ్ బసవన్నను తిప్పిరాపోండిరా అనే వారు. ఆ బసవన్నను ఆ గ్రామం వైపు తిప్పితే అప్పటి నుంచి వారికి ఏసమస్యలు ఉండేవికాదని గట్టి నమ్మకం. అప్పట్లో ఓ వెలుగు వెలిగిన బసవన్న నేడు కంపపొదల్లో శిథిలావస్థలో ఉన్నారు. ఇప్పుడు దీపాలు లేవు, నైవేద్యాలు లేవు, ఆనాటి గొప్పమనసున్న గ్రామ పెద్దలు లేరు, పూర్తిగా మరచిపోయారు, గ్రామాల్లో 70 సంవత్సరాలు పైబడిన వారికైతేనే ఈ విషయం తెలుసు. ఆనాటి జ్ఞాపకాలను గ్రామాల్లో ఉన్న పెద్దలు నెమరు వేసుకుంటూ అప్పుడప్పుడూ మనసులో అనుకునేవారంట, ప్రస్తుతం బసవన్న విగ్రహం కిందిభాగాన చుట్టుపక్కల గుప్తనిధుల కోసం తవ్వని చోటంటూ లేదు, ఇప్పటికీ నల్లవాగుపల్లె ఒక్క గ్రామమే, ఆనాటి నుంచి ఈనాటి వరకు ఇంటి దేవుడిగా కొలుస్తున్నారు. అయితే గ్రామాల్లో బాగాలేకున్నప్పుడు విగ్రహాన్ని ఆ గ్రామంవైపు తిప్పేముందు బసవన్నకు పసుపు, కుంకుమ, అక్షింతలు, నైవేద్యం పెట్టి బసవన్నను ఆ గ్రామంవైపు తిప్పుకునేవారు, అప్పుడు అంతా బాగుంటుందని వారి నమ్మకం.




కంపపొదల్లో బసవన్న



బసవన్న విగ్రహం

బసవన్నతో రోగాలన్ని మటుమాయం



అప్పట్లో ఇంటిలో ఎవరికన్నా బాగాలేకుంటే రోగాలు వచ్చి మంచాన పడితే బసవన్నను గ్రామంవైపు తిప్పుకుంటే ఎంత రోగమైనా పోతుండేది, ఇప్పుడు పట్టించుకునే దిక్కేలేకుండా పోయారు.

- బుసగాని పిచ్చయ్య, అంకనగొడుగునూరు, బి.కోడూరు.

గర్భిణులకు చాలా మేలు జరుగుతుండేది



ప్పట్లో గర్భిణులకు ఈ ఆసుపత్రికిగాని, ఎక్కడికి వెళ్లి వైద్యం చేయించుకునేవారుకాదు, ప్రసవించే సమయాన బసవన్న విగ్రహాన్ని ఆ గ్రామంవైపు తిప్పుకుంటే సులభంగా ప్రసవించేవారని, అది అప్పట్లో అతిపెద్ద నమ్మకంగా ఉండేది.

- బోరెడ్డి రాఘవరెడ్డి, అంకనగొడుగునూరు, బి.కోడూరు.

జీవకోటి మనుగడకు
మొక్కలు దోహదం

కాశినాయన : జీవకోటి మనుగడకు మొక్కలు దోహదపడతాయని పోరుమామిళ్ల ఫారెస్ట్‌రేంజ్ ఆఫీసర్ జి.సుబ్బరామిరెడ్డి పేర్కొన్నారు. శనివారం వనం-మనం కార్యక్రమంలో భాగంగా కాశినాయన మండలంలోని ఇటుకుళ్లపాడు ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల ఆవరణలో మొక్కలు నాటే కార్యక్ర మం నిర్వహించారు. అనంతరం గ్రామంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మొక్కలు ప్రతి ఒక్కరూ సంరక్షించుకోవాల్సిన బాధ్యత ఎంతైనా ఉందన్నారు. మొక్కలయొక్క ఆవశ్యకతను గూర్చి వారికి వివరించారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ఎస్ఓ సుబ్బయ్య, గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు వెంకటసుబ్బయ్య, పలువురు ఫారెస్ట్ సిబ్బంది, గ్రామస్థులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దేవాలయంలో
శ్రమదానం

పోరుమామిళ్ల : మల్లకత్తువ సమీపంలోని అభయాంజనేయస్వామి ఆవరణలో ఆర్ఎస్ఎస్ ప్రతినిధులు శ్రమదానం చేసి స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. శనివారం ఆదేవాలయం ఆవరనలో చెత్తాచెదారాలను తొలగించి పరిసరాలను పరిశుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో శెట్యం చెన్నయ్య, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్తు సర్వీసులు తొలగించారంటూ ఆందోళన

పోరుమామిళ్ల : గుర్రప్పగారిపల్లె వద్ద తమ పొలాలకు సంబంధించి మోటార్లకు విద్యుత్తు సర్వీసులు తొలగించారని గుర్రప్పగారిపల్లెకు చెందిన రైతులు విద్యుత్తుశాఖ కార్యాలయం ఆవరణలో ఆందోళన చేశారు. మద్దిమాను గుర్రప్పస్వామి సమీపంలోని ఏటిలో ప్రభుత్వస్థలాల్లో మోటార్లు ఏర్పాటు చేసుకున్నారని, కొందరు విద్యుత్తుశాఖ అధికారులకు ఫిర్యాదు చేయడంతో వాటిని వారు తొలగించారు. దీంతో రైతులు దాదాపు 30 మందికిపైగా శనివారం విద్యుత్తు కార్యాలయానికి వచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో ఎన్నడూలేని విధంగా ఎవరో ఫిర్యాదు చేశారని, రైతుల జీవితాలతో చెలగాటమాడటం తగదన్నారు. తాము సర్వీసులన్నింటికీ బిల్లులు చెల్లిస్తున్నామని, అలాంటప్పుడు సర్వీసులు ఎలా తొలగిస్తారన్నారు. ఈ సర్వీసులు తొలగించడం వలన దాదాపు 200 ఎకరాకలు నీరు అందకుండా పోతుందని, ఉన్నపైర్లు ఎండిపోతే రైతులకు ఆత్మహత్యలే శరణ్యమని పేర్కొన్నారు. విద్యుత్తుశాఖ అధికారులు తమ సర్వీసులను పునరుద్దరించాలని, లేని పక్షంలో ఆందోళనలు చేస్తామని పేర్కొన్నారు.



విద్యుత్తు కార్యాలయం ఆవరణలో ఆందోళన చేస్తున్న రైతులు

తోపుడుబండ్ల వ్యాపారస్థులకు బ్యాంకు రుణాలు ఇవ్వాలి

బద్వేలు : బద్వేలు పట్టణంలో దాదాపు 400 మంది తోపుడుబండ్ల వ్యాపారస్థులు ఉన్నారని, వీరు అనేక సమస్యలతో సతమతమవుతున్నారని, వారి సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రత్యేక చొరవచూపి వారికి భ్యాంకులో రుణాలు మంజూరు చేయాలని సీఐటీయూ పట్టణాధ్యక్షుడు టి.వెంకటరమణ పేర్కొన్నారు. శనివారం ఎన్జీఓ హోంలో పి.చాంద్‌బాష అధ్యక్షతన తోపుడు బండ్ల వ్యాపారస్థుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వెంకటరమణ మాట్లాడుతూ నాలుగురోడ్లు పక్కన తోపుడుబండ్లు ఏర్పాటు చేసుకొని, వచ్చే కొద్ది ఆదాయంలోనే జీవనం సాగిస్తున్నారని, వీరికి ప్రభుత్వం నుంచి ఎలాంటి సహకారం అందడంలేదని ఆయన పేర్కొన్నారు. ఎలాంటి షరతులు లేకుండా బ్యాంకు రుణాలు, పక్కారుణాలు, గుర్తింపుకార్డులు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ డివిజన్ ఉపాధ్యాయుడు పీవీ రమణలుపాల్గొన్నారు.

తాగునీటికోసం రోడ్డెక్కిన మహిళలు



పోరుమామిళ్లలో రాస్తారోకో చేస్తున్న మహిళలు

పోరుమామిళ్ల : తమ కాలనీలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని ట్యాంకర్లకు నీరు అందకుండా విద్యుత్తు కట్‌చేశారని, వెంటనే తమకాలనీవాసులకు తాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని, లేని పక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని సుందరయ్య కాలనీకి చెందిన మహిళలు అంబేద్కర్ భవనం దగ్గర రోడ్డుపై బైఠాయించి రాస్తారోకో నిర్వహించారు. ఈ రాస్తారోకో కారణంగా రోడ్డుకు ఇరువైపులా వాహనాలు నిలిచిపోయి, ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. విషయం తెలుసుకున్న ఎస్ఐ పెద్దఓబన్న అధికారులతో మాట్లాడి తాగునీటికి సంబంధించి నీరు అందేలా అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో తాము ఆందోలనలు నిర్వహించారు. శనివారం రంగసముద్రం పంచాయతీపరిధిలో ట్యాంకర్ల ద్వారా తమకాలనీలకు నీరు రావడంలేదని, గుర్రప్పగారిపల్లె వద్ద విద్యుత్తు కనెక్షన్లు తొలగించారని, ఆ కనెక్షన్లను పునరుద్ధరించి తమకు తాగునీటి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ, సుందరయ్య కాలనీకి చెందిన మహిళలు రోడ్డుపై బైఠాయించారు. ఎస్ఐ పెద్దఓబన్న విద్యుత్తు శాఖ అధికారులతో మాట్లాడి తాగునీటి వరకు కనెక్షన్లు పునరుద్ధరించాలని కోరడంతో అధికారులు సమ్మతించారు. దీంతో మహిళలు ఆందోళన విరమించి వెనుతిరిగారు.

గోపవరం మాజీ సర్పంచ్ మృతి

గోపవరం : గోపవరం మాజీ సర్పంచ్, మాజీ సింగిల్‌విండో అధ్యక్షుడు గోపవరం రామచంద్రారెడ్డి(78) శనివారం తెల్లవారుజామున 5గంటల ప్రాంతంలో గుండెపోటుతో మృతి చెందాడు. రామచంద్రారెడ్డి మృతివార్త తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే విజయమ్మ రామచంద్రారెడ్డి స్వగృహానికి వె ళ్లి మృతదేహానికి నివాళులు అర్పించి కుటుంబసభ్యులను పరామర్శించి, సంతాపాన్ని తెలియజేయాశారు. తమ తండ్రి హయాం నుంచి పార్టీకి ఎనలేని సేవలు అందించిన రామచంద్రారెడ్డి మరణం ఎంతో కలచివేసిందన్నా రు. పార్టీ అధ్యక్షుడిగా, సింగిల్ విండో అధ్యక్షుడిగా, సర్పంచ్‌గా ఈ ప్రాంత ప్రజలకు విశేషసేవలు అందించారన్నారు. అంత్యక్రియలు ఆదివారం ఉదయం గ్రామంలో నిర్వహిస్తున్నట్లు కు టుంబసభ్యులు తెలిపారు. ఎల్లారెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, తదితరులు నివాళులు అర్పించారు.

సినిమాగైడ్

బద్వేలు	
శేఖర్	: గౌతమ్‌నంద
నౌషాద్	: ఫిదా
లక్ష్మీనరసింహ	: నక్షత్రం
పోరుమామిళ్ళ	
వెంకటేశ్వర	: ఫిదా
దేశాయి	: గౌతమ్‌నంద

నర్సింగ్‌పల్లెలో తాగునీటి ఇక్కట్లు

పోరుమామిళ్ల : మండలంలోని నర్సింగ్‌పల్లెలో ప్రజలు తాగునీటి ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. కొద్ది రోజులుగా సమీపంలో ఉన్న వ్యవసాయ బోర్లవద్దకు వెళ్లి నీరు తెచ్చుకుంటున్నారు. పొలాలకు, పైర్లకు నీరు సరిపోవడంలేదని, గత్యంతరంలేని పరిస్థితుల్లో ప్రజలకు తాగునీరు అందిస్తున్నామని వ్యవసాయ బోరు యజమానులు తెలిపారు.



వ్యవసాయబోరు వద్ద నీరుపట్టుకుంటున్న మహిళలు

ఉన్నతస్థానంలో నిలిచేందుకు లక్ష్యం పెట్టుకోవాలి


మాట్లాడుతున్న మున్సిపల్ కమినర్ లక్ష్మీరాజ్యం

జమ్మలమడుగు రూరల్: ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో కళాశాలకు వెళ్లి చక్కగా చదువుకుని ఉన్నతస్థానంలో నిలిచేందుకు లక్ష్యంగా పెట్టుకోవాలని కమిషనర్ లక్ష్మీరాజ్యం సూచించారు. శనివారం జమ్మలమడుగులోని వివేకానంద జూనియర్ కళాశాలలో ఫ్రెషర్స్‌డే నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశానికి ఆమె హాజరై మాట్లాడుతూ తరగతి గదిలో గురువు బోధించే పాఠాలను శ్రద్ధగా విని అర్థం చేసుకోవాలన్నారు. చదువుతోపాటు క్రీడలు కూడా చాలా అవసరమన్నారు. మాజీ మున్సిల్ వైస్‌చైర్మన్ తాతిరెడ్డి సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు కళాశాలకు క్రమం తప్పకుండా హాజరై చదువుకోవాలన్నారు. మంచి మార్కులు సాధించడం వల్ల తల్లిదండ్రులకు, కళాశాలకు మంచి పేరు వస్తుందన్నారు. అనంతరం ప్రతిభ కనపరచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్లు సుబ్బారెడ్డి, రామిరెడ్డి, అధ్యాపకులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

అంతరిక్ష రంగంలో 'భారత్' ప్రపంచానికే ఆదర్శం



ప్రొద్దుటూరు క్రైం : భారతదేశంలో శాస్త్ర, సాంకేతిక రంగాల్లో నూతన అవిష్కరణలు, సృజనలకు ఆకాశమే హద్దు అంటూ, అంతరిక్ష రంగంలో 'భారత్' ప్రపంచానికే ఆదర్శంగా నిలుస్తోందని రాష్ట్ర ఉపాధ్యాయ సంఘాల సమన్వయ వేదిక గౌరవాధ్యక్షుడు ఒంటేరు శ్రీనివాసుల రెడ్డి అన్నారు. శనివారం సాయంత్రం భారత అంతరిక్ష పితామహులు విక్రం సారాభాయి జయంతి వేడుకలు స్థానిక నెహ్రూరోడ్డులోని గీతాంజలి హైస్కూల్‌లో ఘనంగా నిర్వహించారు. ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ ఒకే రాకెట్‌లో పీఎస్ఎల్‌వీ 35 ద్వారా 104 ఉపగ్రహాలను అంతరిక్షంలోకి పంపడం మన దేశ శాస్త్ర వేత్తల ప్రతిభకు నిదర్శనమన్నారు. అంతకు ముందు సారాభాయి చిత్రపటం వద్ద నివాళులరించారు.

వరుస సెలవులు - రైళ్లు, బస్సులు కిటకిట


బస్సు ఎక్కేందుకు ఎగబడుతున్న ప్రయాణికులు

ఎర్రగుంట్ల: శ్రావణమాసం వరుస సెలవులు. ప్రయాణికులతో రైల్వేస్టేషన్లు, బస్టాండ్లు కిటకిటలాడుతున్నాయి. రైళ్ళ, బస్సుల సరిస్థితి చెప్పనవసరం లేదు. ఇసుకవేస్తే రాలనంత జనం. 12న రెండవ శనివారం, 13న ఆదివారం, 14న శ్రీక్రిష్ణ జన్మాష్టమి, 15న స్వాతంత్ర్య దినోత్సవం కావడంతో ప్రజలు స్వగ్రామాలకు, దేవస్థానాలకు వెళ్లేందుకు ఎగబడుతున్నారు. ముఖ్యంగా విద్యార్థులు, ఉద్యోగుల సంఖ్య అధికంగా ఉంది. దీంతో రైళ్లలోను, బస్సులోను తావులేదు. శనివారం ఉదయం నుంచి ఎర్రగుంట్ల రైల్వేస్టేషన్ వద్ద ప్రయాణికులతో కిటకిటలాడింది. సాయంత్రం అరగంట వ్యవధిలో నాలుగు రైళ్ల ఒకేసారి రావడంతో దాదాపు 6,7వందల మంది ప్రయాణికులు ప్రొద్దుటూరు వైపు, వేంపల్లి వైపు వెళ్లేందుకు బస్సుల కోసం వేచివున్నారు. అయితే సమయానికి బస్సులు లేకపోవడంతో దాదాపు అరగంటకుపైగా వేచి ఉండాల్సివచ్చింది. దీంతో ఆటోవాలాలకు జేబు నిండుతోంది. డీఎంకు సమాచారం ఇవ్వగా బస్టాండులో ఉన్న 4బస్సులను పంపారు. దీంతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు. శ్రావణమాసం కావడంతో ముఖ్యంగా దేవస్థానాలకు వెళ్లే ప్రయాణికుల తాకిడి అధికంగా ఉంది. గండికి ప్రత్యేక బస్సులు నడుపుతుండటంతో బస్సుల కొరత ఉన్నట్లు ఆర్టీసీ వర్గాలు చెబుతున్నాయి. మరోనాలుగు రోజులు ఎర్రగుంట్ల రైల్వేస్టేషన్‌కు నిరంతరం బస్సులు నడపాలని, సుదూర ప్రాంతాలనుంచి వచ్చే ప్రయాణికులకు ఇబ్బందుల్లేకుండా చూడాలని కోరుతున్నారు. ప్రయాణికుల రద్దీ ఇంతగాఉంటే ఆటోవాళ్లు మాత్ర స్టేషన్ ఎంట్రెన్స్‌లో రోడ్డుకు అడ్డంగా పెట్టి వాహనాలకు, ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్నారు.

బెల్టుషాపుల జోరు

ప్రొద్దుటూరు పుట్టపర్తి సర్కిల్: స్థానిక శ్రీరాంనగర్ ప్రాంతంలో కొన్ని కూల్‌డ్రింక్స్ షాపులు బెల్టు షాపులుగా మారాయి. వీటిలో నిత్యం మద్యం అమ్మకాలు సాగిస్తున్నారు. దీంతో మహిళలు, విద్యార్థినులు వేధింపులకు గురవుతున్నారు. ప్రభుత్వం బెల్టుషాపులను రద్దు చేసినా ఇక్కడ మాత్రం కొనసాగడం ఏమిటని పలువురు అంటున్నారు. బెల్టుషాపులను తొలగించాలని విన్నవిస్తున్నారు.



డాక్టర్ నాగలక్ష్మి స్పెషాలిటీ హాస్పిటల్ ప్రారంభం


ఆస్పత్రిని ప్రారంభిస్తున్న దృశ్యం


హాజరైన రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ చైర్మన్ లింగారెడ్డి

ప్రొద్దుటూరు క్రైం : అత్యాధునిక వైద్య సౌకర్యాలతో నూతన భవన సముదాయంలో ఏర్పాటైన డాక్టర్ నాగలక్ష్మి స్పెషాలిటీ హాస్పిటల్‌ను శనివారం అట్టహాసంగా ప్రారంభించారు. డాక్టర్ నాగలక్ష్మి స్పెషాలిటీ హాస్పిటల్‌ను డాక్టర్ హరీష్, డాక్టర్ కాత్యాలు తమ కుమారుడి చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ నాగలక్ష్మి జ్యోతి ప్రజ్వలన గావించారు. హాస్పిటల్ ప్రారంభం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం డాక్టర్ నాగలక్ష్మి, డాక్టర్ కాత్యా, డాక్టర్ హరీష్‌లు మాట్లాడారు. నగరాలకు ధీటుగా అత్యాధునిక వైద్య సౌకర్యాలు తమ హాస్పిటల్‌లో ఉన్నాయన్నారు. సంతాన సాఫల్యం కోసం, ఉదరకోశ సమస్యల కోసం నగరాలకు వెళ్లాల్సిన పని లేదని, ఇక్కడే అత్యాధునిక వైద్యం అందిస్తామన్నారు. అందరికి అందుబాటులో హాస్పిటల్ సేవలు ఉన్నాయన్నారు. కాగా ఈ హాస్పిటల్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ చైర్మెన్ మల్లెల లింగారెడ్డి, ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి, మున్సిపల్ చైర్మెన్ అసం రఘురామిరెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మెన్ ఉండేల గురివిరెడ్డి, మదన్ హాస్పిటల్ ఎండీ మోహన్‌రెడ్డి, ప్రముఖ వైద్యులు డాక్టర్ నాగదస్తగిరిరెడ్డి, డాక్టర్ స్వరూప్‌కుమార్‌రెడ్డి, డాక్టర్ నాగార్జున, డాక్టర్ బాలక్రిష్ణారెడ్డి, వైద్యులు, పురప్రముఖులు హాజరై డాక్టర్ హరీష్, డాక్టర్ కాత్యా దంపతులకు శుభాకాంక్షలు తెలియజేశారు.

పరిశుభ్ర భారతావనికి ప్రతి ఒక్కరూ సహకరించాలి

కడప, స్పోర్ట్స్ : పరిశుభ్ర భారతావనికి ప్రతి ఒక్కరూ సహకరించాలని ప్రభుత్వ పురుషుల కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సుబ్బనరసయ్య విద్యార్థులకు సూచించారు. శనివారం కళాశాల ఆవరణలో ఎన్‌సీసీ క్యాడెట్లకు స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎన్‌సీసీ అధికారి నీలయ్య, మహేష్, క్యాడెట్లు పాల్గొన్నారు.



నిబంధనలు అతిక్రమించిన పాఠశాలలపై చర్యలు తీసుకోండి

కడప, ఎర్రముక్కపల్లె : ప్రభుత్వ నిబంధనల వ్యతిరేకంగా నడుస్తున్న ప్రైవేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాల ప్రతినిధులు డిమాండ్ చేశారు. నగరంలో డీవైఎఫ్ఐ డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఏ, ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో ఓ ప్రైవేటు విద్యాసంస్థ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాలలలో కనీస మౌలిక వసతులు లేవని తెలిపారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం జిల్లాలో ఒక్క ప్రైవేటు కళాశాల కూడా లేదని తెలిపారు. మామూళ్ళ మత్తులో విద్యాశాఖ జోగుతోందని చెప్పారు. తక్షణం ప్రైవేటు పాఠశాలలను పరిశీలించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ ఎంఆర్ నాయక్, ఏఐఎస్ఏ ఓబులేసు, ఎన్ఎస్‌యూఐ ఆలీ, డీవైఎఫ్ఐ స్టీఫెన్, ఎస్ఎఫ్ఐ సురేష్, బాష పాల్గొన్నారు.

జానపదకళలను అంతరించిపోకుండా చూడండి



సమావేశంలో మాట్లాడుతున్న సిలార్

కడప, మారుతీనగర్ : ప్రాచీన జానపద కళలు అంతరించిపోకుండా చూడాల్సిన బాధ్యత పాలక ప్రభుత్వాలపై వుందని జిల్లా జానపద కళాకారుల సంక్షేమ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. శనివారం ప్రెస్‌క్లబ్‌లో విలేఖరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఇవాళ సమాజంలో జానపద కళలకు ఆదరణకరువై కళాకారులు దుర్భరమైన జీవితాలు గడుపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలో సుమారు 21 జానపద కళలకు సంబంధించిన కళాకారులు వున్నారన్నారు. ప్రభుత్వం స్పందించి ఇంటి స్థలాలను అర్హులైన పేద కళాకారులకు ఇవ్వాలన్నారు. అక్టోబర్‌లో జానపద వారోత్సవాలు జరుగుతున్న దృష్ట్యా జిల్లాలోని కళాకారులను ఏకం చేసి వారి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువస్తామన్నారు. ఈ సమావేశంలో జిల్లా జానపద కళాకారుల సంక్షేమ సంఘం చైర్మన్ డి.ఏసన్న, వైస్ చైర్మన్ కె.లక్ష్మయ్య, ప్రధాన కార్యదర్శి గంగయ్య, కోశాధికారి సుబ్బరాయుడు, కార్యవర్గ సభ్యులు దివాకర్‌బాబు, వెంకటయ్య, నరసింహులు, జయపాల్, మహిళా కళాకారులు ఎం.నీలమ్మ, పి.శిరోమణి, రాధ, జానపద కళాకారుల సంఘం సలహాదారులు వైఎస్ సిలార్ పాల్గొన్నారు.

వికాస్ హైస్కూల్‌లో కృష్ణాష్టమి వేడుకలు

కడప ఎర్రముక్కపల్లె: కడప నగరం ఐటీఐ సర్కిల్‌లోని వికాస్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో శనివారం ముందస్తు కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ వికాస్ హరిక్రిష్ణ కృష్ణుడి గొప్పతనాన్ని, ఆయన ధర్మస్థాపనకు చేసిన కృషి పిల్లలకు వివరించారు. పాఠశాల చిన్నారులు శ్రీకృష్ణుడు, గోపికల వేషాధారణలతో నృత్య కార్యక్రమాలతో అలరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు హమీద్, డైట్ ప్రిన్సిపాల్ శివభాస్కర్, ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



వివిధ వేషదారుణలతో చిన్నారులు, కరస్పాండెంట్ వికాస్ హరిక్రిష్ణ

ట్రాఫిక్ నిబంధనలు పాటించండి

నేను తప్పు చేశాను లఘుచిత్రం పోస్టర్లను ఆవిష్కరించిన డీఎస్పీ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న డీఎస్పీ

కడప, క్రైం : ప్రతి వాహనదారుడు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తే ఎలాంటి ప్రమాదాలు జరగవని కడప డీఎస్పీ షేక్ మాసుమ్‌బాష అన్నారు. ట్రాఫిక్ నిబంధనలపై ఏర్పాటు చేసిన 'నేనుతప్పుచేశాను' అనే లఘుచిత్రం సంబంధించి శనివారం కడప డీఎస్పీ కార్యాలయంలో పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్యం తాగి వాహనాలు డ్రైవింగ్ చేస్తే ప్రమాదాలకు గురికాకతప్పదన్నారు. యుక్త వయసు పిల్లలు వాహనాలను ఇష్టానుసారంగా నడుపుతూ ప్రమాదాలకు గురై ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. నిర్లక్ష్యం వల్ల జరిగే అనర్థాలపై లఘుచిత్ర ద్వారా ప్రజలకుట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పిస్తామన్నారు. ఈ నెల 20న ఎస్పీ చేతుల మీదుగా నేక్‌నామ్ కళాక్షేత్రంలో లఘుచిత్రాన్ని ప్రదర్శిస్తున్నామన్నారు. నేను తప్పు చేశాను అనే చిత్రంను యూట్యూబ్, ఫేస్‌బుక్, వాట్సాప్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవచ్చన్నారు. త్వరలో మట్కా, దొంగతనాలు ఇతర నేరాలపై లఘు చిత్రాలను ప్రారంభించనున్నామన్నారు.

ఎల్‌హెచ్‌ఎంఎస్ యాప్‌ను సద్వినియోగం చేసుకోండి

రాష్ట్ర పోలీసుశాఖ నూతనంగా ఏర్పాటు చేసిన లాక్డ్‌హౌస్ మానిటరింగ్ సిస్టమ్ (ఎల్‌హెచ్‌ఎంఎస్) మొబైల్ అప్లికేషన్ నగర ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కడప డీఎస్పీ షేక్ మాసుమ్‌బాష కోరారు. దొంగతనాలను నియంత్రించడంతో పాటు దొంగలను పట్టుకునేందుకు ఈ యాప్ ఉపయోగపడుతుందన్నారు. ఆన్‌లైన్ మొబైల్ ఫోన్ వున్నవారు తమ పేరుతో పాటు ఇంటి అడ్రస్‌ను రిజిస్టర్ చేసుకుంటే వారికి ఐడీ నెంబరు వస్తుందన్నారు. ఎవరైనా ఊర్లకు వెళ్లాల్సి వస్తే ఈ యాప్ ద్వారా సమాచారం ఇస్తే ఆ ఇంటికి ఉచితంగా సీసీ కెమెరాలు అమర్చుతామన్నారు. సీసీ కెమెరాలు పోలీసు కంట్రోల్ రూముకు అనుసంధానం చేస్తున్నామన్నారు. దేశ విదేశాల నుంచి ఈ యాప్ ద్వారాపోలీసులకు సమాచారం ఇవ్వవచ్చన్నారు. ఇప్పటి వరకు కడప నగరంలో 794 మంది రిజిస్టర్ చేసుకున్నారని, త్వరలో వేల మంది యాప్‌ను రిజిస్టర్ చేసుకునేలా చర్యలు తీసుకుంటామన్నారు.కడప ప్రజలు ఈ యాప్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐలు టీవీ సత్యనారాయణ, దారెడ్డి భాస్కర్‌రెడ్డి, రామక్రిష్ణ, మోహన్‌ప్రసాద్, లఘుచిత్ర డైరెక్టర్ హేమారెడ్డి, నిర్మాత ఎస్‌వీ శివారెడ్డి, చంద్రారెడ్డి, కెమెరామెన్ పీఎన్‌రాజ్, మ్యూజిక్ డైరెక్టర్ నిజాముద్దీన్ పాల్గొన్నారు.

వాహన తనిఖీ

కడప, క్రైం : కడప నగరం బిల్టప్ సర్కిల్ వద్ద తాలూకా ఎస్ఐ రాజరాజేశ్వర్‌రెడ్డి సిబ్బందితో వాహనతనిఖీ నిర్వహించారు. ఆర్‌సీ, లైసెన్స్, ట్రిపుల్, సెల్ డ్రైవింగ్‌లను గుర్తించి 44 కేసులు నమోదు చేసి రూ.6వేలు జరిమానా విధించారు.

శిల్పారామానికి ప్రతి ఆదివారం ప్రత్యేక ఆర్టీసీ బస్సులు

కడప, మారుతీనగర్ : నగర శివార్లలోని శిల్పారామానికి ప్రతి ఆదివారం ఆర్టీసీ ప్రత్యేక బస్సును నడుపుతుందని శిల్పారామం ఏవో ఖాదర్‌వల్లి తెలిపారు. ప్రతి ఆదివారం రద్దీ ఎక్కువగా ఉంటుందని నగరం నుంచి ప్రజలు ఎక్కువగా వస్తుంటూ వుంటారని దీని వల్ల ట్రాఫిక్ అంతరాయం కలిగి రిమ్స్‌కు వెళ్ళే రోగులకు ఇబ్బంది కలుగుతున్న విషయాన్ని కలెక్టర్‌కు తెలిపామన్నారు. ఆయన ఆదేశాల మేరకు ఆర్టీసీ చీఫ్‌ట్రాఫిక్ మేనేజర్ కిశోర్‌ను కలిసి శిల్పారామానికి ప్రత్యేక బస్సులను వేయాలని కోరగా ఏర్పాటు చేస్తామని తెలిపారన్నారు. ప్రతి ఆదివారం 3 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు బస్సులు నడుస్తాయన్నారు. నగరంలో అప్సర, సంధ్యాసర్కిల్, పాతబస్టాండు, కోటిరెడ్డిసర్కిల్, ఎర్రముక్కపల్లె నుంచి కొత్త కలెక్టరేట్ మీదుగా బస్సులు వెళతాయన్నారు. ఈ సదుపాయాన్ని ప్రజలు వినియోగించుకోవాలని కోరారు.

నేడు శిల్పారామంలో...

శిల్పారామంలో ఆటవిడుపులో భాగంగా ప్రతి ఆదివారం వివిధ పాఠశాలల డ్యాన్స్ అకాడమీల కళాకారులతో నృత్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ఈ ఆదివారం ఎన్జీవో కాలనీ హరిహరి డ్యాన్స్ షో ఆధ్వర్యంలో కార్యక్రమాలు జరుగుతాయన్నారు.

16న సీపీఐ రాష్ట్ర కరువు పరిశీలన
బృందం పర్యటన

కడప, ప్రకాష్‌నగర్ : జిల్లాలో కరువును పరిశీలించేందుకు సీపీఐ రాష్ట్ర పరిశీలనా బృందం 16వ తేదీ జిల్లాలో పర్యటించనున్నట్లు సీపీఐ జిల్లా కార్యదర్శి ఈశ్వరయ్య తెలిపారు. శనివారం సీపీఐ కార్యాలయంలో విలేఖరులతో మాట్లాడారు.

ప్రారంభమైన మనగుడి కార్యక్రమం



మన గుడి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

కడప, మారుతీనగర్ : తిరుమల తిరుపతి దేవస్థానం, హిందూధర్మ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన 9వ విడత మనగుడి కార్యక్రమం జిల్లాలోని మండలాల్లో శనివారం నుంచి ప్రారంభమయ్యాయి. మూడు రోజుల పాటు జరుగుతున్న మనగుడి కార్యక్రమాలోల భాగంగా 12వ తేది శనివారం ఆలయాలశుద్ధి నిర్వహించారు. ఇందులో భాగంగా నగర మాసాపేటలోని రామాలయాన్ని శుద్ధి చేశారు. ఇందులో హిందూధర్మ పరిరక్షణ ట్రస్టు కార్యదర్శి రామ్‌మహేష్, సభ్యులు భూపతి రాయలు, ఆలయ ధర్మకర్త రామసుబ్బయ్య, సభ్యులు సుభాష్ , రంగ, రామక్రిష్ణ, గుడి ధర్మకర్తలు ప్రజలు పాల్గొని ఆలయాన్ని జలాలతోశుద్ధి చేశారు.

దేశాన్ని పట్టిపీడిస్తున్న మత మార్పిడి

● మూడు రాష్ట్రాల భజరంగదళ్ సంయోజక్ సూర్యనారాయణ

చిన్నమండెం: ఒకవైపు తీవ్రవాదం, మరోవైపు మతం మార్పిడి దేశాన్ని పట్టిపీడిస్తున్నాయని భజరంగదళ్ ఆంధ్ర, కర్నాటక, తెలంగాణ రాష్ట్రాల సంయోజక్ సూర్యనారాయణ పేర్కొన్నారు. చిన్నమండెం మండలం తూర్పుపల్లె దళితవాడ సమీపంలో ఉన్న ఇందిర బీఎడ్, డీఎడ్ కళాశాలలో శనివారం సాయంత్రం భజరంగదళ్ ప్రాంతీయ సమ్మేళనం ప్రారంభించారు. ఈ సమ్మేళనంలో ఆయన మాట్లాడుతూ హిందూసమాజ సమస్యలకు పరిష్కారం హిందూ యువకుల సంఘటన మాత్రమేనన్నారు. హిందువుల జనాభా నిష్పత్తి ఇతర మతస్తుల పెరుగదల నిష్పత్తితో పోలిస్తే తగ్గిపోతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. వీహెచ్‌పీ దక్షిణాంధ్ర అధ్యక్షుడు బైరెడ్డి రామక్రిష్ణారెడ్డి మాట్లాడుతూ దేశంలో గోవుల ఉపయోగాలు శాస్త్రీయ ఆధారాలతో తెలుపుతున్నా హిందువులను మానసికంగా అవమానించడానికే గోవధ పెద్ద సంఖ్యలో జరుగుతున్నదన్నారు. భజరంగదళ్ ప్రాంతీయ సంయోజక్ వేదప్రకాష్ మాట్లాడుతూ భజరంగదళ్ ప్రాతీయ సమ్మేళనంలో భాగంగా మెదటి రోజు యువకులకు శారీరక అభ్యాసాలు, చర్చాకార్యక్రమాలు ఇష్టాగోష్టిలు నిర్వహించామన్నారు. రెండో రోజు రాయచోటి పట్టణంలో శోభాయాత్ర, సార్వజనీత ఉత్సవం జరుపుతున్నట్లు కడప జిల్లా కార్యదర్శి రామమహేష్ తెలిపారు. కార్యక్రమంలో ప్రాంత సత్యంగ్ రాముడు, భజరంగదళ్ ప్రాంతీయ సంయోజక్ ప్రతాప్‌రెడ్డి, రాయచోటి సుబ్బయ్య, అంకాళయ్య, అలాగే రాష్ట్ర నలుమూలల నుంచి తరలివచ్చిన భజరంగదళ్, వీహెచ్‌పీ కార్యకర్తలు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న భజరంగదళ్ సంయోజక్ సూర్యనారయణ, హాజరైన హిందూ యువకులు

వృక్షాలతోనే వాతావరణ కాలుష్య నివారణ


మొక్కలు నాటుతున్న ఎస్ఐ

గాలివీడు: ప్రస్తుతం పర్యావరణ కాలుష్యాన్ని నివారించాలంటే ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వృక్ష సంపదను కాపాడాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని ఎస్ఐ మంజునాథ్ పేర్కొన్నారు. శనివారం శ్రావణమాసోత్సవాలను పురష్కరించుకుని ఎస్ఐ ఆధ్వర్యంలో నారాలోకేష్ యువసేన అధ్యక్షుడు రేవనూని రాజ్‌కుమార్ నేతృత్వంలో మొక్కలు నాటారు. వెలిగల్లు ప్రాజెక్టు పార్కు, గండిమడుగు శ్రీఉమామహేశ్వరస్వామి ఆలయానికి వెళ్ల రోడ్డుకిరువైపులా వెయ్యి మొక్కలను నాటారు. అనంతరం రాజ్‌కుమార్ మాట్లాడుతూ మండల కేంద్రం పరిసర ప్రాంతాల్లో యువసేన ఆధ్వర్యంలో విరివిగా మొక్కలు నాటి హరిత సంపదను పెంపొందించేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో డాక్టర్ రామచంద్రారెడ్డి, యువసేన సభ్యులు చక్కా రాజేష్, సుబ్బారెడ్డి, రామచంద్ర, పాఠశాల కరస్పాండెంట్ రవిశంకర్, ప్రధానోపాధ్యాయుడు గరుడప్ప, ఇన్‌చార్జి రామక్రిష్ణ, ఉపాధ్యాయులు రమేష్, చిన్నప్ప, రవిచంద్ర, విద్యార్థులు, పలువురు పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'జగన్‌కు పిచ్చి పట్టింది'

చిన్నమండెం: వైఎస్‌ఆర్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి పిచ్చి పట్టిందని టీడీపీ మండల అధ్యక్షుడు నరసింహారెడ్డి ఆరోపించారు. శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ప్రజల చేత ఎన్నుకోబడి రాష్ట్రాన్ని పాలిస్తున్న ముఖ్యమంత్రిని కాల్చి చంపండని, కాలర్ పట్టి నిలదీయాలని ఏదేదో మాట్లాడుతున్నారని, బాధ్యతాయుతమైన ప్రతిపక్షనేత ఇలా మాట్లాడటం సమంజసం కాదన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల ఉపాధ్యక్షుడు షాబుద్దీన్, ప్రధాన కార్యదర్శి నాగభూషణం, గ్రామ కమిటీల అధ్యక్షులు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.


మాట్లాడుతన్న నరసింహారెడ్డి

డెంగ్యూపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరం


దళితవాడలో ర్యాలీ చేస్తున్న జీవీవీ సభ్యులు

చిన్నమండెం: ప్రాణాంతకమైన డెంగ్యూ జ్వరంపై ప్రజలు అవగాహన పెంచుకోవాలని జనవిజ్ఞాన వేదిక జాతీయ విద్యాశిక్షణా సభ్యుడు రాజశేఖర్ పేర్కొన్నారు. మండలంలోని పడమటికోన దళితవాడలో డెంగ్యూ కారణంగా రెడ్డిశేఖర్, భానుప్రకాష్ మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ గ్రామంలో శనివారం జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం చేపట్టి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డెంగ్యూ వ్యాధి ఏడిస్ ఈజిప్ట్ అనే దోమకారణంగా వస్తుందన్నారు. ఈ దోమ మంచినీటిలోనే పెరుగుతుందని, పగలు మాత్రమే కుడుతుందని వివరించారు. ఈ దోమకాటుకు గురైన వారిలో తీవ్రమైన జ్వరం, తలనొప్పి, వళ్లు నొప్పులు ఉంటాయన్నారు. చర్మంపై దద్దుర్లు ఏర్పడటం, కనురెప్పలు మూతవేయలేనంత నొప్పిగా ఉండటం, చివరి దశలో రక్తస్రావం జరుగుతుందన్నారు. వ్యాధి సోకిన వారిని తాకినా, తిరిగినా ఇతరులకు సోకుతుందనుకోవడం అపోహ అన్నారు. డెంగ్యూ కేవలం దోమలు కరిస్తేనే వస్తుందని వివరించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం, డ్రైడే పాటించడం వలన అదుపు చేయవచ్చని సూచించారు. కార్యక్రమంలో ఆశావర్కర్ సుమతి, సీఆర్పీ మనోహర్ తదితరలు పాల్గొన్నారు.

ఘనంగా ఏఐఎస్ఎఫ్ ఆవిర్భావ దినోత్సవం

రాయచోటిటౌన్: సమరశీల ఉద్యమాల సారధి, భారత విద్యార్థి లోకానికి ఒక స్ఫూర్తిని, చైతన్యాన్ని కలిగించిన సంఘటిత శక్తి ఏఐఎస్ఎఫ్ 82వ ఆవిర్భావ దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణ పరిధిలోని సుండుపల్లె మార్గంలో ఉన్న ఇంటర్నేషన్ మెరిట్ హైస్కూల్‌లో ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు కోటేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించిన ఈ వేడుకలకు అర్బన్‌సీఐ మహేశ్వర్‌రెడ్డి, అర్చనా విద్యాసంస్థల డైరెక్టర్ మదన్‌మోహన్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏఐఎస్ఎఫ్ 1936లో స్థాపించినప్పటి నుంచి నేటి వరకు అనేక విద్యారంగ సమస్యలపై పోరాటం సాగించిందన్నారు. నాడు బ్రిటీష్ పరాయి పాలకుల బానిస చెర నుంచి మాతృభూమి విముక్తి కోసం సాగిన స్వాతంత్ర్య ఉద్యమంలో పిడికిలి బిగించి స్వాతంత్ర్యం మా జన్మ హక్కు అని చాటిన ఏకైక విద్యార్థి సంఘం ఏఐఎస్ఎఫ్ అన్నారు. కార్యక్రమంలో ఇంటర్నేషనల్ మెరిట్ హైస్కూల్ కరస్పాండెంట్ మనోహర్‌రెడ్డి, సీపీఐ ఏరియా కార్యదర్శి విశ్వనాథ్, సీనియర్ నాయకుడు గంగిశెట్టి, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శులు నారాయణ, ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.



రైతు అభివృద్ధి కోసమే వాటర్‌షెడ్ మాక్స్

సంబేపల్లె: రైతుల అభివృద్ధి కోసమే వాటర్‌షెడ్ మాక్స్‌లు ఏర్పాటు చేసినట్లు ఆర్‌హెచ్‌జీబీయంఎస్ఎస్ ప్రతినిధులు, అడవికమ్మపల్లె వాటర్‌షెడ్ కమిటీ ఛైర్మన్ సహదేవరెడ్డి తెలిపారు. శనివారం వారు మాట్లాడుతూ అడవికమ్మపల్లె వాటర్‌షెడ్ కమిటీలో 28 మంది రైతులకు రూ.5.9 లక్షల ఆర్థిక రుణాలను ఇచ్చామన్నారు. ఇందులో కొంత మంది రైతులు రూ.3.98 లక్షలురిపేమెంట్ నిలిపివేసినట్లు తెలిపారు. మాక్స్ అభివృద్ధి చెందాలంటే రైతులు తీసుకొన్న రుణాలను క్రమం తప్పకుండా చెల్లించాలని సూచించారు. ఆర్‌హెచ్‌జీబీయంఎస్ఎస్ ఆధ్వర్యంలో నీటి నిల్వల కోసం ప్రతి వర్షపు నీటిని వడిసి పట్టేందుకు వాటర్‌షెడ్ గ్రామాల్లో పనులు చేపట్టి భూగర్భజలాలు పెంచడమే లక్ష్యంగా పనిచేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో వాటర్‌షెడ్ కమిటీ సభ్యులు, ఆర్‌హెచ్‌జీబీయంఎస్ఎస్ సంస్థ ప్రతినిధులు రాచరాయుడు, వీరనాగయ్య, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

టీకాల ద్వారా పశువ్యాధులను నయం చేయవచ్చు

గాలివీడు: వివిధ రకాల టీకాలు వేయడం ద్వారా పశువులకు సోకే వ్యాధులను దూరం చేయవచ్చునని డాక్టర్ నారాయణ తెలిపారు. జెర్సీ డెయిరీ ఆధ్వర్యంలో శనివారం మండలంలోని అరవీటివాండ్లపల్లెలో ఉచిత పశు వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశువులకు ప్రస్తుతం వివిధ రకాలైన వ్యాధులు సోకుతున్నాయని, జబ్బు చేసిన వెంటనే డాక్టర్‌ను సంప్రదించాలని తెలిపారు. కార్యక్రమంలో మదనపల్లె సీనియర్ మేనేజర్ క్రిష్ణారెడ్డి, గాలివీడు మేనేజర్ జమాల్‌బాషా, రెడ్డికుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హలో.. ఆంధ్రజ్యోతి

మీ ప్రాంతంలో ఉన్న సమస్యలు తెలపాలన్నా, ఇతరత్రా సమాచారం ఇవ్వాలన్నా 'ఆంధ్రజ్యోతి'ని ఈ క్రింది నెంబర్లలో సంప్రదించండి.

రాయచోటి	9985411187
రాయచోటి టౌన్	9441794427
రాయచోటిరూరల్	9676860131
సంబేపల్లె	9703163108
గాలివీడు	9441049010
చిన్నమండెం	8886297090
లక్కిరెడ్డిపల్లె	8897095884
రామాపురం	9441079032

వరి సాగుకు రైతులు సన్నద్ధం

సంబేపల్లె: మండల వ్యాప్తంగా రైతులు వరిసాగుకు సన్నద్ధమయ్యారు. బోరుబావుల కింద, నీరు ఉన్న వ్యవసాయ బావుల కింద వరిసాగుకు సిద్ధమయ్యారు. రెండు రోజుల క్రితం వర్షం పడడంతో పిట్టమడి సిద్ధం చేశారు. మడిదున్ని నీటితో మురగబెట్టి పిట్టమడిని దుక్కి చేస్తున్నారు. దీంతో పాటు పిట్టమడిలో పచ్చిరొట్టె ఎరువు కింద ఆకులు కొమ్మలను వేస్తున్నారు. నారు మడులను ముందుగానే సిద్ధం చేసి నారు పోశారు. ప్రస్తుతం వరి నారు నాటేందుకు సిద్ధంగా ఉంది. మండల వ్యాప్తంగా వరి సాగు ప్రతి ఏడాది వర్షాభావ పరిస్థితులతో గణనీయంగా తగ్గుతుంది. ఈ ఏడాది సాగు విస్తీర్ణం పెద్దగా ఉండదంటున్నారు రైతులు.


నాటేందుకు సిద్ధంగా ఉన్న నారు

సినిమాగైడ్

రాయచోటి

ప్రసాద్	: జయజానకినాయక
గౌతమ్	: నేనేరాజు నేనేమంత్రి
సాయి	: లై
సోనీరాజ్	: నక్షత్రం

గాలివీడు

పావని	: బాహుబలి-2

ఆదమరిస్తే అంతే


కట్టపై ఉన్న రహదారి కుంగిన దృశ్యం

అట్లూరు : మండల పరిధిలోని అట్లూరు నుంచి గాండ్లపల్లె కట్టమీదవేసిన రహదారిపై వాహనదారులు ఆదమరచి వాహనాలు నడిపితే ప్రమాద అంచుల్లో పడటం ఖాయం. వివరాల్లోకి వెళితే గతంలో కురిసిన వర్షాలకు గాండ్లపల్లె కట్టపై ఉన్నరహదారి నీటి ఉధృతికి కుంగిపోయింది. దీంతో రహదారిపై వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రతి నిత్యం మండల కేంద్రానికి ఏదో ఒక పనిమీద మహమ్మదాయపల్లె, చౌటపల్లె గ్రామస్థులు మండల కేంద్రానికి వచ్చే పరిస్థితి ఉండేది. ప్రస్తుతం ఈ రహదారి కుంగిపోవడంతో ఎటువంటి వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బంది కలుగుతోంది. రహదారికుంగిపోయి రెండేళ్లు అవుతున్నా అధికారులు మాత్రం చూస్తున్నారేకానీ పట్టించుకోవడం లేదని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు కట్టమరమ్మతులు చేయించి రహదారి ఏర్పాటు చేయాలని గ్రామస్థులు కోరుకుంటున్నారు. ప్రతి నిత్యం విద్యార్థులు అదే రహదారిపై విద్యార్థులు మండల కేంద్రంలో ఉన్న పాఠశాలలకు రావాల్సి ఉంది. రోజు రోజుకు కట్టపై ఉన్న రహదారి గుంతలుపడుతూ కుంగిపోతుంది. దీంతో విద్యార్థులు ఆ కట్టరహదారిపై వెళ్లాలంటే భయాందోళనకు గురవుతున్నారు.

ముందస్తు కృష్ణాష్టమి వేడుకలు

బద్వేలు : స్థానిక తెలుగుగంగ కాలనీలోని నారాయణస్కూల్లో శనివారం ముందస్తు కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వమించారు. ఈ సందర్భంగా విద్యార్థులు శ్రీకృష్ణుడు, గోపికల వేషదారణలతో వేడుకలను ఆనందోత్సాహాల మధ్య నిర్వహించుకున్నారు. విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు అందరినీ అలరించాయి. ఉట్టికొట్టే కార్యక్రమంలో విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో డీన్ రవీంద్ర, కళాశాల ప్రిన్సిపాల్ సి.రాజేంద్రరెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ శ్రీకాంత్‌రెడ్డి, ఉపాధ్యాయులు పావని, లలితలు పాల్గొన్నారు.



మెరుగైన వైద్యసేవలు అందించడమే లక్ష్యం

Interview ఇంటర్వ్యూ

డిప్యూటీ సివిల్‌సర్జన్ రాంప్రసాద్



బద్వేలు టౌన్ : పేద ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యమని బద్వేలు డిప్యూటీ సివిల్‌సర్జన్ డాక్టర్ రాంప్రసాద్ అన్నారు. మాతా శిశుమరణాలను తగ్గించేందుకు కూడా కృషి చేస్తున్నామన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పిస్తున్నామన్నారు.

ప్రశ్న : ప్రస్తుతం బద్వేలు ప్రభుత్వ ఆసుపత్రిలో ఎంత మంది వైద్యులు ఉన్నారు ?

జ : ఒక్కడిప్యూటీ సివిల్‌సర్జన్, నలుగురు వైద్యాధికారులు ఉన్నారు.

ప్రశ్న : ప్రతి రోజూ వైద్యం కోసం ఎంత మంది ప్రజలు వస్తుంటారు ?

జ : సుమారు 300 మంది వైద్య చికిత్సల కోసం ఆసుపత్రికి వస్తున్నారు.

ప్రశ్న : కు.ని ఆపరేషన్లు చేయిస్తున్నారా ?

జ : ప్రభుత్వాసుపత్రిలో గత నెల నుంచి ఇప్పటి వరకు 100కు.ని ఆపరేషన్లు చే శాము.

ప్రశ్న : ఆసుపత్రిలో ఎన్నికాన్పులు అవుతున్నాయి ?

జ : ఆసుపత్రికి వచ్చే మహిళలకు అన్ని వసతులు కల్పిస్తామని, అవగాహన కల్పించి నెలకు సుమారు 22 కాన్పులు అవుతున్నాయి, కాన్పుల సంఖ్యను పెంచేందుకు మహిళలకు అవగాహన కల్పిస్తున్నాము.

ప్రశ్న : జననీ సురక్షా పథకం అమలు చేస్తున్నారా ?

జ : జననీ సురక్షా పథకం అమలు చేస్తున్నాము, కాన్పులు అయిన మహిళలకు నగదుతోపాటు ఎన్టీఆర్ బేబీకిట్‌ను కూడా అందజేస్తున్నాము.

ప్రశ్న : తల్లీ, బిడ్డ ఎక్స్‌ప్రెస్‌ను వినియోగించుకుంటున్నారా ?

జ : ఆసుపత్రిలో డెలవరీ అయిన తరువాత వారికి ప్రభుత్వం నుంచి వచ్చిన నగదు, బేబీకిట్‌ను అందించి తల్లీబిడ్డను సురక్షితంగా తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ ద్వారా గమ్యానికి చేరుస్తున్నాము.

ప్రశ్న : జనన ధృవీకరన సర్టిఫికెట్లు ఇస్తున్నారా ?

జ : జనరేట్‌చేసి డెలవరీ అయిన వెంటనే జనన ధృవీకరన సర్టిఫికెట్లను అందజేస్తున్నాము,

ప్రశ్న : ఆసుపత్రిలో రక్త పరీక్షలు నిర్వహిస్తున్నారా ?

జ : అన్ని రకాల వ్యాధులకు రక్తపరీక్షలు నిర్వహిస్తున్నాము.

ప్రశ్న : ఆసుపత్రిలో మందుల కొరత ఏమైనా ఉందా ?

జ : ఆసుపత్రిలో మందుల కొరత లేదు.

ప్రశ్న : ఆసుపత్రికి నూతన కమిటీ ద్వారా ఏయే పనులకు శ్రీకారం చుట్టారు ?

జ : ఆసుపత్రి అభివృద్ధి కమిటీ ద్వారా ఆసుపత్రికి అన్నీ మౌలిక సదుపాయాల కోసం ముఖ్యమైన పనులకు స్వీకారం చుడుతున్నాము.

ప్రశ్న : ఆసుపత్రిలో ఎక్స్‌రేప్లాంట్ ఉందా ?

జ : గతంలో కోటవీధిలో ఉన్నప్పుడు ఆసుపత్రిలో ఎక్స్‌రేప్లాంట్ ఉండేది, అక్కడి నుంచి ఇక్కడికి మార్చిన తరువాత ఎక్స్‌రేప్లాంట్ కోటవీధిలోనే నిరుపయోగంగా ఉంది, దానిపై ఉన్నతాధికారులతో మాట్లాడి త్వరలో సీమాంక్ ఆసుపత్రికి తీసుకువస్తాం.

ఏఐఎస్ఎఫ్‌ది పోరాటాల చరిత్ర


సమావేశంలో మాట్లాడుతున్న ఈశ్వరయ్య


హాజరైన విద్యార్థులు

బద్వేలు టౌన్ : అఖిలభారత విద్యార్థి సమాఖ్య పోరాటాలు చేసిన చరిత్ర ఉందని ఏఐఎస్ఎఫ్ జాతీయ మాజీ ఉపాధ్యక్షుడు ఈశ్వరయ్య అన్నారు. శనివారం ఏఐఎస్ఎఫ్ ఆవిర్భావ దినోత్సవ బహిరంగసభను ఏఐఎస్ఎఫ్ ఏరియా కార్యదర్శి అనిల్ అధ్యక్షతన బహిరంగ సభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జాతీయ మాజీ ఉపాధ్యక్షుడు ఈశ్వరయ్య మాట్లాడుతూ స్వాతంత్ర్యం రాకముందు బ్రిటీష్ పాలనపై వీరోచితంగా పోరాటాలు చేసి విద్యార్థుల సమస్యలను పరిష్కరించడంలో ఏఐఎస్ఎఫ్ ముందుందన్నారు. భారతదేశ స్వాతంత్ర్య సమపార్జన కాకుండా దేశంలో శాంతి, లౌకిక ప్రజాస్వామ్య విలువలు కాపాడాలని, ఈ దేశం ముక్కలు కానివ్వనని అనేక ఉద్యమాలను చేశారన్నారు. 1936 ఆగస్టు 12న ఉత్తరప్రదేశ్ లక్నోనగరంలో భారతదేశ స్వాతంత్ర్య పోరాటంలో దేశానికి సంపూర్ణమైన స్వాతంత్ర్యం మాజన్మహక్కు అని నినదించి, సాదించిన ఏకైక విద్యార్థిసంఖ్య ఏఐఎస్ఎఫ్ అని, ఆనాటి నుంచి నేటి వరకు విద్యార్థుల సమస్యలపై అలుపెరగని సమస్యల పోరాటాలు చేస్తూ, నేడు 82వ వసంతంలోకి అడుగుపెడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ మాజీ జిల్లా నాయకులు వీరశేఖర్, సుబ్బరాయుడు, రాజు, మహేంద్ర, శివరామ్, సూరి, తరుణ్, వినయ్, తదితరులు పాల్గొన్నారు.

అన్నమయ్య కీర్తనలు


వెంకటేశ్వరస్వామిని అలంకరించిన దృశ్యం

పోరుమామిళ్ల : శ్రావణశనివారం పర్వదినాన్ని పురష్కరించుకొని వెంకటేశ్వరస్వామి ఆలయంలో టీటీడీ ఆధ్వర్యంలో శనివారం రాత్రి అన్నమయ్య కీర్తనలను ఆలపించారు. ఈ కార్యక్రమానికి భక్తులు హాజరై ఈ కీర్తనలను పాడారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరస్వామిని అలంకరించి పూజలు నిర్వహించారు.

పోరాటాల్లో ఎస్ఎఫ్ఐ ముందంజ

జమ్మలమడుగు రూరల్: పోరాటంలో ఎస్ఎఫ్ఐ ముందంజలో ఉందని ఆ సంఘం జిల్లా కమిటీ సభ్యుడు వినయ్‌కుమార్ పేర్కొన్నారు. శనివారం జమ్మలమడుగులో జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు సుభహాన్, మునిరాజా, చెన్నయ్య, రాజేష్, వలి, సుబ్బరాయుడు పాల్గొన్నారు.



మానవ మనుగడకు చెట్లే ఆధారం


మొక్కలు నాటుతున్న ఫారెస్టు అధికారులు

కొండాపురం : చెట్లు ప్రగతికి మెట్లు అని ఫారెస్టు అధికారులు అన్నారు. వనమహోత్సవంలో భాగంగా శనివారం స్థానిక శివసాయి హైస్కూల్లో మొక్కలు నాటారు. చెట్లను పెంచడం ద్వారా కాలుష్యాన్ని తగ్గించుకోవచ్చునని మాలమహానాడు జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్‌బాబు పేర్కొన్నారు. చెట్లను నాటడం ద్వారా వర్షాలు సమృద్ధిగా కురుస్తాయని ఈ సందర్భంగా పలువురు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఫారెస్టు అధికారులు శివకుమార్, హుసనయ్య, మరియమ్మ, మాలమహానాడు మండల అధ్యక్షుడు జయంత్, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి సుబ్బయ్య, శివసాయి పాఠశాల ప్రిన్సిపాల్ లక్ష్మి వెంకటరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రాణవాయువునిచ్చేవి చెట్లే- సీఐ


మొక్కలు నాటుతున్న ఎర్రగుంట్ల సీఐ శ్రీనివాసులరెడ్డి

ముద్దనూరు: మానవ మనుగడకు ప్రాణవాయువు ఇచ్చేది చెట్లని, ప్రతి ఒక్కరు మొక్కలను నాటి పెంచాలని ఎర్రగుంట్ల సీఐ శ్రీనివాసులరెడ్డి అన్నారు. బొందలకుంట గ్రామంలోని బసవేశ్వర ఆలయంలో అంతర్జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా శనివారం మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమానికి సీఐ శ్రీనివాసులరెడ్డి పాల్గొని వివిధ రకాల మొక్కలను నాటారు. సీఐ మాట్లాడుతూ యువత దేశానికి ఉపయోగపడే కార్యక్రమాల్లో పాలుపంచుకోవాలన్నారు. ఆలయ అర్చకులు అనిల్‌కుమార్, వీరభద్రారెడ్డి, సుధాకర్, మారుతీకుమార్, మురళి, మునీంద్ర, నాగలింగమయ్య పాల్గొన్నారు.

రేపు కృష్ణాష్టమి వేడుకలు


పద్మావతి నగర్‌లోని శ్రీవేంకటేశ్వరాలయం

ఎర్రగుంట్ల: కోగటం రస్తా పద్మావతినగర్‌లో వెలసిన శ్రీలక్ష్మీవేంకటేశ్వరాలయంలో సోమవారం ఉదయం శ్రీకృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ ఛైర్మన్ రామాంజనేయులు తెలిపారు. ఉట్టికొట్టడంతో పాటు, విద్యార్థులకు ఆటలపోటీలు కూడా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. భక్తులు విరివిగా పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. 19వ తేదీ ఉదయం 10.30గంటలకు శ్రావణ మాస కల్యాణోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భక్తులు రూ.516చెల్లించి రశీదు తీసుకోవాలన్నారు. కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులకు తిరుమల లడ్డు, జాకెట్ ఇవ్వనున్నట్లు రామాంజనేయులు వివరించారు.

వీటిని రోడ్లంటారా?

గుంతలు తేలిన రోడ్లు.. ● నిల్వచేరిన వర్షపు నీరు ● ఇబ్బందుల్లో ప్రజలు

రోడ్ల గతి ఇలా ఉంటే మన ప్రగతి ఎలా ఉంటుందో వేరే చెప్పనక్కర్లేదు.. రోడ్డంతా గుంతలు ఆపై నిండుగా వాన నీరు.. ఏ గుంత ఎంత లోతు ఉంటుందో తెలియని అయోమయ పరిస్థితి. ఇంత దారుణంగా రోడ్లు ఉంటే వాహనదారులు ఎలా వెళతారు. అందుకే అక్కడికి వచ్చేటప్పటికి దారి వెతుక్కోవాల్సి వస్తోంది. బురదనీరు పడి దుస్తులు, వాహనాలు రంగులు మారుతున్నాయి.. పాదచారులకూ అవస్థలే.. ఇది ఎక్కడో ఒకచోట కాదు ముద్దనూరంతా ఇలాగా ఉంది.


కొత్తకొట్టాలు వీధిలో...


తలారి (పెద్దమ్మతల్లి)వీధిలో...


ముద్దనూరు పోలీస్‌స్టేషన్ వద్ద రోడ్డు దుస్థితి

ముద్దనూరు: పేరుకే మేజర్ గ్రామ పంచాయతీ. అందులోను రాష్ట్ర పంచాయతీరాజ్ ముఖ్య కార్యదర్శి జవహర్‌రెడ్డి దత్తత గ్రామం అయినా గ్రామంలో సమస్యలు తిష్ట వేశాయి. ప్రతి వీధిలో రోడ్లు అధ్వానంగా, ప్రజలకు అసౌకర్యంగా ఉన్నాయంటే, అధికారుల, నాయకుల నిర్లక్ష్యమే కారణమని ప్రజల నుంచి భారీగా విమర్శలు వెల్లువెత్తున్నాయి. ముద్దనూరు మేజర్ గ్రామ పంచాయతీలో దాదాపు 10వేల పైచిలుకు జనాభా ఉంది. 3వేల కుటుంబాలు నివాసం ఉన్నాయి. గ్రామంలో పలు సమస్యలు ఉన్నాయి, ప్రధానంగా రహదారులు అధ్వానంగా ఉన్నాయని ప్రజలు అంటున్నారు. కొన్ని వీధుల్లో సిమెంట్ రోడ్డు ఉన్నా రోడ్డు సక్రమంగా ఏర్పాటు చేయకపోవడంతో వర్షపు నీరు రోడ్డు పైనే నిలబడుతుంది. కొన్ని చోట్ల ప్రధాన రహదారులు అధ్వానంగా ఉన్నాయి. దీంతో ప్రజలు చాల ఇబ్బందులు పడుతున్నారు. కొత్త కొట్టాలు వీధి, తలారి(పెద్దమ్మ తల్లి) వీధి, ప్రొహిబిషన్ ఎక్సైజ్ సమీపంలోని బాలుర ఉన్నత పాఠశాలకు వెళ్లే వీధిలో మరికొన్ని చోట్ల సిమెంట్ రోడ్ల పైనే నీరు నిలిచి కుంటను తలపిస్తున్నాయి. కొద్ది రోజులుగా నీరు నిల్వ ఉండటంతో కంపుకొడుతున్నాయి. ఆ నీటిలోనే ప్రజలు ముక్కున వేలేసుకుని అతికష్టంగా రాకపోకలు సాగిస్తున్నారు. రోడ్డుకు ఇరువైపులా ఉన్న స్థానికులు కంపును భరించలేకపోతున్నామంటున్నారు. పులివెందుల రహదారిలోని పోలీస్ స్టేషన్ వద్ద రోడ్డును మరమ్మత్తుల కోసం కుదిపివేయడంతో అక్కడ వాననీరు చేరింది. వాహన చోదకులు ఎటువెళ్లాలో తెలియని పరిస్థితి. ఆర్టీపీపీ రహదారిలో చాలా కాలంగా అధ్వానంగా ఉండటంతో వర్షం పడితే చాలా ఇబ్బందులు పడుతున్నారు.

హలో.. ఆంధ్రజ్యోతి

● మీ సమస్యలుంటే ఈ కింది నంబర్లకు ఫోన్ చేసి సమాచారం ఇవ్వగలరు.

● ఎర్రగుంట్ల - 9441112349
● ముద్దనూరు - 8099575259
● జమ్మలమడుగుటౌన్ - 9948300003
● జమ్మలమడుగురూరల్ - 9848855313
● మైలవరం - 9912265711
● పెద్దముడియం - 9494835608
● కొండాపురం - 9440941345

స్వాతంత్ర్య దినోత్సవానికి ఆహ్వానం

ఎర్రగుంట్ల: ఎర్రగుంట్ల నగరపంచాయతీలో 15వ తేదీ మంగళవారం స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా ఉదయం 8గంటలకు ఛైర్మన్ ముసలయ్య త్రివర్ణపతాకాన్ని ఆవిష్కరిస్తున్నట్లు కమిషనర్ విజయసింహారెడ్డి తెలిపారు. ఇతర గౌరవ సభ్యులు, సిబ్బంది తప్పక హాజరుకావాలని ఈ సందర్భంగా ఆయన పిలుపునిచ్చారు.

విద్యారంగ సమస్యల పరిష్కారానికి ఏఐఎస్ఎఫ్ కృషి

ప్రొద్దుటూరు టౌన్: విద్యార్థులు విద్యారంగ సమస్యల పరిష్కారానికి ఏఐఎస్ఎఫ్ ముందుంటుందని ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు నాగరాజు తెలిపారు. నడింపల్లె హాస్టల్లో ఏఐఎస్ఎఫ్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలనునుసరించి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వాలు అందరికి విద్య అందించాలన్న నినాదంతో 1936 ఆగస్టు 12న లక్నోలో ఏఐఎస్ఎఫ్ ఆవిర్భవించిందన్నారు. బ్రిటీష్‌వారికి వ్యతిరేకంగా పోరాడిన చరిత్ర ఏఐఎస్ఎఫ్‌దన్నారు. విద్యారంగానికి అధిక బడ్జెట్ కేటాయించేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తెస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు వెంకటేష్, డేవిడ్, రాజు, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

జమ్మలమడుగు

టీపీఆర్:	జయజానకి నాయక
టీఎన్ఆర్:	ఫిదా
సాయిరాం :	మాయామహల్

ఏఈ శ్రీనివాసులరెడ్డికి పలువురి అభినందన

ప్రొద్దుటూరు పుట్టపర్తి సర్కిల్: జిల్లాలో విద్యుత్తు శాఖలో ఉత్తమ ఏఈగా ఎంపికైన ప్రొద్దుటూరు వెస్ట్ సెక్షన్ ఏఈ శ్రీనివాసులరెడ్డిని శనివారం పలువురు అభినందించారు. అన్ని విభాగాల్లో ఉత్తమ పనితీరు సాధించిన ఏఈ శ్రీనివాసులరెడ్డిని స్వాతంత్ర్య దినోత్సవం పురస్కరించుకుని ఉత్తమ ఏఈకి ఎస్పీడీసీఎల్ ఉన్నతాధికారులు ఎంపిక చేశారు. ఈ మేరకు ఈనెల 15న తిరుపతిలో సీఎండీ ద్వారా అవార్డును అందుకుంటున్నారు. ఆయన్ను ప్రొద్దుటూరు డీఈ విజయన్, ఏడీఈలు శ్రీనివాసులరెడ్డి, రమణారెడ్డి, ఏఈలు అభినందించారు.

రక్తదానంలో యువత భాగస్వామ్యం కీలకం



రక్తదానం చేస్తున్న వారితో డాక్టర్ వారణాశి ప్రతాప్‌రెడ్డి

కడప, కోటిరెడ్డిసర్కిల్: దేశజనాభాలో సగభాగం ఉన్న యువతే రక్తదానానికి కీలకమని, అందువల్ల ప్రతి యువకుడు రక్తదానం చేసి విలువైన ప్రాణాలను కాపాడాలని సువర్ణభారతి చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు డాక్టర్ వారణాశి ప్రతాప్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం కడప పాతబస్టాండ్ సమీపంలోని కడప డయాబెటీస్ హాస్పిటల్‌లో ప్రపంచ యువకులరోజును పురస్కరించుకుని సువర్ణ భారతి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రోజూ జిల్లాలో 100 మంది పైచిలుకు రోగులకు చికిత్స నిమిత్తం రక్తం అవసరమై దొరకక ఎంతో ఇబ్బంది పడుతున్నారన్నారు. అటువంటి వారిని ఆదుకోవాల్సిన బాధ్యత యువతపై ఉందన్నారు. రక్తం అనేది తయారు చేసే పదార్థం కాదని, అది ఒక స్వచ్ఛంద రక్తదాత నుంచే పొందాలన్నారు. ఈ సందర్భంగా బ్లడ్2లివ్ సంస్థ వ్యవస్థాపకుడు పట్టుపోగుల పవన్‌కుమార్ మాట్లాడుతూ యువత రక్తదానం చేసేందుకు అపోహలు వీడి ముందుకు రావాలన్నారు. 18 ఏళ్లు దాటి 45 కిలోల బరువు ఉంటే 12.5గ్రాముల హిమోగ్లోబిన్ కలిగిన ఆరోగ్యవంతమైన యువతీ, యువకులు ప్రతి 3నెలలకు ఒకసారి రక్తదానం చేయవచ్చునన్నారు. కార్యక్రమంలో రిమ్స్ బ్లడ్ బ్యాంక్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ గురవయ్య, రోటరిక్లబ్ సభ్యుడు తాజుద్దీన్, దాతలు జావిద్, మహేష్, సింధు, రాజా, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సాయిశ్రీ హాస్పిటల్ ప్రారంభోత్సవం



హాస్పిటల్ ప్రారంభిస్తున్న దృశ్యం

కడప, ఎర్రముక్కపల్లె: కడప పాతమున్సిపల్ కార్యాలయం ఎదురుగా సాయిశ్రీ హాస్పిటల్‌ను ప్రముఖ దంత వైద్య నిపుణులు డా.ఎం.రాజగోపాల్‌రెడ్డి అసిస్టెంట్ ప్రొ...అమానుల్లా, రబ్బానీబేగం శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అత్యాధునిక వసతులతో హాస్పిటల్ రూపొందించారన్నారు.

ప్రజలకు 24 గంటలు అందుబాటులో ఉంటుందని వై.వెంకటసుబ్బారెడ్డి, అల్తాఫ్ హుస్సేన్ తెలియజేసారు. హెల్త్‌సెంటర్ సేల్స్ ఎగ్జిక్యూటివ్ ఎస్.కరీముల్లా, పీఏఎన్ఎం ల్యాబ్స్ సేల్స్ ఎగ్జిక్యూటివ్స్ బీఎస్ ఇక్బాల్‌బాష తదితరులు పాల్గొన్నారు.

గురుకుల్ విద్యాపీఠ్‌లో ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు



వివిధ వేషదారుణలతో చిన్నారులు, పాఠశాల డైరెక్టర్ ఎ.వీరకుమారి

కడప ఎర్రముక్కపల్లె: కడప నగరం ఎన్జీఓ కాలనీ పాతబైపాస్ రోడ్‌లోని గురుకుల్ విద్యాపీఠ్‌లో శనివారం కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. చిన్నికృష్ణుడు చిన్నిచిన్ని అడుగులతో, గోపికల వేషాధారణలతో విద్యార్థులు ఆడుతూ పాడుతూ ఆనందంగా గడిపారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ ఎ.వీరకుమారి చిన్నారులకు పండుగ విశిష్టతను తెలిపారు. చిన్నారులందరూ తమ వేషాధారణలతో ఎంతో అలంకరించారని సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జోజయ్య నాయుడు, ప్రైమరీ స్కూల్ ప్రిన్సిపాల్ గంగాదేవి, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఆపరేషన్‌కు 'మేముసైతం' సభ్యుల ఆర్థిక సాయం

కడప, ఎర్రముక్కపల్లె: నగరంలోని ప్రకాష్‌నగర్ నిరాశ్రయుల ఆశ్రమంలో వుంటున్న నాగరాజు మూత్రకోశవ్యాధితో బాధపడుతున్నాడు. అతని ఆపరేషన్‌కు మేముసైతం సభ్యులు ఆర్థికసాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హుబ్లికి చెందిన నాగరాజు తల్లిదండ్రులు లేకపోవడంతో కడపకు వచ్చి ఎనిమిది నెలల నుంచి నిరాశ్రయుల ఆశ్రమంలో వుంటున్నాడు. అతడు నెల రోజుల నుంచి మూత్రకోశ వ్యాధితో బాధపడుతున్నాడు. నిర్వాహకులు ఆస్పత్రిలో చూపించగా డబ్బు ఖర్చవుతాయని తెలియజేయడంతో వారు తమను ఆశ్రయించారని నాగరాజును నగరంలోని ప్రైవేటు ఆస్పత్రిలో చూపించగా రూ.25వేలు ఖర్చవుతాయని తెలిపారన్నారు. చివరకు ఆపరేషన్ చేయించామన్నారు.

ఘనంగా ఓరియన్‌టేషన్ తరగతులు ప్రారంభం



సైకాలజిస్ట్ ఓ.వెంకటేశ్వరరెడ్డిను సన్మానిస్తున్న కళాశాల ఛైర్మన్ లేవాకు నితీష్‌కుమార్‌రెడ్డి

కడప, కోటిరెడ్డిసర్కిల్: కడప నగరం రామచంద్రాపురంలోని బాలాజీ ఎంబీఏ కళాశాలలో శనివారం ఘనంగా ఓరియన్‌టేషన్ తరగతులు ప్రారంభించారు. జూనియర్ విభాగం 180 విద్యార్థులు, సీనియర్ విభాగం ఇన్‌చార్జ్ విద్యార్థులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కడప ప్రముఖ సైకాలజిస్ట్ ఓ.వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ కడపలోనే అత్యుత్తమ విద్యను అందిస్తున్న బాలాజీ కళాశాలలో ఎంబీఏ చేయనున్న విద్యార్థులు తమలో ఉన్న శక్తిని మేల్కొల్పుతూ తప్పక విజయం సాధిస్తారని ఉదాహరణలతో వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.నూర్జియా నస్రీన్ చీమకు ఉన్న క్రమశిక్షణ మనం అలవరుచుకుంటే విద్య మిమ్ములను వరిస్తుందన్నారు. కార్పొరేట్ రంగంలో ఎంబీఏకు ఎంతో ప్రాముఖ్యత ఉందన్నారు. కళాశాల ఛైర్మన్ లేవాకు నితీష్‌కుమార్‌రెడ్డి కొన్ని ఉదాహరణలతో విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. కార్యక్రమంలో హెచ్‌ఓడీ బి.లక్ష్మి, నవనీత్, డీన్ చంద్రిక, సుబ్రహ్మణ్యం, హిమ్మత్, సురేంద్ర, కవిత, సంపత్, రహీం, పుల్లయ్య, శేఖర్, రియాజ్, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎమ్మెల్యే పుట్టిన రోజు వేడుకలు



కేక్‌కట్ చేస్తున్న అంజాద్‌బాష, అల్‌షిఫాలో పండ్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

కడప, ఎర్రముక్కపల్లె: కడప శాసనసభ్యుడు ఎస్‌బీ అంజాద్‌బాష పుట్టిన రోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. కడప ఎమ్మెల్యే కార్యాలయంలో భారీ ఎత్తున ఏర్పాటు చేసిన కేక్‌ను కట్ చేశారు. పలువురు నేతలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు.

మైనార్టీ నేతల ఆధ్వర్యంలో....

కడప మైనార్టీ నేతలు షఫీ 36వ డివిజన్ ఇన్‌చార్జి రఫీ, 38వ డివిజన్ ఇన్‌చార్జి సికిందర్ ఆధ్వర్యంలో కేక్ కటింగ్ నిర్వహించారు. అలాగే తారీక్ అఫ్రిది క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. కార్పొరేటర్లు పాకా సురేష్, షంషీర్, బోలాపద్మావతి, శివకోటిరెడ్డి, రామలక్ష్మణరెడ్డి, ఎంఎల్ఎన్ సురేష్, రాజశేఖర్ పాల్గొన్నారు.

అల్‌షిఫాలో...

కడప అల్‌షిఫా మానసిక వికలాంగుల శరణాలయంలో వైసీపీ నేత జాకీర్ ఆధ్వర్యంలో పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కరీముల్లా, హరూన్‌బాబు, పత్తిరాజేశ్వరి, వెంకటసుబ్బమ్మ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ నేతలు శుభాకాంక్షలు

నకాష్ వైసీపీ నేత దుర్గాప్రసాద్, అయూబ్ శాలువా కప్పి బొకేతో శుభాకాంక్షలు తెలిపారు. మైనార్టీ నగర కమిటీ ఆధ్వర్యంలో పుష్పగుచ్ఛంతో శుభాకాంక్షలు తెలిపారు. షేక్ ఇస్మాయిల్ బాష, కరీముల్లా, షఫీ, అయూబ్ పాల్గొన్నారు.

లిటిల్‌ఫ్లవర్ స్కూల్‌లో ముందస్తు క్రిష్ణాష్టమి వేడుకలు



వేషధారుణలతో చిన్నారులు, పాఠశాల ఛైర్మన్ చంద్రమౌళిరెడ్డి, డైరెక్టర్ రాజారెడ్డి

కడప ఎర్రముక్కపల్లె: కడప నగరం హౌసింగ్ బోర్డుకాలనీలోని లిటిల్‌ఫ్లవర్ స్కూల్‌లో ముందస్తు కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో స్కూల్ ఛైర్మన్ చంద్రమౌళిరెడ్డి మాట్లాడుతూ పిల్లందరూ శ్రీకృష్ణుని ఆదర్శంగా తీసుకుని భవిష్యత్తులో మంచిగా ఎదగాలన్నారు. డైరెక్టర్ రాజారెడ్డి మాట్లాడుతూ చిన్నప్పటి నుంచి పిల్లలు క్రమశిక్షణతో మెలిగి శ్రీకృష్ణుడు చెప్పిన భగవద్గీత సారాన్ని పాటిస్తే మంచి ఫలితాలు సాధించవచ్చన్నారు. పిల్లలకు మిఠాయిలు పంచి, బహుమతులు అందిజేసి కృష్ణాష్టమి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ భాస్కర్‌రెడ్డి, హెడ్‌మిస్సెస్ వసంత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు లింగాలలో ఉచిత వైద్యశిబిరం

లింగాల: లింగాల జడ్పీ హైస్కూల్‌లో ఆదివారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. పులివెందులలోని డాక్టర్ ఈసీ గంగిరెడ్డి హాస్పిటల్ ఆధ్వర్యంలో డాక్టర్ నాగార్జున ఉచిత వైద్యశిబిరంలో వైద్యపరీక్షలు నిర్వహిస్తారన్నారు. ఈ శిబిరంలో ఆస్తమా, ఊపిరితిత్తుల సమస్యలు, బీపీ, అలర్జి, థైరాయిడ్, మూర్ఛవ్యాధి, గుండెజబ్బులు, గ్యాస్ట్రబుల్, కామెర్ల తదితర జబ్బులకు ఉచితంగా వైద్యపరీక్షలు నిర్వహిస్తారన్నారు. షుగర్ వ్యాధిగ్రస్తులకు ప్రత్యేక చికిత్స ఉంటుందన్నారు. మండల ప్రజలు వైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు కోరారు.

అభివృద్ధి పథంలో 'చెత్తనుంచిసంపద' కేంద్రం




సింహాద్రిపురం శిక్షణలో సూచనలిస్తున్న అధికారులు, హాజరైన అధికారులు

సింహాద్రిపురం: స్వచ్ఛభారత్‌లో భాగంగా ఎంపికైన సింహాద్రిపురంలో ఏర్పాటు చేసిన చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం అభివృద్ధి పథంలో నడుస్తోంది. ఈ కేంద్రంలో కడప జిల్లానే కాకుండా ఇతర జిల్లాల అధికారులకు సైతం శిక్షణ ఇస్తున్నారు. ఒడిదుడుకులతో మొదలైన ఈ కేంద్రం మూడు పువ్వులు ఆరు కాయలుగా చక్కటి వాతావరణాన్ని తలపిస్తోంది. ఈ కేంద్రం అభివృద్ధికి సర్పంచు లక్ష్మి పద్మజ, ఉపసర్పంచు రామ్మోహన్‌రెడ్డి కృషి ఎంతో ఉందని చెప్పవచ్చు. సింహాద్రిపురం పంచాయితీలో 60శాతం శుభ్రతను చూపించేలా వీధులు కనిపిస్తున్నాయి. ఇక్కడ జరిగే ఇతర జిల్లాల నుంచి వచ్చే అధికారులను శిక్షణలో భాగంగా ప్రత్యేక దుస్తులతో పురవీధుల వెంట తిరుగుతున్నారు. అలా చేస్తున్నందున ప్రజల్లో కూడా పరిశుభ్రతపై మార్పు వచ్చింది. ఏదిఏమైనా చెత్త నుంచి సంపద తయారీ కేంద్రంలో ఆర్థిక పరిపుష్టి ఒనగూరినట్లు తెలుస్తోంది. వృథాగా పోయే ప్రతి వస్తువును సేకరించి ఈ కేంద్రంలో కూలీల ద్వారా తడి చెత్త, పొడిచెత్తలను వేరుచేసి వాటి నుంచి ఆదాయవనరులు పొందేందుకు అవకాశం ఉంది. తడిచెత్త నుంచి వానపాముల ఎరువులు తయారు చేయడం, పొడి చెత్త, అట్టముక్కలు, గాజుపెంకులు, ప్లాస్టిక్ కవర్లు, వస్తువులు తదితరవాటిని గుజిరీకి అమ్మి ఆర్థికంగా పంచాయతీకి ఆదాయం చేకూరనుంది. ఈ కేంద్రానికి కడప జిల్లాలోనే ప్రత్యేక స్థానం ఉండడం గర్వించదగ్గ విషయం. ఈ కేంద్రంలో పచ్చనిచెట్లతో పార్కును తలపిస్తోంది. ఇతర జిల్లాల నుంచి వచ్చిన అధికారులు సంతృప్తిని వ్యక్తం చేసి వెళుతున్నారు.

ఇ-క్రాప్ బుకింగ్ చేయించుకోవాలి



వేరుశనగ పంటను పరిశీలిస్తున్న జేడీఏ ఠాకూర్‌నాయక్

లింగాల: మండల రైతులు ఇ-క్రాప్ బుకింగ్ చేయించుకోవాలని వ్యవసాయశాఖ జాయింట్ డైరెక్టర్ ఠాకూర్‌నాయక్ సూచించారు. శనివారం లోపట్నూతల, కర్ణపాపాయపల్లె గ్రామాల్లో సాగుచేసిన వేరుశనగ, పత్తి, పొద్దుతిరుగుడు, మినుము, కంది పంటలను పరిశీలించారు. సాగు వివరాలు, పంట పరిస్థితిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జేడీఏ మాట్లాడుతూ మండలంలో ఈ ఏడాది లోటువర్షపాతం ఉన్నందున వేరుశనగ పంట బెట్టపరిస్థితిలో ఉందన్నారు. రైతులు 2శాతం యూరియా ద్రావణాన్ని వేరుశనగపంటకు పిచికారీ చేయాలని సూచించారు. ఇ-క్రాప్ బుకింగ్ గురించి రైతులకు తెలియజేశారు. ఇ-క్రాప్ బుకింగ్‌లో వ్యవసాయశాఖపై 25శాతం మాత్రమే ఉంటుందన్నారు. మిగిలిన 75శాతం రెవెన్యూ శాఖపై ఉంటుందన్నారు. ఇ-క్రాప్ బుకింగ్ చేయించుకుని యెడల వ్యవసాయశాఖ బాధ్యత వహించదన్నారు. వాతావరణ బీమా గురించి జేడీఏను రైతులు అడగ్గా బ్యాంకులకు డబ్బు పంపామన్నారు. 10 రోజుల్లో రైతుల ఖాతాల్లో జమచేస్తారన్నారు. ఏఓ నాగభూషణంరెడ్డి, ఏఈఓ హరిశిల్ప, ఎంపీఈఓ పాల్గొన్నారు.

ఒంగోలు ట్రిపుల్‌ఐటీ హాస్టల్‌లో మంచాల ఏర్పాటు

300 మందికే వేయాల్సి ఉంది : ఏఓ



బాలికల హాస్టల్ గదుల్లో ఏర్పాటు చేసిన మంచాలు

వేంపల్లె: వేంపల్లె మండలం ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీ పాత క్యాంపస్‌లో నిర్వహిస్తున్న ఒంగోలు ట్రిపుల్‌ఐటీ హాస్టల్ గదుల్లో మొదటి సంవత్సరం విద్యార్థులకు మంచాలు, బెడ్లు ఇతర అవసరమైన వస్తువులను సమకూర్చామని పరిపాలన అధికారి మెహబూబ్ జిలాని పేర్కొన్నారు. ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన 'ఒంగోలు ట్రిపుల్‌ఐటీలో అందని ల్యాప్‌టాప్‌లు, సమకూరని వసతులు' కథనంపై స్పందించిన ఏఓ ఆంధ్రజ్యోతితో మాట్లాడారు. ప్రస్తుతం మొదటి ఏడాది 600 మంది విద్యార్థులకు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. మొదటగా బాలికల హాస్టల్‌లో సమకూర్చామన్నారు. ఇంకా 300 మంది విద్యార్థులకు మంచాలను మాత్రమే ఏర్పాటు చేయాల్సి ఉందని త్వరలోనే వాటిని ఏర్పాటు చేస్తామన్నారు. ల్యాప్‌టాప్‌ల విషయం యూనివర్సిటీ నిర్ణయం తీసుకోవాల్సి ఉందన్నారు.

క్రీడల్లోనూ రాణించాలి

అక్షర కళాశాలలో క్రీడా పోటీలు ప్రారంభం

వేంపల్లె: చదువుతో పాటు క్రీడల్లోనూ రాణిస్తే మంచి అవకాశాలు ఉంటాయని, ముఖ్యంగా మహిళలకు ఎక్కువ అవకాశాలు దొరుకుతాయని జగన్ సేవా సమితి అధ్యక్షుడు ఆర్ శ్రీను, దేవస్థాన మాజీ సభ్యులు కటిక నాగరాజ పేర్కొన్నారు. వేంపల్లె అక్షర మహిళా జూనియర్ కళాశాలలో ఆగష్టు 15ను పురస్కరించుకుని క్రీడా పోటీలను శనివారం ప్రారంభించారు. కబడ్డీ పోటీలను ఆర్ శ్రీను, నాగరాజ ప్రారంభించి విద్యార్థులను అభినందించారు. కబడ్డీ, టెన్నికాయిట్, షటిల్, లాంగ్‌జంప్, హైజంప్, డిస్కస్ త్రో, లెమన్ స్పూన్ వంటి పోటీలు నిర్వహిస్తున్నట్లు కరస్పాండెంట్ భారతి, కళాశాల వ్యవస్థాపకులు శ్రీనాథ్ తెలిపారు.

అంజన్నకు ప్రత్యేక పూజలు



తొండూరు: శ్రావణ మూడో శనివారం పాటిమీద ఆంజనేయస్వామి ఆలయంలో స్వామివారికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయాన్నే ఆలయ అర్చకుడు నాగరాజ శర్మ స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి, అభిషేక పూజలు చేశారు. అనంతరం భక్తులు ఆకుపూజ తదితర పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారికి పూజలు చేశారు.

నంద్యాలలో టీడీపీ విజయం తథ్యం



విలేకరులతో మాట్లాడుతున్న జిల్లా అధికార ప్రతినిధి హేమాద్రిరెడ్డి

పులివెందుల టౌన్: నంద్యాల ఉప ఎన్నికలో తెలుగుదేశం పార్టీ విజయం తథ్యమని జిల్లా అధికార ప్రతినిధి హేమాద్రిరెడ్డి పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో పట్టణ అధ్యక్షుడు మహబూబ్ బాషతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడుతూ సమస్యలతో ఉన్న నంద్యాలను టీడీపీ ప్రభుత్వం కోట్లాది రూపాయలతో సుందరీకరణ పనులు చేస్తుంటే ప్రతిపక్షనేత వైఎస్ జగన్, ఆయన పార్టీ వారు అభివృద్ధిని విమర్శించడం తగదన్నారు. ఈ విమర్శలను నంద్యాల ప్రజలు నమ్మే పరిస్థితుల్లో లేరన్నారు. ముఖ్యమంత్రిపై వివాదాస్పద వ్యాఖ్యలు చేస్తే వైసీపీ పతనం తప్పదన్నారు. నంద్యాల ఉప ఎన్నికలో గెలుపు భూమావారిదేనన్నారు. టీడీపీ హయాంలో రైతులకు, డ్వాక్రా మహిళలకు రుణమాఫీ జరిగిందన్నారు. టీడీపీ చేస్తున్న అభివృద్ధే పార్టీని గెలిపిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. వైసీపీ ఉనికి కోల్పోతుందన్నారు. చౌకబారు ఆరోపణలు మానుకోవాలని వైసీపీ నేతలకు హితవుపలికారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు తదితరులు పాల్గొన్నారు.

నిలిచిపోయిన ఎత్తిపోతల పనులు

లింగాల: లింగాల చెరువుకు నీరు సరఫరా చేసే పనులు నిలిపివేశారు. లోపట్నూతల సమీపంలో పంప్‌హౌస్ ఏర్పాటుచేసి అక్కడి నుంచి కిలోమీటర్ మేర మోటార్‌తో అక్కడి నుంచి కాల్వ ద్వారా స్థానిక ఐటీఐ కళాశాల వద్దకు నీరు సరఫరా చేయాలి. మరలా అక్కడ ఓ సంపు ఏర్పాటు చేసి అందులో మోటార్ అమర్చి పైపులతో లింగాల చెరువుకు నీరు సరఫరా చేయాలి. ఈ పనులను 10 రోజుల కిందట మేటాస్ కంపెనీ మొదలు పెట్టింది. అయితే ఐటీఐ కళాశాల వద్ద ఏర్పాటు చేసుకున్న సంపు స్థలం కోల్డ్‌స్టోరేజికి ప్రతిపాదనలు పంపడంతో పనులను నిలిపివేశారు. ఇదే విషయంపై తహసీల్దార్‌ను వివరణ కోరగా సంపు ఏర్పాటు చేస్తున్న స్థలంలో లింగాల రైతుల కోసం కోల్డ్‌స్టోరేజికి ప్రతిపాదనలు పంపారన్నారు. అక్కడ పనిచేస్తున్న నిర్వాహకులు ఆ స్థలం కాల్వ పనులకు సంబంధించిందేనని పత్రాలు చూపిస్తే పనులు జరుపుకోవచ్చునని తహసీల్దార్ ఖాసీంఖాన్ తెలిపారు.



నిలిచిపోయిన లింగాల చెరువు సంపు పనులు

బిడ్డకు తల్లిపాలే ఆరోగ్యం

పులివెందుల టౌన్: పుట్టిన బిడ్డకు తల్లిపాలతో ఆరోగ్యం చేకూరుతుందని జన విజ్ఞాన వేదిక జిల్లా నాయకుడు రామగోపాల్ పేర్కొన్నారు. మున్సిపల్ పరిధిలోని పెద్దరంగాపురంలో తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రసవించిన గంటలోపు బిడ్డకు పాలు తాగించడంతో సంపూర్ణ పోషక విలువలు పెరిగి బిడ్డ ఆరోగ్యంగా ఉంటుందన్నారు. బిడ్డకు పాలుపట్టడం వలన రొమ్ముక్యాన్సర్ రాకుండా ఉంటుందన్నారు. ఏఎన్ఎం కృష్ణవేణి మాట్లాడుతూ బిడ్డ పుట్టిన గంటలోపు ముర్రుపాలు తాగించడంతో వ్యాధినిరోధక శక్తి పెరుగుతుందన్నారు.



మాట్లాడుతున్న జేవీవీ నాయకుడు రామగోపాల్

విద్యుత్ సరఫరాలో నేడు అంతరాయం

మైదుకూరు : పట్టణంలోని కడప, ప్రొద్దుటూరు రోడ్డులో ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయ ఏర్పడనుంది.

మరమ్మతు పనులు చేస్తున్న కారణంగా ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు విద్యుత్‌ను నిలిపివేస్తున్నట్లు ఏపీఎస్పీడీసీఎల్ ఏఈ హరిబాబు శనివారం సాయంత్రం విలేకరులకు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

ప్రతి హిందువుకూ మత ఔన్నత్యం తెలియాలి

● సాధనతో ఏదైనా సాధ్యమవుతుంది ● రాష్ట్ర ధర్మప్రచారక్ సాయిరాం

బ్రహ్మంగారిమఠం : హిందువులు ఔన్నత్యం ప్రతి హిందువుకు తెలియాలని, సాదనవలన ఏపనినైనా సాధించుకోవచ్చని రాష్ట్ర ధర్మప్రచారక్ సాయిరాం పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలోని వీరబ్రహ్మేంద్రస్వామి టూరిజం పార్కు నందు సమరసత సేవాఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో కడప, కర్నూలు, అనంతపురం జిల్లాల నుంచి వచ్చిన మహిళలతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా కడప చిన్మయమిషన్ నిర్వాహకులు ఎస్.చైతన్య మాట్లాడుతూ హిందువుయొక్క గొప్పతనం ప్రతిహిందువుకు తెలియాలని, ప్రతి మనిషి సాధన వలన ఏపనినైనా సాధించుకోవచ్చని, అలాగే తల్లిదండ్రులు పిల్లలకు సంస్కార బీజీలు నాటాలని, దేవాలయ కేంద్రంగా సత్సంగం, భజనలు, జరగాలన్నారు. హైందవ పరిరక్షణకు మాతృమూర్తులు సంకల్పబద్దులు కావడం, మూదాహం తల్లుల పిల్లలకు సంస్కార బీజాలు నాటాలని, జియా ప్రేపరణతో శివాజి చక్రవర్తి అయ్యాడన్నారు. బాలభక్తుల కథల వలన పిల్లలు సంస్కారవంతులవుతారన్నారు. వెలుగుతున్నదీపం దీపాలను వెలిగించగలరన్నారు. పండులు, మనసంస్కృతీ, పార్టీలు, పాశ్చాత్య సంస్కృతి అన్నారు.

అనంతరం రాయలసీమ ధర్మప్రచారక్ ఈశ్వరరెడ్డి, ధర్మపరిరక్షణా ట్రస్ట్ సభ్యులు వెంకటసుబ్బారెడ్డి, జిల్లా ధర్మప్రచారక్ క్రిష్ణ, ఆర్.నాగేశ్వరరెడ్డి డివిజన్ ప్రచాక్‌లు వెంకటేశ్వర్లు, వెంకటేష్, శిక్షణ కార్యక్రమంలో సంప్రదాయ సంస్కృతి, హిందువులు చేయవలసిన పనులు, రాబోయే రోజుల్లో చేయవలసిన పనులు, చేపట్టవలసిన బాధ్యతల గురించ క్లుప్తంగా వివరించారు. అలాగే సమాజంలో ప్రతి హిందువు తమయొక్క గొప్పతనాన్ని ప్రతి ఒక్కరికీ తెలిసేలా అతను దైవ కార్యాలను చేపట్టాలని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల ప్రచారక్‌లు వీరయ్య, గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అతనంతరం శిక్షణాతరగతుల్లో పాల్గొన్న మహిళలకు ప్రసాదాలను అందజేశారు.





మాట్లాడుతున్న రాష్ట్ర ధర్మప్రచారక్ సాయిరాం, సమరసత సేవాఫౌండేషన్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

పట్టించుకోండి...



శాంతినగర్‌లో వొరిగిన విద్యుత్ స్తంభం

మైదుకూరు : పట్టణంలోని శాంతినగర్ నుంచి జోసఫ్‌పేటకు వెళ్లే రహదారిలో ఉన్నటువంటి ఈ విద్యుత్ స్తంభం ఒరిగిపోయి ఉంది. గాలులు వీచినా లేదా భారీ వర్షాలు పడ్డ కూలుతుందేమోనని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఒరిగిన స్తంభం నుంచే విద్యుత్ తీగలు సరఫరా చేస్తుండటంతో ఏప్పుడు కూలు తుందో నని భయం వ్యక్తం చేస్తున్నారు. స్తంభంకు ఇనుప తీగ సపోర్టుగా ఉందని అదే లేక పోతే కూలేందుకు సిద్ధంగా ఉందని స్థానికులు పేర్కొన్నారు. విద్యుత్ బిల్లులు సమయానికి కట్టక పోతే వచ్చి విద్యుత్ సరఫరా ఆపుతారని, ఒరిగిన ఈ విద్యుత్ స్తంభంను మార్చమని చెప్పుతున్నా పట్టించుకోవడం లేదని స్థానికులు పేర్కొన్నారు.

చిన్నారులందరూ రాధా కృష్ణులే...

మైదుకూరు : యూకేజీ నుంచి 5వ తరగతి పిల్లలందరూ రాధాకృష్ణ గోపికలయ్యారు. వారి వేషదారణలో ఆటపాటలాడారు. పట్టణంలోని ఏవీఆర్ స్కూల్‌లో శనివారం ముందస్తు కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు. పాఠశాలలోని చిన్నారులకు శ్రీకృష్ణుడు రాధా, గోపికల వేషాలు వేశారు. శ్రీకృష్ణుడు చేపట్టిన అల్లరి గోపీకలతో ఆడిన ఆట పాటలను చిన్నారులు ప్రదర్శించారు. కాగా పాఠశాలలో విద్యార్థులకు ఆట విడుపుగా ప్రతి ఏడాది కృష్ణాష్ఠమి, క్రిస్మస్ వేడుకలు నిర్వహిస్తుంటారు.



రాధాకృష్ణ గోపికలతో ఏవీఆర్ చిన్నారులు

17 న తహసీల్దారు కార్యాలయం వద్ద ఆందోళన

మైదుకూరు : ఎన్నికల సమయంలో చేసిన వాగ్దానాలను అధికారంలో ఉండి మూడు సంవత్సరాలు అవుతున్నా వాటిని అమలు చేయలేదని, దీనికి నిరసనగా ఈనెల 17న మండల తహసీల్దారు కార్యాలయం వద్ద ఆందోళన చేస్తామని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఏవీ రమణ పేర్కొన్నారు. పట్టణంలోని నంది కళాశాలలో శనివారం కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆచరణకు సాధ్యం కాని వాగ్దానాలను టీడీపీ చేసిందని, వాటిలో కనీసం ఇల్లులేని పేదలకు ఇల్లు ఇవ్వలేని స్థితిలో ఉందని, పింఛన్లు సైతం ఇవ్వలేక పోతోందని తెలిపారు. రేషన్ కార్డులు కావాలంటూ అనేక మంది దరఖాస్తులు పెట్టుకున్నా వాటిని కూడా ఇవ్వలేక పోతున్నారని తెలిపారు. కేవలం సమావేశాలకే అధికారులు పరిమితమవుతున్నారన్నారు. నియోజకవర్గ కార్యదర్శి పి.శ్రీరాములు మాట్లాడుతూ అర్హులైనవారికి 60 గజాల స్థలంతో పాటు ఇల్లు నిర్మించాలని, పింఛన్లు ఇవ్వాలని, బ్యాంకు అప్పులను రద్దు చేయాలని తదితర డిమాండ్లతో ఆందోళన చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఈ ఆందోళనలో కార్యకర్తలందరూ పాల్గొనాలని వారు కోరారు. కాగా సీపీఐ మండల కమిటీ కార్యదర్శిగా బీవి శ్రీనివాసులు నూతన ఎన్నుకున్నారు.

వర్షపునీరు బయటికి పోయో దారేది.?

● విజృంభిస్తున్న సీజనల్ వ్యాధులు

మైదుకూరు రూరల్ : కొద్ది పాటి వర్షానికే మా వీధిలో వర్షపు నీరు నిలబడి చెరువును తలపిస్తోందని నానుబాలపల్లె బీ.సీ కాలనీ వాసులు వాపోతున్నారు. స్థానిక మున్సిపాలిటీ పరిధిలోని బీ.సీ కాలనీ నందు సుమారు 50 కుటుంబాలు బీ.సీలు నివశిస్తున్నారు. కాలనీలో గతంలో దేవాలయం వీధిలో వేసిన సిమెంటు రోడ్డు ఈ మధ్య కాలంలో ప్రధాన రహదారిలో వేసిన కొత్త సిమెంటు రోడ్డు ఎత్తులో ఉండటంతో చిన్న వర్షం పడినా వీధి కాలువలు లేక నీరంతా అలానే వీధిలో నిలిచిపోయి చెరువును తలపిస్తోందని గ్రామస్తులు చెబుతున్నారు. వర్షపునీరు బయటికి పోయో మార్గం లేక నీరంతా వీధిలో నిలిచిపోయి దోమలు విఫరీతంగా వృద్ధి అవుతున్నాయని, దీనితో గ్రామస్తులు విషజ్వరాల బారిన పడుతున్నారని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైన మున్సిపల్ అధికారులు వర్షపునీరు వీధుల్లో నిలవకుండా తగు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.



వీధిలో నిలిచి ఉన్న వర్షపునీరు

హలో.. ఆంధ్రజ్యోతి

మీ ప్రాంతంలో ఉన్న సమస్యలు తెలపాలన్నా, ఇతరత్రా సమాచారం ఇవ్వాలన్నా 'ఆంధ్రజ్యోతి'ని ఈ క్రింది నెంబర్లలో సంప్రదించండి.

మైదుకూరు	9985402559
మైదుకూరు రూరల్	9966229965
ఖాజీపేట	9440925739
దువ్వూరు	9908951022
చాపాడు	8143585271
బ్రహ్మంగారిమఠం	8008965652

సినిమాగైడ్

మైదుకూరు	
విజయ్	లై
భారత్	నేనే రాజు నేనే మంత్రి
వెంకటేశ్వర	జయ జానకి నాయక
ఖాజీపేట	
రాజ్	నక్షత్రం
దువ్వూరు	
రాయల్	శతమానం భవతి

గ్రంథాలయాలకు విశేష కృషి చేసిన రంగనాథన్

ప్రొద్దుటూరు కల్చరల్: గ్రంథపాలకుల పితామహుడైన ఎస్ఆర్ రంగనాథన్ గ్రంథాలయాల అభివృద్ధికి విశేష సేవలందించాలని ఉపాధ్యాయ సంఘాల సమన్వయ వేదిక గౌరవాధ్యక్షులు ఒంటేరు శ్రీనివాసులరెడ్డి కొనియాడారు. శనివారం గ్రంథాలయ రోజును పురస్కరించి ప్రభుత్వ శాఖ గ్రంథాలయంలో ఎస్ఆర్‌రంగనాథన్ చిత్రపటానికి ఒంటేరు, జిల్లా లైబ్రరియన్ సంఘ అధ్యక్షుడు బొబ్బిలు పూలమాలలు వేశారు. స్థానిక లైబ్రేరియన్ అమీరుద్దీన్, ఎర్రగుంట్ల లైబ్రేరియన్ సూర్యప్రకాష్, ఆర్‌సీపీఈ లైబ్రేరియన్ గంగాధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీఎంపై జగన్ వ్యాఖ్యలు సరికాదు

● రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ చైర్మన్ మల్లెల లింగారెడ్డి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మల్లెల లింగారెడ్డి, ముక్తియార్

ప్రొద్దుటూరు పుట్టపర్తి సర్కిల్: ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన హోదాను మరచి సీఎంపై వ్యాఖ్యలు చేయడం సరికాదని, ఆయనపై ప్రభుత్వ అధికారులు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ చైర్మన్ మల్లెల లింగారెడ్డి అన్నారు. శనివారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నంద్యాల ఉప ఎన్నికల ప్రచారంలో జగన్ నిరంతరం సీఎం చంద్రబాబుపై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నాడన్నారు. నడిరోడ్డుపై కాల్చిచంపాలని, ఉరి వేయాలని అంటున్నాడన్నారు. అక్రమాస్తుల కేసులో జైలుకు వెళ్లొచ్చిన జగన్ వారం వారం కోర్టుకు వెళుతున్నాడన్నారు. కోర్టులు సైతం ఎవ్వరిని బహిరంగంగా కాల్చి చంపాలని, ఉరి తీయాలని చెప్పరన్నారు. తలారి సైతం కోర్టు ఆదేశాల మేరకే వ్యవహరిస్తారన్నారు. ఉగ్రవాదులు, తీవ్రవాదులు మాత్రమే రాజ్యంపైనా, పాలకులపైనా కాల్పులు జరుపుతుంటారన్నారు. అటువంటివారు సైతం ఎన్‌కౌంటర్లలో అంతమైపోతుంటారన్నారు. ఇతర రాష్ట్రాల్లోని ప్రతిపక్ష నేతలెవ్వరూ జగన్‌లా అక్కడి సీఎంలను అంతమొందించాలని కోరుకోవడం లేదన్నారు. జగన్ ఉన్మాదిలా వ్యవహరిస్తున్నాడన్నారు. నంద్యాల ఓటర్లు వైసీపీకి, జగన్‌కు తగిన బుద్ధి చెప్తారన్నారు. మాజీ మున్సిపల్ ఇన్‌ఛార్జి చైర్మన్ ముక్తియార్ పాల్గొన్నారు.

సంజీవరాయస్వామికి ప్రత్యేక పూజలు

రాజుపాళెం: ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ చెన్నకేశవ సంజీవరాయస్వామి దేవస్థానంలో శ్రావణమాసం రెండో శనివారం కావడంతో స్వామిని ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు కూడా రద్దీగా ఉండడంతో వారిని స్వామి వారికి దర్శనార్థం అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఈవో మద్దిలేటి, చైర్మన్ దుద్యాల చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు.

దొంగల అరెస్టు-ట్రాక్టర్ల ట్రాలీలు స్వాధీనం



ట్రాక్టర్ ట్రాలీ దొంగలతో సీఐ ఓబులేసు , ఎస్ఐ శ్రీనివాసులు

రాజుపాళెం: ట్రాక్టర్ ట్రాలీ దొంగలను అరెస్టు చేసి మూడు ట్రాలీలను స్వాధీనం చేసుకున్నట్లు రూరల్ సీఐ ఓబులేసు తెలిపారు. శనివారం సాయంత్రం రాజుపాళెంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రాలీ దొంగలు అయిన ఎత్తపు రామసుబ్బారెడ్డి (చిన్నశెట్టిపల్లె), సిగిరెడ్డయ్య (అక్కాయపల్లె, కడప) అనే ఇద్దరు దొంగలను ప్రొద్దుటూరు ఆటోనగర్‌లో అరెస్టు చేసినట్లు పేర్కొన్నారు. 2016 నంబరులో చిన్నశెట్టిపల్లె గ్రామానికి చెందిన బైపిరెడ్డి వెంకటరామిరెడ్డి ఒక ట్రాలీ, 4.8.2017 అదే గ్రామానికి చెందిన ఈశ్వర్‌రెడ్డిది ఒక ట్రాలీ, అర్కటవేముల గ్రామానికి చెందిన ఒక ట్రాలీని వీరి వద్ద నుంచి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వీరు గతంలో పాత ట్రాక్టర్ల వ్యాపారం చేసేవారని, వ్యాపారంలో నష్టం రావడంతో ట్రాలీల దొంగతనానికి పాల్పడిన ఆయన వివరించారు. దొంగలను పట్టుకునేందుకు కృషి చేసి రాజుపాళెం ఎస్ఐ శ్రీనివాసులు, చాపాడు ఎస్ఐ శివశంకర్, హెడ్‌కానిస్టేబుల్ గంగాధర్‌యాదవ్, కానిస్టేబుల్ లక్ష్మికాంతరెడ్డికి ఉన్నతాధికారులచే రివార్డులు అందిస్తారన్నారు.

తెలుగు మీడియం కొనసాగించాలి

● 16న మున్సిపల్ చైర్మన్ చాంబర్ ముట్టడి-జయశ్రీ



కార్యక్రమంలో మాట్లాడుతున్న జయశ్రీ

ప్రొద్దుటూరు అర్బన్: మున్సిపల్ స్కూళ్లలో తెలుగుమీడియంను కొనసాగించాలని పేదలకు ప్రభుత్వ విద్యను దూరం చేయవద్దని మానవ హక్కుల వేదిక కన్వీనర్ జయశ్రీ పేర్కొన్నారు. శనివారం విలేకరులతో జయశ్రీ మాట్లాడుతూ మున్సిపల్ స్కూళ్లకు తెలుగు మీడియం పుస్తకాలు సరఫరా చేయకుండా మూడు నెలలు నిలబెట్టిందన్నారు. అందరూ ఇంగ్లీషుమీడియం చదవాలని ఒత్తిడి పెంచిందన్నారు. దీంతో విద్యార్థులు బడి మానేస్తామని ఆందోళన చేయడం, విద్యార్థి సంఘాలు ప్రభుత్వం దృష్టికి తేవడంతో ప్రస్తుతానికి తెలుగుమీడియం పుస్తకాలు పంపిందన్నారు. కానీ మళ్లీ పరీక్షలు ఏ మీడియంలో రాస్తారని ప్రశ్నాపత్రాలు ఇంగ్లీషుమీడియం మాత్రమే పంపడం వలన ఇంగ్లీషుమీడియంనే కొనసాగించాలనే తెలుగుమీడియంకు స్వస్తి చెప్పాలని చూస్తున్నారన్నారు. ప్రభుత్వం మున్సిపల్ స్కూళ్లలో తెలుగుమీడియం కొనసాగిస్తున్నట్లు స్పష్టమైన ఉత్తర్వులు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఆగస్టు 16న మున్సిపల్ చైర్మన్ చాంబర్ ముట్టడి కార్యక్రమం చేపట్టనున్నట్లు తెలిపారు. మున్సిపల్ స్కూలు విద్యార్థులు, విద్యార్థి సంఘాలు పాల్గొంటారన్నారు. సమావేశంలో విరసం రాష్ట్ర కార్యదర్శి వరలక్ష్మి, రచయిత జింకా సుబ్రమణ్యం, జేవీవీ అధ్యక్షులు రాంగోపాల్, ఆర్ఎస్ఎఫ్ కన్వీనర్ భాస్కర్, ఓబులేసు పాల్గొన్నారు.

ఉద్యానవనాల ఏర్పాటు

ప్రొద్దుటూరు అర్బన్: ప్రొద్దుటూరు పట్టణంలో సుందరమైన ఉద్యానవనాలు ఏర్పాటు చేసి ప్రజలకు మంచి ఆహ్లాదకర వాతావరణం అందించడమే ధ్యేయమని మున్సిపల్ చైర్మన్ ఆసం రఘురామిరెడ్డి పేర్కొన్నారు. శనివారం ఏపీ అర్బన్ గ్రీనరీ అండ్ బ్యూటీఫికేషన్ ఎండి చంద్రమోహన్‌రెడ్డి ప్రొద్దుటూరులోని గాంధీ పార్కు, థర్డ్ కాలనీ రామేశ్వరం, బొల్లవరంలో ఏర్పాటు చేయనున్న ఉద్యానవనాల స్థలాలను పరిశీలించారు.

నగదు పట్టుకున్నారు.. వదిలేశారు

పెద్దముడియం: మండల పరిధిలోని చెక్‌పోస్టు వద్ద పోలీసులు శనివారం రూ.3.50 లక్షలు నగదు పట్టుకుని అనంతరం ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వదిలేశారు. ఈ సంఘటనకు సంబందించి వివరాలు ... ముద్దనూరు మండలానికి చెందిన గంగాధర్ అనే వ్యక్తి కారులో వెళుతుండగా గుండ్లకుంట తనిఖీ కేంద్రం వద్ద పోలీసులు వాహనాన్ని తనిఖీ చేయగా అందులో రూ.3.50 లక్షలు నగదు కనిపించింది. వెంటనే ఆ సొమ్మును స్వాధీనం చేసుకుని ఉన్నతాధికారులకు తెలియజేశారు. సొమ్ముకు సంబంధించిన వ్యక్తి తాను ఎల్ఐసీ ఏజెంట్‌నని, పాలసీదారుల ప్రీమియం కట్టేందుకు తీసుకెళుతున్నాని చెప్పాడు. అయితే తమకు సంబంధం లేదని, ఉన్నతాధికారులు ఆ విషయం చూసుకుంటారని సిబ్బంది తెలుపడంతో ఆ కథ రూరల్ సీఐ వద్దకు చేరింది. అక్కడకు నగదు సంబందించిన వ్యక్తి, ఎల్ఐసీ అధికారులు చేరుకుని సీఐతో మాట్లాడారు. ఆ నగదు పాలసీదారులకు సంబందించిదని ఎల్ఐసీ అధికారులు తెలుపడంతో పోలీసులు వదిలేశారు. రూరల్ సీఐ ఉమామహేశ్వర్‌రెడ్డిని అడుగగా గుండ్లకుంట తనిఖీ కేంద్రం వద్ద పట్టుబడిన నగదు ఎల్ఐసీ వారికి సంబందించిందని, సదరు అధికారులు సాక్షాధారాలు చూపడంతో పై అధికారుల ఆదేశాల మేరకు ఆ నగదును గంగాధర్‌రెడ్డికి స్వాధీనం చేసినట్లు సీఐ తెలిపారు.

డ్రైవింగ్ లైసెన్స్ మేళాను వినియోగించుకోండి

ప్రొద్దుటూరు క్రైం : ఈనెల 16వ తేదీ ప్రొద్దుటూరు ప్రాంతీయ రవాణా కార్యాలయంలో ఆటో డ్రైవర్ల కోసం ప్రత్యేకంగా ట్రాన్స్‌పోర్టు లైసెన్స్ బ్యాడ్జీ మేళా నిర్వహిస్తున్నామని, దీన్ని ఆటో డ్రైవర్లు సద్వినియోగం చేసుకోవాలని ఆర్‌టీవో డీఎస్ రవూఫ్ విజ్ఞప్తి చేశారు. ఇప్పటికే తమ పరిధిలో 893 ట్రాన్స్‌పోర్టు లైసెన్స్‌లు మంజూరు చేయడం జరిగిందన్నారు. ఆటో డ్రైవర్లు లైసెన్స్ పొంది ఏడాది పూర్తి అయి, విద్యార్హతలు ఉన్నవారు ట్రాన్స్‌పోర్టు లైసెన్స్ పొందుటకు అర్హులన్నారు. ఆటోడ్రైవర్లు తప్పనిసరిగా ట్రాన్స్‌పోర్టు లైసెన్స్ కలిగి వుండాలని సూచిస్తూ, ఈ విషయంలో ఆటో డ్రైవర్లకు అయా ఆటోకార్మిక సంఘాల నాయకులు ట్రాన్స్‌పోర్టు లైసెన్స్ ఉపయోగం గురించి తెలియజేసి, ట్రాన్స్‌పోర్టు లైసెన్స్ మేళాకు వారిని తీసుకురావాలని సంఘాల ప్రతినిధులకు ఆర్టీవో తెలిపారు.

నిరాహార దీక్షలకు కౌన్సిలర్ మద్దతు

ప్రొద్దుటూరు అర్బన్: మద్యం దుకాణాలు తొలగింపుకోసం ఆదివారం మద్యవ్యతిరేక ఐక్యవేదిక చేపడుతున్న నిరాహార దీక్షలకు మద్దతు తెలుపుతున్నట్లు 26వ వార్డు కౌన్సిలర్ సాబరాబాను, టీడీపీ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షులు ఎన్.ఫరీద్‌బాషలు పేర్కొన్నారు. వరుసగా అయిదు మద్యం దుకాణాలు పెట్టడం వలన మహిళలు ఇబ్బందులు పడుతున్నారని, మద్యం సేవించడం వలన కుటుంబాలు విచ్ఛిన్నమవుతాయని వారు తెలిపారు. 26వ వార్డులో ఇళ్ల, బళ్ల, గుళ్ల మద్య పెట్టిన అయిదు మద్యం దుకాణాలు తొలగించాలని మహిళలు చేస్తున్న ఉద్యమానికి తాము సంపూర్ణ మద్ధతు తెలిపి పాల్గొంటున్నట్లు తెలిపారు. చంద్రబాబు కూడా మహిళలు వ్యతిరేకిచే చోట జనావాసాలున్న చోట మద్యం దుకాణాలు పెట్టవద్దన్నారని తెలిపారు. ఎక్సైజ్ అధికారులు ప్రజల అభ్యర్థనను పరిగణలోకి తీసుకొని దుకాణాలను తరలించాలని డిమాండ్ చేశారు.

ధార్మిక పాఠశాలకు 'రోటరీ క్లబ్' వితరణ

ప్రొద్దుటూరు క్రైం : ఖాదరాబాదులో ఉన్న ధార్మిక పాఠశాలకు ప్రొద్దుటూరు రోటరీ క్లబ్ వారు ఫ్యాన్లు, కుర్చీలు, పుస్తకాలు వితరణగా అందించారు. శనివారం రోటరీ క్లబ్ అధ్యక్షులు అయూబ్‌ఖాన్ ఆ పాఠశాల అవసరాల నిమిత్తం వాటిని ధార్మిక పాఠశాలకు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధార్మిక పాఠశాలను ఏర్పాటు చేసి పేదలకు విద్యను అందిస్తున్న కడప ఇస్లామిక్ వెల్ఫేర్ సొసైటి కృషి అభినందనీయమన్నారు. ధార్మిక పాఠశాలలో విద్యను అభ్యసించడానికి తల్లిదండ్రుల ప్రోత్సాహం ఉండాలన్నారు. పాఠశాల అవసరాల నిమిత్తం ఫ్యాన్లు, కుర్చీలు, పుస్తకాలు అందించడం జరిగిందని, భవిష్యత్తులో ఈ పాఠశాల అభివృద్ధికి తమ వంతు సాయం అందిస్తామన్నారు. కడప ఇస్లామిక్ వెల్ఫేర్ సొసైటి సభ్యులు షేక్ అమీన్, ఫక్రుసాహెబ్, గ్రామ పెద్దలు మహబూబ్‌బాష, రసూల్, మహమూద్, జమాల్‌బాష, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

పారిశుధ్యంపై స్పెషల్ డ్రైవ్

ప్రొద్దుటూరు అర్బన్: ప్రొద్దుటూరు పట్టణంలో పెరుగుతున్న దోమల వ్యాప్తిని నివారించడానికి పారిశుధ్యంపై నాలుగు డివిజన్లలో స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. శనివారం 27వ వార్డులో ఆవాసాల మధ్య నిలబడిన వర్షం నీటిని తొలగించేందుకు శానిటరీ సూపర్‌వైజర్ నూర్‌బాష ఆధ్వర్యంలో మోటార్లు పెట్టి నీటిని కాలువల్లోకి మళ్లించారు.

కాలినడకన గండికి తరలివెళ్లిన భక్తులు

వీరపునాయునిపల్లె: మండలంలోని వివిధ గ్రామాల నుంచి గండి క్షేత్రానికి కాలినడకన భక్తులు తరలివెళ్లారు. చిలంకూరు, ఎర్రగుంట్ల, పాయసంపల్లె, కమలాపురం, ఇనగలూరు, గంగనపల్లె గ్రామాల నుంచి భక్తులు వీరపునాయునిపల్లె మీదుగా కాలినడకన వెళ్లి అంజన్న సన్నిధికి చేరి పూజలు చేశారు.

పౌష్టికాహారం అందించడమే లక్ష్యం

● ఐసీడీఎస్ సూపర్‌వైజర్ భారతి



సికెదిన్నె: గర్భిణులు, పిల్లలకు పౌష్టికాహారం అందించడమే లక్ష్యంగా అంగన్‌వాడీ సెంటర్లు పని చేస్తున్నాయని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ ఆర్.భారతి తెలిపారు. ఆమె ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ.....

?: మండలంలో మొత్తం ఎన్ని అంగన్‌వాడీ సెంటర్లు ఉన్నాయి ?

జవాబు : మండల వ్యాప్తంగా మొత్తం 81 అంగన్‌వాడీ సెంటర్లు ఉన్నాయి. గ్రామీణ ప్రాంతంలో 56, పట్టణ ప్రాంతంలో 25 ఉన్నాయి.

?: అన్ని అంగన్‌వాడీ సెంటర్లకు స్వంత భవనాలు ఉన్నాయా ?

జవాబు: మండలంలో కొన్నింటికి మాత్రమే సొంతభవనాలు ఉన్నాయి. కొన్నింటికి స్థలాలు కేటాయించి నిర్మాణం జరుగుతుంది. గ్రామీణ ప్రాంతాలలో 10 సెంటర్లు, పట్టణ ప్రాంతాల్లో 18 సెంటర్లకు స్థలం లేక ఇబ్బందులు పడుతున్నాము.

?: అన్న అమృతహస్తం ఎలా అమలవుతోంది ?

జవాబు: అన్న అమృతహస్తం 6 నెలల పిల్లల నుంచి 3 సంవత్సరాల పిల్లలకు పౌష్టికాహారం అందించేందుకు ఉద్దేశించింది. అందరికి ప్రభుత్వం అందించే అన్ని వసతులు పంపిణీ చేస్తున్నాయి.

?: అంగన్‌వాడీ కేంద్రంలో మెనూ ఎలా పాటిస్తున్నారు ?

జవాబు : అన్ని అంగన్‌వాడీ కేంద్రాలలో ప్రతి రోజు గుడ్డు, పప్పన్నం అందిస్తున్నాము. గర్భిణులకు పాలు, గుడ్డు, అన్నం అందిస్తాము. వారికి పౌష్టికాహారం అందించి ఆరోగ్యవంతమైన సమాజ ఏర్పాటుకు కృషి చేస్తున్నాము.

15న బండలాగుడు పోటీలు

కమలాపురం రూరల్: ఈనెల 15న శ్రీ కృష్ణాష్టమి వేడుకల సందర్భంగా పట్టణంలోని శ్రీరాధాక్రిష్ణ ఆలయంలో పాలదంతాల ఎద్దులకు బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. మొదటి బహుమతి రూ.20వేలు, రెండో బహుమతి 15 వేలు, మూడో బహుమతి రూ.10వేలు, నాలుగో బహుమతి రూ.5వేలు, ఐదో బహుమతి రూ.3వేలు అందజేస్తున్నట్లు తెలిపారు. అలాగే ముగ్గుల పోటీలలో మొదటి బహుమతికి 3వేలు, రెండో బహుమతి రూ.2వేలు, మూడో బహుమతి రూ.వెయ్యి అందిస్తామన్నారు. 13 నుంచి 15 వరకు పౌరాణిక నాటకాలు వుంటాయని మొదటి, రెండో, మూడు బహుమతులు వరసగా రూ.10వేలు, 6వేలు, రూ.3 వేలు వుంటాయన్నారు. వీటిని పుత్తా నరసింహారెడ్డి చేతుల మీదుగా అందజేస్తామన్నారు.

వేదాస్‌లో ముందస్తు వేడుకలు

వల్లూరు: మండల పరిధిలోని వేదాస్ పాఠశాలలో శనివారం ముందస్తు క్రిష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. సోమవారం రోజున శ్రీకృష్ణుని పుట్టిన రోజు సందర్భంగా ఈ వేడుకలు నిర్వహిస్తారు. అందులో భాగంగానే వేదాస్ పాఠశాలలో పిల్లలకు శ్రీకృష్ణ వేషధారణలు వేశారు. వేడుకల్లో ప్రిన్సిపాల్ ధర్మధీరజ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అన్నదానం పుణ్యకార్యం

సికెదిన్నె: అన్నదానం ఎంతో పుణ్యకార్యమని డీఎస్పీ నాగేశ్వర్‌రెడ్డి తెలిపారు. శ్రావణ మాసం మూడో శనివారం సందర్భంగా బాలాజీ ట్రస్టు చైర్మన్ ఏటూరు రామచంద్రారెడ్డి ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శ్రావణ మాసంలో ప్రతి సంవత్సరం పాదయాత్ర ప్రారంభించి ప్రతి శనివారం అన్నదానం నిర్వహిస్తూ భక్తులకు ఎంతో సేవ చేస్తున్న ఏటూరు ఎంతో ధన్యుడన్నారు. బాలాజీ ట్రస్టు పేరుతో అనేక రకాలుగా సేవలు అందిస్తున్నాడన్నారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు అన్నదానం నిర్వహించడం వలన భక్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. కార్యక్రమంలో రిమ్స్ సీఐ మోహన్‌ప్రసాద్, యువనాయకుడు పుత్తా లక్ష్మీరెడ్డి, నరెడ్డి కిశోర్‌కుమార్‌రెడ్డి, సుబ్బారెడ్డి, ట్రస్టు సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.



అన్నదానం నిర్వహిస్తున్న దృశ్యం

సినిమా గైడ్

కమలాపురం	
ప్రదీప్	: ఫిదా
చెన్నూరు	
కృష్ణ	: లై

గెలుపోటములను సమానంగా తీసుకోవాలి





కబడ్డీ పోటీలను ప్రారంభిస్తున్న సీఐ శ్రీనివాసులరెడ్డి, కబడ్డీ ఆడుతున్న క్రీడాకారులు

కమలాపురం రూరల్: ప్రతి క్రీడాకారుడు క్రీడాస్ఫూర్తితో ఆడి గెలుపోటములను సమానంగా తీసుకోవాలని ఎర్రగుంట్ల సీఐ శ్రీనివాసులరెడ్డి అన్నారు. ఈనెల 15న శ్రీకృష్ణజయంతిని పురస్కరించుకొని రైల్వేగేటు సమీపంలో పుత్తా కుటుంబీకులు నిర్మించిన శ్రీరాధాక్రిష్ణ ఆలయంలో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పుత్తా నరసింహారెడ్డి ఆధ్వర్యంలో శనివారం జిల్లాస్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను సీఐ ప్రారంభించి మాట్లాడుతూ పూర్వకాలం నుంచి పండుగలకు క్రీడాపోటీలు నిర్వహించడం సంప్రదాయమని, అలాంటి వాటిని ఇక్కడ పాటిస్తుండడం శుభపరిణామమన్నారు. క్రీడాకారుల్లో స్నేహభావం, సోదరభావం కలుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ రఫీ, మండల ఉపాధ్యక్షుడు వాసుదేవరెడ్డి, ఖాదర్‌బాష, నరసింహారెడ్డి, సుబ్బారెడ్డి, సునీల్, ఆలయ నిర్వాహకుడు నరసింహశర్మ, వ్యాయామ ఉపాధ్యాయులు సునీల్, తిరుపాల్‌రెడ్డి, శివశంకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


ఉత్సాహంగా కబడ్డీ పోటీలు

రాధాక్రిష్ణ ఆలయం సన్నిధిలో నిర్వహించిన జిల్లాస్థాయి కబడ్డీ పోటీలు ఉత్సాహంగా సాగాయి. ఈ పోటీలలో 24 జట్లు పాల్గొన్నాయి. ఈనెల 15వ తేదీన సెమీఫైనల్, ఫైనల్ మ్యాచ్‌లు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. విజేతలకు అదేరోజు మొదటి బహుమతి రూ.6వేలు, రెండో బహుమతి రూ.4వేలు, మూడో బహుమతి రూ.2వేలు అందజేస్తామన్నారు.

పాలకొండకు పోటెత్తిన భక్తజనం

● కన్నుల పండుగగా కల్యాణం ● ఘనంగా శ్రావణ మాసోత్సవాలు





కల్యాణానికి హాజరైన భక్తులు.. స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు

సికెదిన్నె: కడప నగర శివారులోని పాలకొండలకు శనివారం భక్తులు పోటెత్తారు. శ్రావణ మాసంలో మూడో శనివారం సందర్భంగా పాలకొండ్రాయుడిని దర్శించుకునేందుకు భక్తులు అధిక సంఖ్యలో వచ్చారు. దీంతో కొండ నిండా జనమే.. ఎక్కడ చూసినా భక్తులతో కొండ కిటకిటలాడింది. రెండో శనివారం సెలవుదినం కావడంతో సామాన్య ప్రజలతో పాటు, ఉద్యోగులు సైతం అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఈ సందర్భంగా భక్తులు పాలకొండ్రాయుడి ఇష్టమైన పాలతో భక్తులు అభిషేకం చేశారు. భక్తులు పాలను పాలకొండరాయుని పాదాల చెంత మొదలు పెట్టి కొండ పైకి ధారగా పొస్తూ పోయారు. అంతేకాక మొక్కుబడులు ఉన్నవారు భక్తులకు అన్నదానాలు, మజ్జిగ, మంచినీరు అందించారు.

కన్నులపండువగా కల్యాణం

లక్ష్మీపాలకొండ్రాయునికి కళ్యాణం కన్నులపండువగా జరిగింది. భక్తుల సమక్షంలో వేదపండితుల మంత్రోచ్చరం మధ్య కల్యాణం ఎంతో అద్భుతంగా జరిగింది. కల్యాణం జరిగే సమయంలో వరుణుడు కూడా మేఘాలు తెచ్చి భక్తులకు ఎండ లేకుండా పందిరి వేసినట్లు చల్లని వాతావరణం కల్పించారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదానం చేశారు.

వల్లూరులో శ్రావణ శనివార వేడుకలు

వల్లూరు: మండల పరిధిలో పలు ఆంజనేయస్వామి దేవస్థానాల్లో మూడో శ్రావణ శనివారం సందర్భంగా ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు. శ్రావణ మాసం సందర్భంగా ఆలయాల్లో స్వామి వారికి పంచామృత అభిషేకాలు, వడమాలలు, ఆకుపూజలను నిర్వహించారు. వల్లూరులోని ఆంజనేయస్వామి, గోటూరు, కోట్లూరు, కుమారినిపల్లె తదితర ఆంజనేయస్వామి గుడిలలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గోటూరు వద్ద పూజానంతరం వచ్చిన భక్తులకు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. పుష్పగిరి క్షేత్రంలో కూడా వైభవంగా పూజలు నిర్వహించారు. పైడికాలువ గ్రామంలో ఉన్న రాజ్యలక్ష్మీసమేత చెన్నకేశవ ఆలయంలో రాహుకాల అభిషేకాన్ని నిర్వహించి అన్నదాన కార్యక్రమాలను చేపట్టారు.

వీరపునాయునిపల్లెలో...: మండల పరిధిలోని సంగమేశ్వర ఆలయం, సంగాలపల్లె అభయాంజనేయస్వామి, తంగేడుపల్లె ఎస్ఆర్ కాలనీలో ఉన్న ఆంజనేయస్వామి ఆలయంలో, వీఎన్‌పల్లెలోని వీరాంజనేయస్వామి ఆలయాల్లో మూడో శ్రావణ శనివారం సందర్భంగా శ్రావణశోభ సంతరించుకున్నాయి. ఆంజనేయస్వామి స్వామివారికి అర్చనలు, అభిషేకాలతో భక్తుల రద్దీతో ఆలయాలు కిటకిటలాడాయి. అనంతరం ఆలయ నిర్వాహకులు తీర్థప్రసాదాలు పంచిపెట్టారు. తంగేడుపల్లె ఎస్ఆర్ కాలనీలో ఉన్న ఆంజనేయస్వామి ఆలయంలో భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటుచేశారు.

సికెదిన్నెలో...: మండలంలో మూడో శ్రావణ శనివారం సందర్భంగా ఆంజనేయస్వామి ఆలయాల్లో భక్తులు ఘనంగా పూజలు నిర్వహించారు. మండలంలోని బుసిరెడ్డిపల్లె, ఆంజనేయస్వామి ఆలయంలో బయనపల్లె ఆంజనేయస్వామి ఆలయంలలో తదితర ఆలయాలలో భక్తులు పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాలు నిర్వహించి, చెక్కభజనలు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని పూజలు నిర్వహించారు.

టీడీపీ అభ్యర్థి గెలుపు కోసం పుత్తా ప్రచారం

కమలాపురం రూరల్: నంద్యాలలో జరగనున్న ఉప ఎన్నికలలో టీడీపీ అభ్యర్థి భూమా బ్రహ్మానందరెడ్డి గెలుపు కోసం టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పుత్తా నరసింహారెడ్డి, పెద్దచెప్పలి సింగిల్‌విండో అధ్యక్షుడు సాయినాథశర్మ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పుత్తా మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్రాభివృద్ధికి నిరంతరం శ్రమిస్తున్నారని నంద్యాల అన్ని రంగాలలో అభివృద్ధి చెందాలంటే టీడీపీ అభ్యర్థికి అధికంగా ఓట్లు వేసి గెలిపించాలన్నారు. ఈ సందర్భంగా 28వ డివిజన్ ప్రాంతంలో ప్రచారం నిర్వహించారు. ఆయన వెంట కడప జిల్లా గ్రంథాలయ చైర్మన్ రామకోటిరెడ్డి, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.



నంద్యాల ప్రజలను కోరుతున్న పుత్తా

వేదాస్ ప్లే స్కూలులో ముందస్తు శ్రీకృష్ణాష్టమి వేడుకలు

కమలాపురం రూరల్: స్థానిక వేదాస్ ప్లే స్కూలులో ముందస్తు శ్రీకృష్ణాష్టమి ఉత్సవాలను హెచ్ఎం అన్నపూర్ణమ్మ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శ్రీక్రిష్ణుడు చిన్నతనంలో చాలా చిలిపి పనులు చేసేవాడని, అలాంటి శ్రీక్రిష్ణుడి జన్మదినం జరుపుకోవడం మన ఆచారమన్నారు. చిన్నారులతో క్రిష్ణ, రాధ వేషధారణ వేయించారు.



శ్రీకృష్ణ, రాధ వేషధారణలో వేదాస్ పాఠశాల చిన్నారులు

కృష్ణాష్టమి వేడుకల్లో భక్తులు పాల్గొనాలి

వేంపల్లె: జన్మాష్టమి సందర్భంగా వడ్డెవీధి శ్రీకృష్ణ ఆలయంలో నిర్వహించే వేడుకల్లో భక్తులు పాల్గొనాలని ఆలయ ప్రతినిధి దేరంగుల రామాంజనేయులు విజ్ఞప్తి చేశారు. సోమవారం ఉదయం ప్రత్యేక పూజలు గోపూజ, అన్నదానం, సాయంత్రం ఉట్టికొట్టే కార్యక్రమం, సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయన్నారు. భక్తులందరు హాజరై కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు. కాగా వేంపల్లె నాలుగు రోడ్ల కూడలిలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో కృష్ణాష్టమి సందర్భంగా ఉదయం గోపూజ సాయంత్రం ఉట్టికొట్టే కార్యక్రమం ఉంటుందని ఆలయ పూజారి శ్రీనాథ్ తెలిపారు.

నంద్యాలలో వైసీపీ గెలుపు తథ్యం

పులివెందుల టౌన్: నంద్యాల ఉప ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థి శిల్పా మోహన్‌రెడ్డి అత్యధిక మెజార్టీతో గెలుస్తాడని వైసీపీ రాష్ట్ర లీగల్‌సెల్ జనరల్ సెక్రటరీ ఓబుళరెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి సురేష్‌రెడ్డి, వైసీపీ నాయకుడు విజయభాస్కర్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు విలేకరులతో మాట్లాడుతూ నంద్యాల ఉప ఎన్నికల్లో అక్రమ మార్గంలో గెలవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అనేక కుయుక్తులు పడుతున్నారని ఆరోపించారు. ఎన్నికల ముందు సాధ్యం కాని హామీలు ఇచ్చి ఓటర్లను ప్రభావితం చేసి ముఖ్యమంత్రి అయిన చంద్రబాబుకు నంద్యాల ఓటర్లు గుణపాఠం చెబుతారన్నారు. నంద్యాలలో నారాయణ విద్యాసంస్థల విద్యార్థులచే ఓటర్లను భయభ్రాంతులకు గురిచేయడం సిగ్గుచేటన్నారు. ఎలాంటి అక్రమాలు జరగకుండా రాష్ట్ర ఎన్నికల కమిషన్ కేంద్ర బలగాలు ఏర్పాటు చేసి నిష్పక్షపాతంగా ఎన్నికలు నిర్వహించాలని వారు కోరారు.



విలేకరులతో మాట్లాడుతున్న వైసీపీ నాయకులు

తుంగలో నిబంధనలు - రోడ్లపైనే బోర్లు

పులివెందుల టౌన్: పట్టణంలో నిబంధనలను తుంగలో తొక్కారు. ఏకంగా రోడ్లపైనే బోర్లు వేస్తున్నారు. ఈ విషయం అధికారులకు తెలిసినా ఏమీ పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. గుంతబజార్, మారుతీహాల్ బజార్, జెండామానువీధి ఏరియాల్లో ఇష్టారాజ్యంగా బోర్లు ఏర్పాటు చేశారు. రహదారుల్లో బోర్లు వేయడం నిబంధనలకు పూర్తి విరుద్ధమైనా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. ఇళ్లముందు, రహదారుల్లో వందల అడుగుల లోతున బోర్లు వేస్తున్నారు. వీరికి వాల్టాచట్టం అడ్డురాదా అని పలువురు ప్రశ్నిస్తున్నారు.

ఇక్కడికి సమీపంలో కొందరు అవసరార్థమై ఇళ్లలో బోర్లు వేసుకున్నారు. ప్రస్తుతం ఇక్కడ వేసిన బోరు వలన సమీప ఇళ్లలో వేసిన బోర్లలో నీరు అడుగంటి పోయే ప్రమాదముందని చుట్టుపక్కల ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు వాల్టా చట్టం అనుసరించే విధంగా, రహదారుల్లో బోర్లు వేయకుండా చర్యలు తీసుకోవాలని ఆయా వార్డుల ప్రజలు కోరుతున్నారు.



గుంతబజార్‌లో రోడ్డు మధ్యలో వేసిన బోరు

మంత్రులకు అంజన్న ప్రసాదం



మంత్రికి గండి అంజన్న ప్రసాదాన్ని అందిస్తున్న బీజేపీ నాయకులు

వేంపల్లె: రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి మాణిక్యాలరావు, వైద్యఆరోగ్య శాఖ మంత్రి కామినేని శ్రీనివాస్‌కు గండి వీరాంజనేయస్వామి ప్రసాదాలను అందజేశారు. గండి దేవస్థాన పాలక మండలి సభ్యులు బీజేపీ వేంపల్లె మండల శాఖ అధ్యక్షుడు శంకర్‌రెడ్డి, కడప జిల్లా బీజేపీ అధ్యక్షుడు శ్రీనాథరెడ్డి, మాజీ జిల్లా అధ్యక్షుడు శశిభూషణ్‌రెడ్డి విజయవాడలోని మంత్రులను కలిసి ఆంజనేయస్వామి లడ్డూ ప్రసాదాన్ని అందించారు. ఆలయ అభివృద్ధికి సహాయ సహకారాలు అందించాలని దేవాదాయశాఖ మంత్రికి వారు విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో అంజన్నకు పూజలు

పులివెందుల టౌన్: శ్రావణ మాసం మూడో శనివారాన్ని పురస్కరించుకుని అంజన్న ఆలయాల్లో భక్తులు పూజలు చేశారు. పడమటి వీరాంజనేయస్వామి, పీడబ్ల్యూడీ కాలనీ ఆంజనేయస్వామి ఆలయం, కోటి సమాధి ఆలయం, తూర్పు ఆంజనేయస్వామి ఆలయాల్లో అంజన్నకు ఆకుపూజలు చేశారు. ఆయా ఆలయాల అర్చకులు స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు.



ముందస్తు కృష్ణాష్టమి వేడుకలు

పులివెందుల టౌన్: పట్టణంలోని రిషి పాఠశాలలో ముందస్తు కృష్ణాష్టమి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. పాఠశాల విద్యార్థులచే శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. చిన్నారుల నృత్యం అందరినీ అలరించింది. అనంతరం పాఠశాల ఎండీ అర్జున్‌రెడ్డి మాట్లాడుతూ శ్రీకృష్ణుడు భగవద్గీత ద్వారా ఎన్నో విషయాలను ప్రపంచానికి చెప్పారన్నారు. భగవద్గీతను ప్రతి ఒక్కరు తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ సర్వోత్తమరెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అంధులకు చేయూత

వేంపల్లె: అనాథలను చేరదీసి ఆదుకోవడం అభినందనీయమని వేంపల్లె ఉషాకిరణ్ హైస్కూల్ కరస్పాండెంట్ రమణారెడ్డి పేర్కొన్నారు. పులివెందులలోని వీరనారాయణ స్వామి అంధ మహిళా ఆశ్రమంలోని అనాథలకు వస్తువులు పెట్టుకునే ట్రంకుపెట్టెల కోసం ఆర్థిక సహాయం అందించారు. అంధవిద్యార్థులకు విద్యాబుద్ధులు చెబుతున్న ఆశ్రమ నిర్వాహకులు వెంకట మహేశ్వరిని అభినందించారు. రమణారెడ్డి సతీమణి విజయలక్ష్మి, కుమారుడు బాంధవరెడ్డి పాల్గొన్నారు.



ఆర్థిక సాయం అందిస్తున్న రమణారెడ్డి దంపతులు

వృద్ధుల దినోత్సవం సందర్భంగా బియ్యం పంపిణీ

పులివెందుల టౌన్: ప్రపంచ వృద్ధుల దినోత్సవం సందర్భంగా నారాయణ పాఠశాల ప్రిన్సిపాల్ హైమావతి ఆధ్వర్యంలో విద్యార్థులు ఇప్పట్ల వద్దనున్న లీలావతి వృద్ధాశ్రమంలోని వృద్ధులకు పండ్లు, బిస్కెట్లను పంపిణీ చేశారు. సరుకుల్లో భాగంగా బియ్యం, కందిపప్పు పంపిణీ చేశారు. అమ్మానాన్న, అమ్మమ్మ, తాతయ్యలను ప్రేమగా చూసుకుంటామని ప్రిన్సిపాల్ విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం వృద్ధులకు పండ్లు పంచిపెట్టారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతో వ్యాధులు దూరం

మలేరియా సబ్‌యూనిట్ అధికారి సిద్దయ్య



రికార్డులు పరిశీలిస్తున్న సబ్‌యూనిట్ అధికారి సిద్దయ్య

వేంపల్లె: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే చాలా వరకు వ్యాధులను దూరం చేయవచ్చని పులివెందుల మలేరియా సబ్‌యూనిట్ అధికారి సిద్దయ్య విజ్ఞప్తి చేశారు. వేంపల్లె ప్రభుత్వ వైద్యశాలను, ల్యాబ్‌ను పరిశీలించి రికార్డులను తనిఖీ చేశారు. ఆస్పత్రికి వచ్చే రోగులకు సంబంధించిన రక్తపూతలు సక్రమంగా చేస్తున్నారా లేదా అనే విషయాన్ని తెలుసుకున్నారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. దోమలు వృద్ధిచెందకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడమే ఏకైక మార్గమన్నారు. సిబ్బంది పాల్గొన్నారు.

వాసవీ క్లబ్ అధ్యక్షుడు దినేష్‌కు సన్మానం



వాసవీక్లబ్ అధ్యక్షుడు దినేష్‌ను సన్మానిస్తున్న తూగుట్ల కుటుంబ సభ్యులు

పులివెందుల టౌన్: వాసవీ క్లబ్ అధ్యక్షుడు దినేష్ గుప్తకు శనివారం సన్మానం నిర్వహించారు. స్థానిక శ్రీచక్రసహిత శ్రీమహాలక్ష్మి ఆలయంలో సన్మానం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ తూగుట్ల మధుసూదన్‌రెడ్డి, ఆలయ నిర్వాహకులు తూగుట్ల రామచంద్రారెడ్డి వారి కుటుంబ సభ్యులు శాలువ, పూలమాలలతో సత్కరించారు. మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో అధ్యక్షుడు గుప్తా దినేష్‌కు బంగారు పతకం లభించిందన్నారు. ఆయనను స్ఫూర్తిగా తీసుకుని సేవా కార్యక్రమాల్లో సేవలు చేయాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో తూగుట్ల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.